జూన్
2021

182

సంపుటి : 16 సంచిక : 1 వెల రు. 10/-

## ఈ సంచికలో........

కరోనా రెండో వెల్లువ : వైఫల్యాలు, సవాళ్లు
కరోనా : కేరళ ప్రభుత్వ ప్రత్యామ్నాయ చర్యలు
కార్మికవర్గ పోరాటాలకు విలువైన పాఠాలు అందించిన పారిస్ కమ్యూన్
1848-64 : కమ్యూనిస్టు మానిఫెస్టో నుండి మొదటి ఇంటర్నేషనల్ వరకు
కష్టమైనా నష్టమైనా జనంతోనే...
ఇనుము వాడకం- ఉత్పత్తిలో మిగులు ఏర్పడడం
మతోన్మాదానికి లౌకికవాద ప్రతిఘటన
భారత ప్రభుత్వాలు- వ్యవసాయ చట్టాలు
పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ పూర్వాపరాలు
కమ్యూనిస్టు పార్టీ పోరాటాలతో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు

# కమ్యూనిస్టు పార్టీ పోరాటాలతో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు

**భా**షాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు జరిగిన పోరాటాలలో కమ్యూనిస్టులు మార్గదర్శ కులుగా నిలిచారు. విశాలాంధ్ర, ఐక్య కేరళ పోరాటాలలోనే కాక ఎంతోమంది కమ్యూనిస్టు, వామపక్ష నాయకులు సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారు; (సాధారణంగా దీనిని సమితి అంటారు) వీటి ఫలితంగానే మహారాష్ట్ర ఒక రాష్ట్రంగా ఏర్ప డింది. ఇందుకు భిన్నంగా ఆర్ ఎస్ ఎస్, దాని అధినేత గోల్వాల్కర్ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును వ్యతిరేకించాడు. 1956లో (రాష్ట్రాల పునర్విభజన కమిషన్) భాష ప్రాతిపదికగా రాష్ట్రాలను ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. అయితే మహారాష్ట్ర, గుజరాత్‌లను కలిపి ద్విభాషా రాష్ట్రంగా ఉ ంచాలని సిఫారసు చేసింది. కేంద్ర ప్రభుత్వం బొంబాయిని కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించింది. దీనికి వ్యతిరేకంగా భారీస్థాయి ప్రదర్శనలు ఆ ప్రాంతాన్నంతటిని ఊపేశాయి. ఇతర ప్రాంతాలలో కూడా కమ్యూనిస్టులు వీరికి సంఘీభావ ఉద్యమాలను నిర్మించారు. ఈ పోరాట కాలంలో మహారాష్ట్రలో 106 మంది పోలీసు కాల్పులలో చనిపోయారు. చివరికి కేంద్రం దిగివచ్చి మరాఠి మాట్లాడేవారికి బొంబాయి రాజధానిగా మహారాష్ట్ర, గుజ రాతీ మాట్లాడే వారికి గుజరాత్ రాష్ట్రాలను ఏర్పరచడానికి 1960 మే 1వ తేదీన అంగీక రించవలసి వచ్చింది.

ఈ సమస్యపై పార్టీ అవగాహనకను గుణంగా ఒక వివరణాత్మకమైన మెమొరాం డాన్ని తయారుచేసి 1954, జూన్‌లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్‌కి కేంద్రకమిటి సమర్పించింది. అందులో కొన్ని భాగాలను ఇక్కడ పొందుపరుస్తున్నాం.

"భారత ప్రభుత్వం ఎట్టకేలకు రాష్ట్రా లను పునర్విభజించే సమస్యను పరిష్కరించేం దుకు ఒక కమిషన్‌ను నియమించడం హర్షణీయం. దేశంలో భాషల ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడాలని ప్రజలలో పెరుగుతున్న ఆందోళనలను ఇంకెంత మాత్రం విస్మరించడం సాధ్యంకాదని ప్రభుత్వం గుర్తించిందని ఇది స్పష్టం చేస్తున్నదన్నది మా అభిప్రాయం.

"కానీ పార్లమెంటులో ప్రధానమంత్రి ప్రకటన చేస్తూ ఈ కమిషన్ కేవలం భాషా సంస్కృతులను మాత్రమే కాకుండా ఆర్థిక స్వావలంబన, పరిపాలనా సౌలభ్యాన్ని, దేశ సమైక్యత, రక్షణ అంశాలను కూడా పరిశీలి స్తుందని ప్రకటించాడు. ఈ ప్రకటన ప్రజలలో సహజంగానే అనుమానాలను రేకెత్తించింది. ఈ కమిషన్ భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడ కుండా చేయడానికి సాకులను వెతుకుతుందేమో అని, కనీసం కొన్ని రాష్ట్రాల విషయంలో అయినా ఈ అనుమానం నిజమవుతుందేమోనని భయపడుతున్నారు.

"ఇప్పుడున్న రాష్ట్రాలకు ఒక తర్కబద్ధమై ప్రాతిపదిక లేదన్న విషయం సుస్పష్టమే. ప్రధానమంత్రి స్వయంగా అంగీకరించినట్టు 'ఇది ఒక చారిత్రిక క్రమంలో, బ్రిటిష్ పాలకులు భారతదేశంలో తమ పాలనను విస్తరించుకుని, స్థిరపరచుకునే క్రమంలో జరిగింది. ప్రజా తంత్ర విధానాన్ని అభివృద్ధి చేయడం, పరిపాల నను సులభతరం చేయడానికి ఇది పనికిరాదు. దేశంలోని అనేక ప్రాంతాల ప్రజల మధ్య పరస్పర వైషమ్యాలు పెంచటా నికి, తద్వారా ప్రజాస్వామ్య ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయటానికి ఈ విధానం బ్రిటిష్ వారికి తోడ్పడింది.

"దేశంలో వివిధ ప్రాంత ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి, ప్రజాతంత్ర ఉద్యమాలను విచ్ఛిన్నం చేసేందుకు ఉ ద్దేశపూర్వకంగా ప్రయత్నాలు చేస్తున్న క్రమం లోనే జాతీయోద్యమం భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడాలన్న డిమాండ్‌ను ముందుకు తీసుకొచ్చింది. ఈ డిమాండ్ భారత ప్రజల ఐకమత్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి కాక, ప్రజలను రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక తదితర జీవన రంగాలన్నింటిలోనూ భాగస్వాములను చేయటం, తద్వారా దేశ ఐక్యత, రక్షణలను మరింత బలపరచటం కోసం ఉద్దేశించినది.

"అందువలన భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం జరిగిన పోరాటం స్వాతంత్ర్యం, ప్రజాతంత్ర హక్కుల కోసం జరిగిన పోరాటం లో భాగమే. ప్రజలు ప్రజాతంత్ర వ్యవస్థ పునర్నిర్మాణంలో, ఆర్థిక జీవనంలో పూర్తిగా భాగస్వాములు కావాలంటే భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తప్పనిసరి అని కమ్యూనిస్టు పార్టీ అభిప్రాయం పడింది. అలా చేయకుండా దేశం ఆర్థికంగా ప్రగతిని, అభివృద్ధిని సాధించలేదు. పైగా విభిన్న భాషలు మాట్లాడే అన్ని తరగతుల ప్రజలలో ప్రజాస్వామ్య సంస్కృతి అభివృద్ధి చెందాలంటే, వారి భాష, సాహిత్యం అభివృద్ధి చెందాలంటే, భాషా ప్రాతి పదికన రాష్ట్రాల విభజన తప్పనిసరి. భారతదేశం ఐక్యంగా, ప్రజాతంత్రయుతంగా నిర్మించబడాలి అంటే పటిష్టమైన, సురక్షితమైన పునాదిపై రాష్ట్రాల విభజన జరగాలి. అప్పుడే ఉమ్మడి అభివృద్ధి కోసం, ప్రయోజనాల కోసం, సమానత్వం కోసం, ప్రజాస్వామ్యం కోసం ప్రజలు స్వచ్ఛందంగా సహకరిస్తారు.

"1947 ఆగస్టులో బ్రిటిష్ పాలన అంతం అవగానే దేశ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక జీవనంలో తమకు సంపూర్ణ భాగస్వామ్యం ఉండాలని ప్రజలు పట్టుబట్టడం సహజం. భాషల ప్రాతిపదికన రాష్ట్రాల విభజన జరగా లనే కోరికతో దేశంలో ప్రజాతంత్ర ఉద్య మం ఉవ్వెత్తున ఎగసింది.

"హైదరాబాద్ సంస్థానం విభజించబడ కుండా భాష ప్రాతిపదికన దక్షిణ భారతదేశంలో రాష్ట్రాలు ఏర్పడడం అసాధ్య మని మా పార్టీ కేంద్ర కమిటీ భావిస్తున్నదన్న అభిప్రాయాన్ని మీ ముందు ఉంచదలిచాము.

"రాష్ట్రాలను పునర్విభజన చేసేటపుడు పస్తుతం అమలు లో ఉన్న ఏ ,బి,సి అనే విభజనలను పూర్తిగా తొలగించాలని కమిషన్‌ని పార్టీ కేంద్రకమిటీ కోరుతున్నది. భారతదేశం లోని ప్రజలు ప్రజాతంత్ర హక్కులను అనుభవించటంలో ఎలాంటి వివక్ష ఉండకూడదు. 'రాజప్రముఖ్'ను, ఆయనకున్న ప్రత్యేకమైన హక్కులన్నింటినీ తక్షణం రద్దు చేయాలని, వారికి ఎటువంటి ప్రత్యేక ప్రయో జనాలు కల్పించకూడదని కూడా కేంద్రకమిటీ కోరుతున్నది. అంతేకాక వారికిచ్చే రాజభర ణాలు రద్దుచేయాలి. వారి సంపద అంతా దేశ ఆర్థిక వనరులను దోపిడి చేసి సుపాదించినదే

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. కమ్యూనిస్టు పార్టీ పోరాటాలతో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ........ 2

2. కరోనా రెండో వెల్లువ : వైఫల్యాలు, సవాళ్లు
ప్రబీర్ పుర్కాయస్థ ....... 4

3. కరోనా : కేరళ ప్రభుత్వ ప్రత్యామ్నాయ చర్యలు
పినరయి విజయన్ ......10

4. కార్మికవర్గ పోరాటాలకు విలువైన పాఠాలు అందించిన పారిస్‌కమ్యూన్
బివి రాఘవులు........ 13

5. 1848-64 : కమ్యూనిస్టు మానిఫెస్టో నుండి మొదటి ఇంటర్నేషనల్ వరకు
తమ్మినేని వీరభద్రం ....16

6. కష్టమైనా నష్టమైనా జనంతోనే...
ఎస్.వీరయ్య ...... 20

7. ఇనుము వాడకం- ఉత్పత్తిలో మిగులు ఏర్పడడం
ఎం.వి.ఎస్.శర్మ.... 22

8. మతోన్మాదానికి లౌకికవాద ప్రతిఘటన
వెంకటేశ్ రామకృష్ణన్ ... 24

9. భారత ప్రభుత్వాలు- వ్యవసాయ చట్టాలు
ఎ. కోటిరెడ్డి ........ 28

10. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ పూర్వాపరాలు
బివి రాఘవులు . 32



సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ఫోన్: ఎడిటర్ : 9490099333

ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
మేనేజర్: కె.హరికిషోర్: 9490098977
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com


# వైద్యం

కరోనా మహమ్మారి యావత్భారత దేశాన్ని కబళిస్తున్న వేళ ఆ మహమ్మారి నుండి ప్రజల ప్రాణాలు రక్షించడానికి ఆధునిక వైద్య శాస్త్రం తీవ్రంగా కృషి చేస్తుంటే మరోవైపు అభివృద్ధి నిరోధక శక్తులు ఆ విజ్ఞాన శాస్త్రం మీదనే దాడి చేస్తున్నాయి. కరోనాకు ఆధునిక వైద్యం అక్కరలేదు ఆవు పేడ, ఆవు మూత్రం, చిట్కా వైద్యాలు చాలని ఆర్ఎస్ఎస్-బిజెపి అనుయాయులు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారు. ఆయుర్వేదం పేరుతో వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్న బాబా రామ్‌దేవ్ కరోనాను సాకుగా చూపించి శాస్త్రీయ వైద్యవిధానాన్నే ప్రశ్నిస్తున్నారు. కరోనాకు మందు పేరుతో ఆయన తయారు చేసినట్టు చెబుతున్న ఆయుర్వేద మందు 'కరోనిల్'కు ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్టిఫికేట్ ఇచ్చిందని చేసిన తప్పుడు ప్రచారాన్ని ఆ సంస్థ ఖండించింది. కరోనిల్ బోగస్ అని తేలిపోయింది. వాస్తవానికి ఆయుర్వేదంతో సహా ఇతర వైద్య పద్ధతులన్నీ కొన్ని రోగాలను నయం చేస్తే చేసిఉండొచ్చుగాక కానీ కరోనాను అరికట్టే విషయంలో ఇంతవరకూ ఆ విధానాలు ఉపయోగపడలేదు. కరోనాను అరికట్టడంలో ఘోరంగా విఫలమైన ఆర్ఎస్ఎస్-బిజెపి ప్రజల దృష్టిని మళ్లించడానికి నానా రకాల తప్పుడు ప్రచారాలను చేస్తూనే ఉంది. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో ఆనందయ్య నాటు మందు కరోనాను తగ్గిస్తుందని వచ్చిన ప్రచారాన్ని కూడా దానిలో భాగంగానే చూడాలి.

ఆనందయ్య నాటు మందు వల్ల నష్టం లేదు కదా, తప్పో ఒప్పో కరోనా రోగులు వాడితే పోలా అని వాదించిన వారికి తరువాత అక్కడ జరిగిన పరిణామాలే సరైన సమాధానం చెబుతున్నాయి. ఆనందయ్య నాటు మందుతో కోలుకున్నానని సోషల్ మీడియాలో వైరల్ చేసిన పాఠశాల ఉపాధ్యాయుడు కోటయ్య, రోగం ముదిరి చనిపోయారు. నాటు మందు తీసుకున్న ఇంకా అనేక మంది చనిపోయారు. చాలా మంది ఆసుపత్రుల్లో తీవ్ర స్థితిలో చికిత్స పొందుతున్నారు. ఇది చాలదా నాటు మందు చేసే నష్టాల గురించి తెలుసుకోడానికి?

కరోనా అనేది గతంలో మానవాళి ఎరుగని కొత్త రకం వైరస్ వల్ల సంభవిస్తున్న వ్యాధి. ఏడాది క్రితం మానవుల్లో ఈ కొత్త వైరస్ వెలుగు చూసిన వెనువెంటనే శాస్త్ర వేత్తలు దాని జన్యు క్రమాన్ని కనుగొన్నారు. అనేక రకాల టెక్నాలజీలను ఉపయోగించి నెల రోజుల్లోనే వైరస్‌ను అరికట్టగలిగే వ్యాక్సిన్ రూపొందించారు. మామూలుగా అనేక సంవత్సరాలు పట్టే వ్యాక్సిన్ పరీక్షలను ఏడాదిలోపుకు కుదించి డజనుకు పైగా వ్యాక్సిన్‌లను వినియోగంలోకి తీసుకువచ్చారు. మరోవైపు కరోనా చికిత్స విధానాలనూ, మందులను కూడా ఏడాదిలోపలే అభివృద్ధి చేసి ప్రజల ప్రాణాలు కాపాడుతున్నారు. ఇదంతా ఆధునిక వైద్యం వల్లనే సాధ్యమైంది. ఈ ఆధునిక వైద్యం అందరికీ అందించగలిగితే కరోనాను నివారించడం సాధ్యమేనని చైనా, వియత్నాం వంటి దేశాలు రుజువు చేస్తున్నాయి.


కానీ మన దేశంలో దానికి భిన్నంగా జరిగింది. నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వ వైఫల్యం వల్ల మహమ్మారి తీవ్ర స్థాయిలో వ్యాపించింది. రోగులకు ఆసుపత్రులు చాల లేదు. బెడ్లు లేవు, ఆక్సిజన్, మందులు, వ్యాక్సిన్‌లు దొరక్క ఆరోగ్య సంక్షోభం ఏర్పడింది. ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీ, మందులు, ఆక్సిజన్ తదితరాల బ్లాక్ మార్కెటింగ్‌తో ప్రజలకు వైద్య వ్యవస్థ మీదనే నమ్మకం పోయే పరిస్థితి వచ్చింది. ఈ పరిస్థితిని చక్కదిద్దుకుని ముందుకు పోవడం కాకుండా వెనక్కి, ప్రాచీన కాలంలోకి నడిస్తే మెరుగైన జీవితం లభిస్తుందని చీకలి శక్తులు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు సులువుగా నమ్మే పరిస్థితి ఏర్పడింది. కానీ కరోనా మహమ్మారి దేశంలో సృష్టించిన ఈ సంక్షోభానికి కారణం ఆధునిక వైద్యం కాదు. ఆ వైద్యాన్ని ప్రయివేటుకు అప్పగించి వ్యాపారంగా మార్చిన ప్రభుత్వాలది. ప్రజారోగ్యం ప్రభుత్వం చేతుల్లో ఉన్న ఏ దేశంలోనూ మన దేశంలో లాంటి దయనీయ పరిస్థితులు తలెత్తలేదు, ఎందుకు? ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ అక్కడి ప్రజల్లో నమ్మకం కలిగించింది కాబట్టి.

భారత దేశంలోనూ, మన రాష్ట్రంలోనూ ఏ శక్తులైతే ప్రజారోగ్య వ్యవస్థను భ్రష్టు పట్టించాయో ఆ శక్తులే నేడు ప్రజల్లోని అభద్రతా భావాన్ని ఉపయోగించుకుని ఆధునిక వైద్యంపై దాడి చేస్తున్నాయి. ఆధునిక వైద్యం తరతరాల ప్రజల విజ్ఞానం నుండి పుట్టినది. దాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యాపారంగా మార్చినందున అది ప్రజలకు దూరమై కొన్ని సందర్భాల్లో వారిని భయపెడుతోంది. దాన్ని పూర్తిగా ప్రజాశ్రేయస్సు కోసం ఉపయోగించుకోవాలంటే వైద్యాన్ని మార్కెట్ మాయాజాలం నుండి విముక్తి చేయాలి. వైద్య రంగాన్ని ప్రభుత్వ పరం చేయడానికి ఉద్యమించడమొక్కటే దీనికి మార్గం.

**ఈ మాసం ముఖ్యాంశం**

# కరోనా రెండో వెల్లువ : వైఫల్యాలు, సవాళ్లు

**ప్రబీర్ పుర్కాయస్థ**



రచయిత పీపుల్స్ సైన్స్ ఉద్యమ నాయకుడు, రచయిత, న్యూస్ క్లిక్ వెబ్ పోర్టల్ నిర్వాహకుడు

**(జనవిజ్ఞాన వేదిక ఆంధ్ర ప్రదేశ్ కమిటీ వారు ఇటీవల 'కరోనా రెండో వెల్లువ : వైఫల్యాలు, సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన ఆన్‌లైన్ సదస్సులో పీపుల్స్ సైన్స్ ఉద్యమ కార్యకర్త, రచయిత, న్యూస్ క్లిక్ వెబ్ పోర్టల్ నిర్వాహకులైన ప్రబీర్ పుర్కాయస్థ చేసిన ప్రసంగ పాఠాన్ని 'మార్క్సిస్టు' పాఠకుల కోసం అందిస్తున్నాం..... సంపాదకుడు)**

ఈ రోజున మనం ఎదుర్కొంటున్నది కేవలం కరోనా మహమ్మారి సంక్షోభం మాత్రమే కాదు. మనం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ సంక్షోభాన్ని కూడా ఎదుర్కొంటున్నాం. ఈ సంక్షోభ ప్రభావం ప్రజారోగ్య వ్యవస్థ మీద ఎలా ఉందో మనం చూస్తున్నాం. ఇంతే కాదు మనం ఈ రోజు ఇంకో సంక్షోభాన్ని కూడా చూస్తున్నాం. అది ప్రజాస్వామ్య సంక్షోభం. అందువల్ల ఈరోజు కరోనా సంక్షోభంతో ముడిపడి ఉన్న ఈ మూడు సంక్షోభాలను గురించి నేను మాట్లాడతాను.

**ఆరోగ్య సంక్షోభం**

ఈ రోజు మనం చూస్తున్న కరోనా సంక్షోభం అనేది మన దేశంలోని ఆరోగ్య సంక్షోభాన్ని సూచిస్తున్నది. ఇప్పుడు జరుగుతున్నది కేవలం కరోనా రెండో వెల్లువలో ప్రజలు పెద్ద ఎత్తున మహమ్మారి బారిన పడ్డం, అది కూడా లక్షల సంఖ్యలో కరోనాకు గువడం, దీని గురించి మనం ముందుగానే తగు జాగ్రత్తలు తీసుకోలేక పోవడం మాత్రమే కాదు ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో మన ఆరోగ్య రంగం పూర్తిగా విఫలం అయిన విషయాన్ని చూస్తున్నాం. సంక్షోభాన్ని ఎదుర్కోడానికి తగిన ఆసుపత్రులు మన దగ్గర లేవు, తగినంత ఆక్సిజన్ లేదు, పడకలు లేవు అన్నిటికీ మించి తగినంత మంది ఆరోగ్య సిబ్బంది లేరు. చివరిది అన్నిటికన్నా ముఖ్యమైనది. ఆరోగ్యం అంటే పడకలు, ఆక్సిజన్ మాత్రమే కాదు, ఈ సంక్షోభాన్ని పరిష్కరించే ఆరోగ్య సిబ్బంది కూడా. ఇవన్నీ తగినంతగా లేకపోవడం వల్లనే ఈ రోజు కరోనా వల్ల దేశంలో ప్రజలు పెద్ద సంఖ్యలో చనిపోతున్నారు. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంటుందని ముందుగా గమనించకపోవడం వల్లనే ఈ రోజు మన దేశంలో ప్రజలు ఇంత పెద్ద సంఖ్యలో చనిపోతున్నారు.

ప్రపంచంలోనే నేడు అత్యధిక కరోనా బాధితులు మన దేశంలో ఉన్నారు. ప్రపంచంలో కరోనా సోకి ఇప్పటికీ కోలుకోకుండా ఉన్న వారి సంఖ్యలో 50 శాతం భారత దేశంలోనే ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కొత్తగా కరోనా సోకుతున్న వారి సంఖ్య చూస్తే 50 శాతం మంది భారత దేశం నుండే వస్తున్నారు. అందువల్ల ఈ రోజు కరోనా మహమ్మారికి కేంద్రంగా మన దేశం ఉన్నదన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రశ్న ఏమంటే, ఇంటువంటి తీవ్ర స్థాయిలో రెండవ వెల్లువ వస్తుందని కేంద్ర ప్రభుత్వం ఎందుకు అంచనా వేయలేకపోయింది? ఎందుకని ఏడాది కన్నా ఎక్కువ సమయం మనకు ఉన్నప్పటికీ మన దేశాన్ని ఇటువంటి సంక్షోభాన్ని ఎదుర్కోడానికి ఎందుకు సిద్ధం చేయలేక పోయాము? దేశాన్ని రెండో వెల్లువకు సిద్ధం చేయకపోవడ వల్లనే మహమ్మారి ఒక్కసారి ముంచెత్తేసరికి మన దగ్గర సరిపడా ఆక్సిజన్ లేదు, సరిపడా వెంటిలేటర్లు లేవు, సరిపడా పడకల్లేవు. చివరికి మొదటి వెల్లువలో నిర్మించిన కోవిడ్ సెంటర్లను కూడా ఈ కాలంలో రద్దు చేసేశారు. అందువల్ల స్వాతంత్రం వచ్చిన తరువాత మనకు ఇంత గొప్ప సమర్థవంతమైన ప్రభుత్వం ఏనాడూ లేదని గొప్పలు చెప్పుకున్న కేంద్ర ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని ఎందుకు అంచనా వేయలేకపోయింది? దాని 'సామర్థ్యం' ఏమైంది? కరోనా సంక్షోభం భారత దేశ ఆరోగ్య రంగం పెద్ద ఎత్తున ప్రజలు రోగాల బారిన పడితే తట్టుకోలేని సంక్షోభంగా ఎలా మారింది? అన్నవి ప్రశ్నలు.

**వ్యాక్సిన్ల సంక్షోభం**

దీంతోపాటు ఈ రోజున మనం వ్యాక్సిన్ల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాం. వాస్తవం ఏమంటే 2020సంవత్సరంలో ప్రపంచ వ్యాక్సిన్‌లలో 60 శాతాన్ని భారత దేశం ఉత్పత్తి చేసింది. ప్రపంచంలో అత్యధిక వ్యాక్సిన్‌లు ఉత్పత్తి చేసి సరఫరా చేసే దేశాల్లో భారత్ ఒకటి. ప్రపంచానికి కావలసిన వ్యాక్సిన్‌లలో 60 శాతం మన దేశమే సరఫరా చేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో నేడు మనం మన ప్రజలకు వ్యాక్సిన్‌లు అందించలేని దౌర్భాగ్య పరిస్థితుల్లోకి వెళ్లడమే కాకుండా, ప్రపంచ ఆరోగ్య సంస్థ 'కోవాక్స్' కార్యక్రమం ద్వారా 92 దేశాలకు వ్యాక్సిన్ సరఫరా చేస్తామని ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక పోయాము. వాస్తవానికి 92 దేశాలతో మనం వ్యాక్సిన్ సరఫరా కాంట్రాక్టులు చేసుకుని అడ్వాన్సులు కూడా పుచ్చుకుని చివరికి వాటికి సరఫరా చేయలేక చేతులెత్తేశాం. ఎందువల్ల ఈ విధంగా జరిగింది? ప్రజలను దీర్ఘకాలం లో కరోనా నుండి రక్షించే ఏకైక మార్గం వ్యాక్సిన్‌లు మాత్రమే అని తెలిసి ఉండి కూడా వ్యాక్సిన్‌లు ముందుగానే సమకూర్చుకోడానికి సన్నాహాలు ఎందుకు చేసుకోలేకపోయాం? ప్రభుత్వ రంగ సంస్థలైన భారత వైద్య పరిశోధనా మండలి, భారత వైరాలజీ విభాగాలు తయారు చేసిన 'కోవాక్సిన్' వాక్సిన్‌నూ, రెండోదైన 'కోవీషీల్డ్' వ్యాక్సిన్ పరీక్షలకు మనం అంగీకరించాం. అయినప్పటికీ మనకు కావలసిన

మోతాదులో వ్యాక్సిన్ సరఫరా చేసేందుకు వాటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో ఎందుకు పూర్తిగా విఫలమైనాము?... ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి నేను ప్రయత్నిస్తాను.

**ప్రభుత్వ వైఫల్యానికి కారణమేమిటి?**

ఈ ప్రభుత్వం ఎందుకు విఫలమయిందో ఇప్పుడు స్పష్టంగా అర్థమవుతోంది. మొదటిది, ప్రభుత్వం తన స్వంత ప్రచార పటాటోపాన్ని నమ్మి భ్రమల్లో పడిపోయింది. తమ ప్రభుత్వం కరోనా మహమ్మారిపై విజయం సాధించిందనీ, నాయకత్వం సరైన మార్గనిర్దేశం చేయడం వల్ల దేశంలో కరోనా మహమ్మారి అంతమైపోయిందని అది భావించింది. ప్రభుత్వం ఏదైతే నమ్మిందో ఆ మాటలను మాత్రమే వినడానికి సిద్ధపడిందిగానీ దాన్ని భిన్నమైన విషయాలను, విమర్శనాత్మక సూచనలను వినడానికి ఇష్టపడలేదు. అంటే మహారాజుగారు వినదలుచుకున్న దాన్ని మాత్రమే ప్రజలు చెప్పాలిగానీ దానికి భిన్నంగా చెప్పకూడదని బిగదీసుకు కూర్చుంది. అంటే విమర్శనాత్మక సూచనలు వినడానికి ప్రభుత్వం సిద్ధపడక పోవడం ఒక కారణం.

ఇక రెండో కారణం, ఒకవైపు దేశంలో కరోనా కేసులు పెరుగుతుంటే మరోవైపు ప్రభుత్వం ప్రతిపక్షలపై యుద్ధంలో తీరికలేకుండా ఉంది. పలు రాష్ట్రాల్లో – కేరళ, తమిళనాడు, అస్సాం, పశ్చిమ బెంగాల్, పాండిచేరి ఎన్నికల్లో విజయాలను ప్రకటించుకునే రందీలో నిండా మునిగిపోయింది. ఈ రాష్ట్రాల్లో ప్రతిపక్షాలను ఓడించి, విజయాలు ప్రకటించుకోవాలనుకున్న ప్రభుత్వం కరోనా మహమ్మారి వ్యాపించకుండా ఏటువంటి చర్యలు తీసుకోవాలి అన్న విషయం మీద దృష్టి పెట్టలేకపోయింది. ప్రభుత్వ ఈ ధోరణి వల్లే దేశంలో ఈ సంక్షోభం ఏర్పడింది.

**ప్రజాస్వామ్య సంక్షోభం**

ప్రభుత్వం సృష్టించిన మూడో సంక్షోభం ఏమంటే, ప్రజలను కరోనా మహమ్మారి నుండి రక్షించడానికి చర్యలు తీసుకోవడానికి బదులు వారు ఈ సంక్షోభం గురించి మాట్లాడకుండా, నిజమైన సమస్యల గురించి ప్రపంచానికి ఎవరూ చెప్పకుండా నిరంకుశ చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. అయితే ఏది దాచినా ఒక్క విషయాన్ని, అంటే మరణిస్తున్న ప్రజల సంఖ్యను మాత్రం దాచిపెట్టడం కష్టం. ప్రజలు పెద్ద ఎత్తున కరోనా బారిన పడి మరణిస్తున్నారన్న విషయం మనకు తెలుసు. ఈ విషయమే ప్రపంచ దృష్టిని కూడా ఆకర్షించింది. దేశంలోని అన్ని చోట్లా శ్మశానాల్లో పెద్ద ఎత్తున

**“ ప్రభుత్వం, ప్రజలను కరోనా మహమ్మారి నుండి రక్షించడానికి చర్యలు తీసుకోవడానికి బదులు వారు ఈ సంక్షోభం గురించి మాట్లాడకుండా, నిజమైన సమస్యల గురించి ప్రపంచానికి ఎవరూ చెప్పకుండా నిరంకుశ చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. అయితే ఏది దాచినా ఒక్క విషయాన్ని, అంటే మరణిస్తున్న ప్రజల సంఖ్యను మాత్రం దాచిపెట్టడం కష్టం. ప్రజలు పెద్ద ఎత్తున కరోనా బారిన పడి మరణిస్తున్నారన్న విషయం మనకు తెలుసు. ఈ విషయమే ప్రపంచ దృష్టిని కూడా ఆకర్షించింది. ”**



కరోనా రెండో వెల్లువ ఉచ్ఛ స్థాయిలో ఉండగా దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని ఒక స్మశాన వాటికలో కరోనా బాధితుల మృతదేహాలను దహనం చేయడానికి కూడా స్థలం చాలని పరిస్థితి ఏర్పడింది.

తగలబడుతున్న మృతదేహాల ఫొటోలను మీడియా ద్వారా ప్రపంచమంతా వీక్షించింది. అందువల్ల అటువంటి ఫొటోలను నిషేధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్తర ప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. నీకు కరోనా వ్యాధి సోకినా ఆక్సిజన్ గురించిగానీ, పడకల గురించిగానీ మరింకదేని గురించిగానీ ఫిర్యాదు చేయకూడదని ఆదేశించింది. నీవు కరోనాతో చనిపోతున్నావా చనిపో. శ్మశానంలో దహనానికి కూడా చోటు లేదా నోరుమూసుకుని ఊరుకో, అంతేగానీ ఫిర్యాదు మాత్రం చేయకూడదు. చేశావా నీ మీద కేసులు పెడతారు. ఇటువంటి నిరంకుశ ఆదేశాల ఫలితంగానే 2000 మృతదేహాలు గంగా నదిలో కొట్టుకుపోవడమో, లేక నదీతీరంలో ఇసుకలో పూడ్చడమో జరిగింది. ఎందుకంటే సరిగ్గా దహన క్రియలు చేయడానికి శ్మశానాల్లో చోటుగానీ, ప్రజల వద్ద ఆర్థిక స్తోమత గానీ లేదు. అందువల్ల కరోనాను కట్టడి చేయలేని ప్రభుత్వం ప్రజల నోళ్లను, వారి నిరసనలను కట్టడి చేయడానికి పూనుకుంది. దీన్ని మనం ప్రజాస్వామ్య సంక్షోభంగా చెప్పవచ్చు.

ఈ రోజున కరోనా విషయాన్ని చూస్తే ఇది కేవలం ఒక అంటు వ్యాధి, కొంతమందికి ఈ అంటువ్యాధి సోకింది అనే ఒక్క అంశంతో అయిపోయే విషయం కాదు. ఈ మహమ్మారి చాలా కాలం పాటు మనతో పాటే ఉంటుంది. ఎంత కాలం ఉంటుందంటే, ప్రజలందరికీ వ్యాక్సిన్‌లు వేసేవరకు అది మనతోనే ఉంటుంది. వ్యాక్సిన్‌లు వేసుకున్న వారికి కూడా బూస్టర్ డోస్‌లు అవసరం కావచ్చు. ఇదీ మన ముందున్న వాస్తవం. మన ముందున్న కరోనా మహమ్మారి పరిస్థితి ఏమిటో మనం ముందుగా అర్థం చేసుకోవాలి. మనం చూస్తున్నది కేవలం ఒక్క మహమ్మారిని కాదు. దేశ వ్యాపితంగా రకరకాల ప్రాంతాల్లో కరోనా వ్యాధి క్లస్టర్లు ఉన్నాయి. అందువల్ల మహరాష్ట్రలో కరోనా తగ్గుముఖం పడుతుంటే మరికొన్ని చోట్ల పెరుగుతోంది. మహరాష్ట్రలో కూడా ముంబయిలో, ఉత్తర మహరాష్ట్రలో కరోనా తగ్గుముఖం పడుతుందటే దక్షిణ మహారాష్ట్రలో పెరుగుతోంది. ప్రస్తుతం ఉత్తరాదిన కాస్త తగ్గుముఖం పడుతుంటే దక్షణ భారతంలోని తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, ఒరిస్సాతదితర రాష్ట్రాల్లో పెరుగుతోంది. అందువల్ల మహమ్మారి అనేది భారత

> “ మహమ్మారి విస్తరిస్తే ఎంత ఆక్సిజన్ అవసరమవుతుందో అంచనా వేయడంలో ఎందుకని ప్రభుత్వం ఇంత పెద్ద వైఫల్యం చెందింది అన్నది అర్థం కాని విషయం. ఈ విషయంలో శాస్త్రవేత్తల, అంటే ప్రభుత్వం నియమించిన శాస్త్రవేత్తల వైఫల్యం ఉంది. వారంతా మహా అయితే లక్ష కేసులుంటాయి అని అంచనా వేశారు. కానీ కేసులు పెద్ద ఎత్తున పెరిగిపోవడంతో తెల్లమొహాలు వేశారు. అందువల్ల ఈ విషయంలో అన్ని స్థాయిల్లో ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తుంది. ”

దేశమంతా ఒక్కలాగా లేదు. దేశమంతటా ఒకే లాగా పెరగడం, తగ్గడం జరగడం లేదు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ కాలాల్లో అది పెరగడం, తగ్గడం జరుగుతోంది. ఒక మనిషికి కరోనా వస్తే అది కుటుంబ సభ్యులకు, స్నేహితులకు వారి ద్వారా ఇతరులకూ వ్యాపిస్తుంది. అందువల్ల దేశంలోని అన్ని ప్రాంతాలకూ అది వ్యాపిస్తుంది. ముఖ్యంగా ఈ రెండో వెల్లువలో కరోనా మహమ్మారి గ్రామీణ ప్రాంతాలకు బాగా విస్తరించింది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో కొద్దిమేరకైనా వైద్య సదుపాయాలున్న చోటనే ప్రజలు ముఖ్యంగా పేద ప్రజలు పెద్ద ఎత్తున చనిపోతుంటే అసలు సరైన వైద్య సదుపాయాలు లేని గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో మనం ఊహించవచ్చు. నిజానికి గ్రామాల్లో ఎంతమందికి కరోనా సోకిందో, ఎంతమంది చనిపోతున్నారో తెలియజేసే రికార్డులే మన దగ్గర లేదు. గ్రామీణ ప్రజలు కరోనా దయాదాక్షిణ్యాలకు వదిలివేయబడ్డారు. కనీస స్థాయిలోనైనా ఆక్సిజన్ సరఫరా చేయగలిగే పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా అసలు సదుపాయాలే లేని గ్రామాల్లో కూడా కరోనా వ్యాపించడం వల్లనే ఈ సారి మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. మనకు ప్రభుత్వాలు ప్రకటిస్తున్న సంఖ్యలు చాలా వరకు తక్కువ చేసి చెబుతున్నవే. కరోనా సోకినవారి గురించి అధికారులు చెబుతున్న సంఖ్య కన్నా కనీసంగా అయిదునుండి ఆరు రెట్లు ఎక్కువమందికి కరోనా సోకి వుంటుంది. చనిపోయిన వారి సంఖ్యలు కనీసం రెండు నుండి మూడు రెట్లు ఎక్కువ ఉంటుంది. అధికారులు మనకు చెప్పిన లెక్కలను బట్టి చూసినప్పటికీ పరిస్థితి చాలా దయనీయంగా ఉన్నట్లే.

భారత దేశంలో కరోనా విషయంలో వ్యవస్థాగత వైఫల్యం ఎంతగా ఉందో ఒక చిన్న ఉదాహరణ చూస్తే తెలిసిపోతుంది. అమెరికాలో కరోనా లక్ష మందికి సోకిందంటే, అమెరికా కన్నా నాలుగు రెట్లు జనాభా ఉన్న భారత దేశంలో కనీసం 4 లక్షల మందికి సోకే అవకాశం ఉన్నదని ఎవరైనా అంచనా వేయడం సులభమే. అందువల్ల అటువంటి పరిస్థితి వచ్చినప్పుడు దేశంలో ఎన్ని ఆసుపత్రి పడకలు కావాలి, ముఖ్యంగా కరోనా వ్యాధిగ్రస్తుల కోసం ఎంత ఆక్సిజన్ సమకూర్చాల్సి ఉంటుంది అన్ని విషయం అంచనా వేయడం ఏమంత పెద్ద విషయం కాదు. నిజానికి ఆక్సిజన్ గాలిలో కావలిసినంత ఉంది. చేయాల్సినదల్లా దాన్ని కాన్‌సెంట్రేట్ చేసి ద్రవరూపంలోకి మార్చడమే. ఇది చాలా చిన్న టెక్నాలజీ. దానికోసం పెద్ద సదుపాయాలు కూడా అవసరం లేదు. వాస్తవానికి మనం ఆక్సిజన్ సమృద్ధిగా ఉత్పత్తి చేయగలం. అయితే మనకు లేనిదల్లా దాన్ని అవసరమైన ప్రాంతాలకు పంపించి సరఫరా చేసే సదుపాయాలే. ఆక్సిజన్ ఉత్పత్తి ప్రాంతం నుండి అది కావాల్సిన ప్రాంతాలకు రవాణా చేయడం ముఖ్యమైన విషయం. అయితే జిల్లా ఆసుపత్రుల్లో ఆక్సిజన్ ఉత్పత్తి చేయవచ్చు. దానికి పెద్ద ఖర్చు కూడా అవదు. చిన్న విషయమే అయినా ఇదంతా చేయడానికి మనకు ఒక ఏడాది సమయం ఉండింది. కానీ ప్రభుత్వం ఈ ప్రాథమిక సదుపా యాలను ఏర్పాటు చేయలేదు. వాస్తవానికి కరోనా వ్యాధితో తీవ్రంగా బాధపడుతున్న రోగులకు ఆక్సిజన్ గొప్ప మందు. కానీ ఈ ఆక్సిజన్ సరఫరాలో కూడా ప్రభుత్వం ఘోరంగా విఫలమయింది. నగరాల్లోనూ, చిన్న పట్టణాల్లోనే కాదు చివరికి దేశ రాజధానిలో ధనవంతులకు కూడా ఆక్సిజన్ అందని పరిస్థితి ఏర్పడింది.

అందువల్ల ఈ వైఫల్యం ఘోరమైనది. ప్రభుత్వం చిన్న లెక్క వేయడంలో, అంటే మహమ్మారి విస్తరిస్తే ఎంత ఆక్సిజన్ అవసరమవుతుందో అంచనా వేయడంలో ఎందుకని ఇంత పెద్ద వైఫల్యం చెందింది అన్నది అర్థం కాని విషయం. ఈ విషయంలో శాస్త్రవేత్తల వైఫల్యం కూడా ఉంది. శాస్త్రవేత్తలు అంటే ఇతర శాస్త్రవేత్తలు కాదు, ప్రభుత్వం నియమించిన శాస్త్రవేత్తల వైఫల్యం ఉంది. వారంతా మహా అయితే లక్ష కేసులుంటాయి అని అంచనా వేశారు. కానీ కేసులు పెద్ద ఎత్తున పెరిగిపోవడంతో తెల్లమొహాలు వేశారు. అందువల్ల ఈ విషయంలో అన్ని స్థాయిల్లో ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తుంది.

### కేరళ ప్రత్యామ్నాయం

కేరళ ఈ విషయంలో ఏం చేసిందో చూస్తే అది రాష్ట్రంలో మౌలిక వైద్య సదుపాయాలు సరిపడేంతగా సమకూర్చుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా తగినన్ని ఆసుపత్రులున్నాయి. అలాగే అది ప్రజలకు అన్ని విధాలా కరోనాను ఎదుర్కొనేందుకు సహాయం అందించింది. అందువల్ల కేరళలో కరోనా కేసులు ఇతర ప్రాంతాలకన్నా తక్కువ కాకపోయినా చనిపోయిన వారి సంఖ్య చూస్తే మాత్రం తేడా బాగా కనిపిస్తుంది. కేరళ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ఇతర ప్రాంతాలతో పోలిస్తే అక్కడ మరణాలు చాలా తక్కువగా ఉన్నాయి. కేరళలో ప్రభుత్వ ఆరోగ్య రంగం బలంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం.

కరోనా వైరస్ వల్ల యువకులకు పెద్దగా ప్రమాదం ఉండదు. కానీ వృద్ధులకు అది సోకితే పరిస్థితి విషమించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే ఇప్పుడు, కోవిడ్ వచ్చి ఏడాది గడిచిన తరువాత ఆ మహమ్మారిని ఎలా నయం చేయాలో మనకు తెలిసి వచ్చింది. పరిస్థితి తీవ్రంగా ఉన్న వారికి కూడా ఎలా చికిత్స చేయాలో మనకు ఇప్పుడు తెలుసు. అయితే అటువంటి చికిత్స చేయాలంటే మనకు మౌలిక వైద్య సదుపాయాలు కావాలి. కానీ ఆ మౌలిక సదుపాయాలనే మన దేశంలో ధ్వంసం చేశారు. దేశాన్ని పాలించిన ప్రభుత్వాలు ఒకదాని వెంట ఒకటి ఈ సదుపాయాలను ధ్వంసం చేస్తూ వచ్చాయి. ముఖ్యంగా నరేంద్ర మోడీ హయాంలో ఈ విధ్వంసం మరింత ఎక్కువగా సాగుతోంది. వైద్యంతో సహా అన్నిటినీ ప్రయివేటు రంగం, వైద్య బీమా చూసుకుంటుంది అని ఆయన చెబుతున్నారు. అందువల్ల ఈనాడు మనల్ని ప్రజల ఆరోగ్యం పట్ల ఏమాత్రం బాధ్యతలేని ప్రభుత్వం పాలిస్తోంది. ప్రభుత్వ వైద్య రంగం బలంగా ఉన్న పరిస్థితికీ, బలహీనంగా ఉన్న పరిస్థితికీ తేడాను మనం ఈనాడు ప్రపంచ వ్యాపితంగానూ చూడొచ్చు, భారత దేశంలో కూడా చూడవచ్చు. ప్రపంచ వ్యాపితంగా చైనా, మంచి


ప్రజారోగ్య వ్యవస్థ ఉన్న బ్రిటన్ వంటి దేశాలకూ ఇతర దేశాలకూ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. దేశంలో ప్రజారోగ్య వ్యవస్థ బలంగా ఉన్న కేరళకూ ఇతర ప్రాంతాలకూ కూడా తేడా కనిపిస్తుంది.

### సవాళ్లను అధిగమించాలంటే...?

ఇప్పుడు మనం మహమ్మారిని ఎలా ఎదుర్కోవాలి అన్న విషయం చర్చిద్దాం. వ్యాక్సిన్ల పరంగా, మందుల పరంగా మహమ్మారిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక్కడ కూడా ప్రజలకు చౌకగా మందులు అందించే బాధ్యత, సరిపడా వ్యాక్సిన్‌లను ఉచితంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. మందులు ఎందుకు చౌకగా అందించాలి? సమాధానం చిన్నదే. ఎందుకంటే ఇక్కడ మందులకు ఎవరు డబ్బు చెల్లించగలరు ఎవరు చెల్లించలేరు అన్న సమస్య కాదు. జీవించే హక్కు మన ప్రాథమిక హక్కు. అందువల్ల మహమ్మారి కాలంలో అవసరం ఉన్న అందరికీ మందులు అందేట్లు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

కానీ జరుగుతున్నదేమిటి? ఈ రోజు రెమిడిసివెర్ మందులు నల్లబజారుకు తరలుతున్నాయి. ఆక్సిజన్ నల్లబజారుకు తరలుతోంది. ఇంకో విషయం ఏమంటే జీవితాలు కాపాడే మందులపై పేటెంట్ హక్కులు ఉంటే అప్పుడు అవి చౌకగా లభించడం దుర్లభమవుతుంది. రెమిడి సెవిర్‌పై పేటెంట్ హక్కులుండబట్టే అది అంత ఖరీదు అయింది. అయితే అదృష్టవశాత్తూ ఈ రోజు ప్రాణాలను కాపాడే కోర్టికల్ స్టెరాయిడ్స్ చౌకగా లభిస్తున్నాయి. ఎందుకంటే ఈ మందులు పేటెంట్ హక్కులకు బయట లభిస్తున్నాయి. అందుకనే అది నేడు చాలా ముఖ్యమైన ఔషధం అయింది. కానీ టోసిలిజుమాప్, ఇటోలిజుమాప్ వంటివి చాలా ఖరీదైన మందులు. ఎందుకంటే అవి పేటెంట్ హక్కుల కింద ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వానికి మనం అడుగుతున్న ప్రశ్న ఏమంటే, కరోనా మహమ్మారి వచ్చినప్పుడు ప్రజలను లాక్‌డౌన్‌లో పడేశారుగానీ పేటెంట్లను బద్దలుగొట్టి అందరూ ఈ మందులు ఉత్పత్తి చేయడానికి ఎందుకు అనుమతివ్వలేదు. మన దేశం మందుల ఉత్పత్తిలో అగ్రభాగాన వుంది కదా! మనల్ని ప్రపంచ మందుల ఖార్ఖానాగా పిలుస్తున్నారు కాదా! అటువంటప్పుడు పేటెంట్ హక్కులు రద్దు చేయాలని మన ప్రభుత్వం అమెరికాతో ఎందుకు పోరాడలేకపోతోంది? నిజానికి మందుల ఉత్పత్తిలో మనం ఎదగడానికి 1971 పేటెంట్ చట్టం ఎంతగానో తోడ్పడింది. ఈ చట్టాన్ని రద్దు చేసిన తరువాత ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి మనం అనేక రాయితీలు పోరాడి సాధించుకున్నాం. కానీ ఈ ప్రభుత్వం ప్రజలకు మందులను చౌకగా సరఫరా చేయడానికి ఆ సౌలభ్యాలను ఎందుకని ఉపయోగించుకోలేకపోతున్నది? కారణం ఈ మహమ్మారిని ఉపయోగించుకుని సూపర్ లాభాలు గడిస్తున్న బహుళజాతి సంస్థల లాభాలకు గండి పడుతుందనేనా?

> ❝ మహమ్మారి విజృంభిస్తే ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవన్నది ప్రపంచ వ్యాపితంగా కనిపిస్తున్న దృశ్యం. అందువల్ల మనకున్న దీర్ఘకాలిక పరిష్కారం ప్రజలందరికీ వ్యాక్సిన్ వేయడమే. అయితే వ్యాక్సిన్‌ల పరిస్థితిని గనుక గమనిస్తే, రెండు ప్రశ్నలు ఉదయిస్తాయి. మొదటిది, తగినన్ని వ్యాక్సిన్‌లు లభించడం. రెండోది, వ్యాక్సిన్‌ల ధరలు, వాటి పంపకం. ❞



ఆక్సిజన్ కోసం క్యూ లైన్లు: దేశంలోని అనేక నగరాల్లో ఆక్సిజన్ సమయానికి అందక అనేక వేల మంది మరణించారు.

### వ్యాక్సినే అసలైన మందు

మనం ఇప్పుడు సంక్షోభానికి సంబంధించి ఒక విషయాన్ని చర్చిద్దాం. మనం ఎదుర్కొంటున్న తక్షణ సమస్య భౌతిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం, తగినన్ని ఆసుపత్రులు. కానీ రెండు మూడు మాసాల్లో చేయాల్సి పని అందరికీ వ్యాక్సిన్‌లు వేయడం. ఇది మాత్రమే భారత దేశం కరోనా నుండి విముక్తి చెందడానికి దీర్ఘకాల పరిష్కారం. ఒకవేళ మనం కరోనా మహమ్మారిని ఓడించకపోతే ఆర్థిక వ్యవస్థ పుంజుకోదు. కొంతమంది ఆర్థిక వ్యవస్థకూ-మహమ్మారికీ పోటీ పెట్టి మాట్లాడుతున్నారు. అంటే కరోనా సమయంలో ఆంక్షలు విధిస్తే ఆర్థిక వ్యవస్థ పుంజుకోదు కాబట్టి ఆర్థిక కార్యకలాపాలను పూర్తిగా అనుమతివ్వాలని అంటున్నారు. ఇది సరైంది కాదు. కరోనా కట్టడికి తగిన ముందస్తు సన్నాహాలతో ఆంక్షలు విధించాల్సి ఉంటుంది. మహమ్మారి విజృంభిస్తే ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవన్నది ప్రపంచ వ్యాపితంగా కనిపిస్తున్న దృశ్యం. అందువల్ల మనకున్న దీర్ఘకాలిక పరిష్కారం ప్రజలందరికీ వ్యాక్సిన్ వేయడమే. అయితే వ్యాక్సిన్‌ల పరిస్థితిని గనుక గమనిస్తే, రెండు ప్రశ్నలు ఉదయిస్తాయి. మొదటిది, తగినన్ని వ్యాక్సిన్‌లు లభించడం లేదు. ప్రజలందరికీ వ్యాక్సిన్ ఉచితంగా ఇవ్వాలంటే మనకు అవి అందుబాటులో ఉండాలి. రెండోది, వ్యాక్సిన్‌ల ధరలు, వాటి పంపకం.

### వ్యాక్సిన్ల ఉత్పత్తిలో పూర్తి వైఫల్యం

ప్రస్తుతం మనం మన దేశ వ్యాక్సిన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పరిశీలిద్దాం. మన దేశం నేడు నెలకు 6.5 కోట్ల డోసుల వ్యాక్సిన్ ఉత్పత్తి చేయగలుగుతోంది. కానీ మన అవసరాలు పరిశీలిస్తే, దేశంలోని ప్రజల్లో 18 సంవత్సరాలు

> ❝ ప్రభుత్వం వ్యాక్సిన్ కొరతను సృష్టించింది, వెను వెంటనే 18 ఏళ్లు దాటిన అందరికీ వ్యాక్సిన్‌లు వేయడానికి అనుమతిచ్చింది. దాంతో ఉన్న కొద్దిపాటి వ్యాక్సిన్‌ల కోసం పోటీ ఏర్పడింది. దానివల్ల వ్యాక్సిన్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి, బ్లాక్ మార్కెట్ ప్రారంభమైంది. ❞

దాటిన వారందరికీ వ్యాక్సిన్‌లు వేయాలంటే 200 కోట్ల డోస్‌లు అవసరం అవుతాయి. అంటే నెలకు 6.5 కోట్ల డోస్‌ల ప్రస్తుత సామర్థ్యంతో ఉత్పత్తి చేస్తూ పోతే 200 కోట్ల డోస్‌లు ఉత్పత్తి చేయడానికి మూడు నుండి మూడున్నర సంవత్సరాలు పడుతుంది. ఉత్పత్తిని ఇంకా పెంచినప్పటికీ రెండు సంవత్సరాలు పడుతుంది. మరి అలాంటి పరిస్థితుల్లో ఈ ఏడాది చివరికి భారత దేశం 18 ఏళ్లు దాటిన వారందరికీ సరిపడా 200 కోట్ల డోస్‌లకు ఉత్పత్తిని పెంచగలదా అన్నది ప్రశ్న. కనీసం ఈ ఏడాది బస్ మిస్ అయినప్పటికీ మరో పది మాసాల్లోనైనా, అంటే వచ్చే ఏడాది ప్రథమార్ధానికైనా అందరికీ వ్యాక్సిన్‌లు వేయగలమా?

మన దేశంలో వ్యాక్సిన్‌లు ఉత్పత్తి చేయగల కంపెనీలు 20 వరకు ఉన్నాయి. కానీ ప్రభుత్వ సంస్థలైన జాతీయ వైరాలజీ సంస్థ, భారత వైద్య పరిశోధనా సంస్థ (ఐసిఎంఆర్)లు కలిసి రూపొందించిన 'కోవాక్సిన్' వ్యాక్సిన్‌ను భారత్ బయోటెక్ అనేక ఒకే కంపెనీకి ఇవ్వడం జరిగింది. ఈ సంస్థలన్నీ ఇనాక్టివేటెడ్ వైరస్ వ్యాక్సిన్‌లను ఉత్పత్తి చేయగలవు. ఇటువంటి టెక్నాలజీలో మనకు వంద సంవత్సరాల అనుభవం ఉంది. ఇది కాకుండా అడినో వైరస్ వెక్టమ్ వ్యాకిన్ వంటి మరింత సంక్లిష్టమైన టెక్నాలజీతో 'కోవీషీల్డ్' వ్యాక్సిన్ ఉత్పత్తి అవుతోంది. ఇటువంటి టెక్నాలజీని ఉపయోగించుకుని మరో 30 కంపెనీలు వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేయగలవు. అంటే మన దేశంలో ఇప్పుడు ఉత్పత్తి అవుతున్న 'కోవాక్సిన్', 'కోవీషీల్డ్' వ్యాక్సిన్‌లు ఉత్పత్తి చేయగల 50 కంపెనీలున్నాయి. ఇన్ని ఉన్నప్పటికీ దేశంలో కేవలం రెండు కంపెనీలకు మాత్రమే ఈ వ్యాక్సిన్‌ల ఉత్పత్తిని అప్పగించారు. వీటిలో ఒకటైన కోవాక్సిన్ ప్రభుత్వ రంగంలో ఉత్పత్తి అయింది. దాన్ని ఒక ప్రయివేటు సంస్థకు అప్పగించారు. ఎందుకిలా చేశారో ఎవరికీ అర్థం కాదు. ప్రభుత్వ రంగం తయారు చేసిన వ్యాక్సిన్ ఉత్పత్తిని మోడీ ప్రభుత్వం దేశంలోని 20 కంపెనీలకు అప్పగించకుండా కేవలం ఒకే కంపెనీకి ఎందుకు అప్పగించింది? దేశంలో 7 పెద్ద ప్రభుత్వరంగ వ్యాక్సిన్ ఉత్పత్తి సంస్థలున్నాయి. ఇందులో బయోఫార్మాస్యూటికల్ ప్రపంచంలోనే మూడో అది పెద్ద వ్యాక్సిన్ ఉత్పత్తి సంస్థ. అంత పెంద్ద సంస్థను వ్యాక్సిన్ ఉత్పత్తికి ఎందుకు అనుమతివ్వలేదు? అందువల్ల మనంత మనమే ఎందుకని వ్యాక్సిన్‌ల ఉత్పత్తిని కేవలం రెండు కంపెనీలకు అప్పగించి వ్యాక్సిన్‌ల తయారీని కుదించి వేసుకున్నాం? అనేది ప్రశ్న. అంటే ఈ రెండు కంపెనీలు లాభాలు గడించడం కోసం ఇలా చేశారను కోవాలా? బహుశా ప్రభుత్వం ప్రజలకు నెమ్మ దిగా వ్యాక్సిన్‌లు వేస్తే చాలు అనుకుందేమో. కానీ పరిస్థితి అది కాదన్న విషయం మనందరికీ కనబడుతోంది.

పేద దేశాల్లో కోల్డ్ చైన్ టెక్నాలజీ లేదు కాబట్టి ఈనాడు ధనిక దేశాల్లో ఉత్పత్తి అవుతున్న వ్యాక్సిన్‌లు మనకు పనికిరావు. ఎందుకంటే ఈ వ్యాక్సిన్‌లను -70 నుండి -80 డిగ్రీల సెల్షియస్ శీతల ఉష్ణోగ్రతల వద్ద పంపిణీ చేయాల్సి ఉంటుంది. భారత దేశంలోగానీ, ప్రపంచంలోని అనేక దేశాల్లోగానీ ఇటువంటి కోల్డ్ చైన్ లేదు కాబట్టి వాటిని ఇక్కడ సరఫరా చేయడం కష్టసాధ్యం. ఈ టెక్నాలజీని విడిచిపెట్టేసినా మిగిలిన రెండు టెక్నాలజీలు మన దగ్గర ఉన్నాయి. ఇవి ఉన్నప్పటికీ దురదృష్టమేమంటే మనం మన ప్రజలకు కావలసిన వ్యాక్సిన్‌లు అందించలేకపోతున్నాం. మన దేశంతోపాటు నేడు వ్యాక్సిన్‌లు ఎగుమతి చేయగల సామర్థ్యం ఉన్న దేశం చైనా. ఆ దేశం కూడా తమ ప్రజలకు వ్యాక్సిన్‌లు వేయాల్సి ఉంది. అయినప్పటికీ చైనా ప్రపంచంలోని అనేక దేశాలకు వ్యాక్సిన్‌లు ఎగుమతి చేయగలుగుతోంది. ఇక మన దేశం, చైనా కాకుండా ఇతర దేశాలు ఎగుమతి చేసే స్థితిలో లేవు కాబట్టి మనం విదేశాల నుండి వ్యాక్సిన్‌లు దిగుమతి చేసుకోవడం కూడా సాధ్యం కాదు.

మొత్తం మీద చూసినప్పుడు వ్యాక్సిన్‌ల విషయంలో అసలు సమస్య ప్రభుత్వమే. మనకు అవకాశం ఉన్నప్పుడు, వ్యాక్సిన్‌ల ఉత్పత్తికి కావలసినంత సమయం ఉన్నప్పుడు వాళ్లు అన్నిటినీ కేంద్రం గుప్పెట్లో పెట్టుకుని ఉత్పత్తిని అడ్డుకున్నారు. సంక్షోభం ముదిరిన దశలో 18 ఏళ్ల పైబడ్డ వారందరికీ వ్యాక్సిన్ వేయొచ్చని మార్గదర్శకాలు జారీ చేశారు. అంతే కాదు వాళ్లు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాల మీదకు నెట్టేయడమే కాకుండా ప్రయివేటు రంగం వ్యాక్సిన్‌ల ద్వారా లాభాలు గడించడానికి ద్వారాలు తెరిచారు.

అందువల్ల ప్రభుత్వం వ్యాక్సిన్ కొరతను సృష్టించింది, వెను వెంటనే 18 ఏళ్లు దాటిన అందరికీ వ్యాక్సిన్‌లు వేయడానికి అనుమతిచ్చింది. దాంతో ఉన్న కొద్దిపాటి వ్యాక్సిన్‌ల కోసం పోటీ ఏర్పడింది. దానివల్ల వ్యాక్సిన్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి, బ్లాక్ మార్కెట్ ప్రారంభమైంది. సరుకులు తక్కువగా ఉండి దాన్ని కొనేవారు ఎక్కువగా ఉంటే ఏం జరుగుతుంది? ధరలు పెరిగిపోతాయి. దాని వల్ల లాభపడేదెవరు? సహజంగానే కొద్ది పాటి కంపెనీలు లాభాలు పోగుచేసుకుంటాయి. భారత దేశంలో కరోనా వ్యాక్సిన్ ఉత్పత్తి చేసే కంపెనీలు ఎన్ని ఉన్నాయి? రెండు మాత్రమే. కరోనా మహమ్మారి జాతీయ విపత్తు అని మనం భావించినప్పుడు ఏం చేయాలి? ప్రజలందరికీ వ్యాక్సిన్‌లు ఉచితంగా ఇవ్వాలి. ఎందుకంటే సంక్షోభం అనేది ఒక వ్యక్తికో కొద్దిమందికో రాలేదు. ఇది సమాజం మొత్తానికి వచ్చిన సంక్షోభం. ఆర్థిక వ్యవస్థకు వచ్చిన సంక్షోభం. ఇలాంటి పరిస్థితుల్లో మనం సరిపడా వ్యాక్సిన్‌లు ఉత్పత్తి చేయకపోవడం వల్ల, సరిపడా వ్యాక్సిన్‌ల ఉత్పత్తికి అవసరమైన డబ్బు పెట్టుబడిగా పెట్టకపోవడం వల్ల, మన స్వంత టెక్నాలజీ లైసెన్సులను మన స్వంత కంపెనీలకు ఇవ్వకపోవడం వల్ల ఈ సంక్షోభం ఏర్పడింది. అందువల్ల ఈ సంక్షోభం ప్రభుత్వం సృష్టించిన సంక్షోభం. మార్కెట్లు, ప్రయివేటు పెట్టుబడి అన్ని సమస్యలను పరిష్కరిస్తుంది అన్న వారి నమ్మకం సృష్టించిన సంక్షోభం ఇది. అందువల్లనే ఈ సంక్షోభంలో ప్రభుత్వం కర్రపట్టుకుని ప్రజలను మాట్లాడకుండా చేయడం మినహా ఇతరత్రా ఏమీ చేయకుండా ఉండిపోయింది. అంటే మోడీ ప్రభుత్వం నమ్మిన సిద్ధాంతం, ప్రభుత్వం ఏమీ చేయకపోయినా మార్కెట్ మాయాజాలమే ప్రజలకు వ్యాక్సిన్‌లు అందిస్తుం

దన్న దాని నమ్మకమే ఈ సంక్షోభాన్ని తెచ్చి పెట్టింది. కానీ దీనికి భిన్నంగా ఇతర దేశాలు ఉదాహరణకు చైనా, చివరికి అత్యంత పెట్టుబడి దారీ దేశమైన అమెరికా కూడా తమ ప్రజలకు కావలసిన వ్యాక్సిన్‌ల కోసం పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టాయి. కానీ మోడీ ప్రభుత్వం మాత్రం చేష్టలుడిగి ఉండిపోయింది. ఫిబ్రవరి వరకు అసలు వ్యాక్సిన్‌ల కోసం ఆర్డర్లే ఇవ్వలేదు. ఆ తరువాత కూడా కేవలం 1.10 లక్షల డోస్‌లకు మాత్రమే ఆర్డర్ ఇచ్చింది. పరిస్థితి విష మించినప్పుడు మాత్రమే అది భారత్ బయోటెక్‌కూ, సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు కొంత అడ్వాన్స్‌తో ఆర్డర్లు ఇచ్చింది. అంతేకాని దేశంలోని రెండు రకాల టెక్నాలజీలను అనేక కంపెనీలకు ఇచ్చి పెద్ద ఎత్తున వ్యాక్సిన్‌ల ఉత్పత్తికి పూనుకోలేదు. పరిస్థితి ముదిరిన తరువాత ఇటీవల మాత్రమే అది మరో మూడు కంపెనీలకు వ్యాక్సిన్ ఉత్పత్తి లైసెన్సులు ఇచ్చింది. కానీ ఇప్పటికే మనం కోల్పోయిన సమయం తిరిగి తీసుకురాలేము కదా!

భారత ప్రజలు సైన్సును అర్థం చేసుకోలేరు అని చాలా మంది భావిస్తూ ఉంటారు. కానీ అది వాస్తవం కాదు. భారత ప్రజలు తమకు కావలసిన సైన్సు, టెక్నాలజీ ఏమిటో దాన్ని ఎల్లప్పుడూ అర్థం చేసుకుంటారు. అందువల్ల వారు ఇప్పుడు ఆసుపత్రులు కావాలని డిమాండ్ చేస్తున్నారు, ఆక్సిజన్ కావాలని, మందులు కావాలని, వ్యాక్సిన్‌లు కావాలని డిమాండ్ చేస్తున్నారు. అందువల్ల సైన్సు అంటే వారికి బాగానే తెలుసు.

కానీ ప్రభుత్వం ఏం చెబుతోంది? ఈ పరిస్థితిని ముందుగా ఊహించలేదని చెప్పడమే కాదు, పరిస్థితి మరీ అంత చెడ్డగా ఏం లేదు అంటోంది. ప్రజలు చనిపోతున్న మాట వాస్తవమే కానీ వారంతా వృద్ధులు ఎలాగూ చనిపోయేవారే అంటోంది. చనిపోయేవారంతా కరోనాతో చనిపోవడం లేదు ఇతర సమస్యల వల్ల చనిపోతున్నారు అని కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నిస్తోంది.

**నిరసన గళాలను నొక్కిపట్టే యత్నాలు**

ఇదంతా ఒక ఎత్తయితే, ఈరోజు మనం మరో సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాం. అది ప్రజాస్వామ్య సంక్షోభం. ప్రజలను వాస్తవాలు చెప్పడానికి అనుమతించడం లేదు. తల్లి తండ్రులను, భార్యా భర్తలనూ, పిల్లలనూ కోల్పోతున్న వారు ఆక్సిజన్ అందక మావారు చనిపోయారని చెప్పడానికి అధికారులు అనుమతించడం లేదు. ఉత్తర ప్రదేశ్‌లో గనక మీరు ఆ పనిచేస్తే పోలీసులు వచ్చి మీ మీద కేసు పెడతారు, మిమ్మల్ని అరెస్టు చేస్తారు. అందువల్ల ఇప్పుడు మనం ప్రజాస్వామ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాం. ప్రజల నిరసన గళాలను అణచి వేస్తున్నారు. వాస్తవాలు చెప్పేవారిని అణగదొక్కుతున్నారు. ఈ ప్రభుత్వం కరోనా సంక్షోభాన్ని నివారించలేకపోవచ్చుగాక కానీ ప్రజలు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోకుండా నివారించగలుగుతోంది. ప్రజలు ఏం వినాలి, ఏం చూడాలి అన్నదాన్ని అది నియంత్రిస్తోంది. దీన్ని అది రెండు విధాలుగా నియంత్రిస్తోంది. మొదటిది, పచ్చి బెదిరింపుల ద్వారా. ఈ బెదిరింపులను మనం అన్ని రంగాల్లో చూస్తున్నాం. మీడియాను బెదిరిస్తున్నారు. జర్నలిస్టులను బెదిరిస్తున్నారు. సోషల్ మీడియాలో మాట్లాడుతున్న వారిని బెదిరిస్తున్నారు. మొత్తం మీద ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసన తెలిపే గళాలను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నారు. రెండోది ప్రభుత్వ ట్రోల్ సైన్యం. (సోషల్ మీడియాలో ఎవరైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే వారిపై తిట్లకు, బెదిరింపులకు దిగే సైబర్ సైన్యం) ప్రభుత్వం మీడియా సంస్థల్లోని పెద్ద సెక్షన్‌ను వారు నియంత్రిస్తున్నది. వీటిద్వారా ప్రభుత్వం తన ప్రచారాన్ని ప్రజల వద్దకు చేర్చడానికి ప్రయత్నిస్తుంది. అదే సమయంలో ప్రజల నిరసన గళాలు వినిపించకుండా అడ్డుకోడానికి ప్రయత్నిస్తుంది. ఈ ప్రయత్నాలను ఎదిరించి నిరసన తెలిపే వారిపై ట్రోల్ సైన్యం దాడికి దిగుతుంది. ఇటీవల కరోనా మీద ఒక కవిత రాసిన గుజరాతీ కవయిత్రి మీద ట్రోల్ సైన్యం ఇలాగే దాడికి దిగింది. నిజానికి ఈ కవయిత్రి ఒక గృహిణి. మోడీకి మంచి మద్దతుదారు. కానీ కరోనాతో వేలాది మంది చనిపోతూ ఉంటే, వేలాది మృతదేహాలు గంగా నదిలోనూ ఇతర నదుల్లోనూ కొట్టుకు వస్తూ ఉంటే ఆమె సహించలేక ఒక కవిత రాసింది. 'గంగా నది శవ గంగగా మారిపోతే రాజుగారు ఏం చేస్తున్నారు? రాజుగారు దుస్తులు లేకుండా ఉన్నారు' అని ఆమె రాసింది. ఈ కవిత రాసినందుకు, ఆమె కరోనా రెండో వెల్లువ ముందు వరకు మోడీ మద్దతు దారు అయినప్పటికీ ఆమెపై ట్రోల్ సైన్యం పెద్ద ఎత్తున దాడికి పూనుకున్నది. బిజెపి డిజిటల్ మీడియా అధిపతి అయిన అమిత్ మాలవ్య నాయకత్వంలో ట్రోల్ ఆర్మీ ఆమెపై ఘోరంగా దాడి చేసింది. ఇదీ దేశంలో ప్రస్తుత పరిస్థితి. మనం ఏ విషమం మీదనైనా గాని, కరోనా విషయం గానీయండి, సిఎఎ విషయం గానీయండి, సాంస్కృతిక అంశాలు గానీయండి, పెద్ద ఎత్తున జరుగుతున్న రైతాంగ ఉద్యమం మీద గానీయండి, చివరికి మీ కుటుంబ సభ్యులు ఆక్సిజన్ అందక చనిపోయినా గానీయండి... దేనిమీదనైనా నిరసన తెలిపావా మన గొంతు నొక్కడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలా దాడి చేయడం ద్వారా ప్రజల గొంతు వినిపించకుండా చేయవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. కానీ వాస్తవం ఏమంటే ప్రభుత్వం ప్రజల గొంతును ఏనాడూ అణచి వేయలేదు.

> **“ ఈ రోజు ప్రజలు తమకు ఏం జరుగుతున్నదో, తమ కుటుంబాలకు ఏం జరుగుతున్నదో అనుభవం ద్వారా తెలుసుకుంటున్నారు. అందు వల్లనే ఈ రోజు మనం మోడీ ప్రభుత్వ ప్రతిష్ట దిగజారిపోవడాన్ని, మోడీ చుట్టూ నిర్మించుకున్న సౌరభం చెరిగిపోవడాన్ని చూస్తున్నాం. అయితే ఇప్పుడు మనం ఒక పరిస్థితి తలెత్తడాన్ని చూస్తున్నాం. అదేమంటే ఇప్పుడు గనుక ప్రజలు నిరసన గళాలు ఎత్తితే వాటిని అణచివేయడం ప్రభుత్వానికి ఇంకెంత మాత్రం సాధ్యం కాదు. ”**


ఈ రోజు ప్రజలు తమకు ఏం జరుగుతున్నదో, తమ కుటుంబాలకు ఏం జరుగుతున్నదో అనుభవం ద్వారా తెలుసుకుంటున్నారు. అందు వల్లనే ఈ రోజు మనం మోడీ ప్రభుత్వ ప్రతిష్ట దిగజారిపోవడాన్ని, మోడీ చుట్టూ నిర్మించుకున్న సౌరభం చెరిగిపోవడాన్ని చూస్తున్నాం. అయితే ఇప్పుడు మనం ఒక పరిస్థితి తలెత్తడాన్ని చూస్తున్నాం. అదేమంటే ఇప్పుడు గనుక ప్రజలు నిరసన గళాలు ఎత్తితే వాటిని అణచివేయడం ప్రభుత్వానికి ఇంకెంత మాత్రం సాధ్యం కాదు.

చివరిగా నేను చెప్పేదేమంటే, మనందరికీ మందులు కావాలి, మనందరికీ వ్యాక్సిన్‌లు కావాలి. కానీ వీటన్నిటినీ మనం ఒక హక్కుగా పొందాలి. వీటిని ప్రజలందరికీ ఆరోగ్యం పొందే హక్కులో భాగంగా ఇవ్వాలే గాని పెట్టుబడిదారీ మార్కెట్ తర్కం ప్రకారం కాదు. అందువల్ల సైన్సు, పెట్టుబడిదారీ సంక్షోభం, ప్రజాస్వామ్యం... ఇదంతా మన మీద ప్రజల మీద ఆధారపడి ఉన్నది. భవిష్యత్తును నిర్ణయించేది అంతిమంగా ప్రజలే.

**(అనువాదం : ఎన్.వెంకట్రావు)**

ఈ మాసం ప్రత్యేకం

# కరోనా : కేరళ ప్రభుత్వ ప్రత్యామ్నాయ చర్యలు



రచయిత కేరళ ముఖ్యమంత్రి

**పినరయి విజయన్**

**(మే 19వ తేదీన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా విజయవాడలోని ఎంబివికె నిర్వహించిన స్మారకోపన్యాసంలో ఆన్‌లైన్‌ద్వారా కేరళ ముఖ్యమంత్రి కామ్రేడ్ పినరయి విజయన్ చేసిన ప్రసంగాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం- సంపాదకుడు.)**

మే 19వ తేదీ కమ్యూనిస్టులకు కేరళలోనే కాక దేశవ్యాపితంగా, ప్రపంచ వ్యాపితంగా కూడా ముఖ్యమైన రోజు. కేరళలో మాకు ఈ రోజు చాలా ముఖ్యమైనది. ఎందుకంటే ఈ రోజు మేము రాష్ట్రంలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు, కేరళ మాజీ ముఖ్యమంత్రి ఇ.కె.నయనార్ వర్ధంతిని జరుపుతాం. దేశవ్యాపితంగా చూస్తే ఈరోజు సిపిఐ(ఎం) వ్యవస్థాపక కార్యదర్శి కామ్రేడ్ సుందరయ్య వర్ధంతిని జరుకుంటాం. ఇక ప్రపంచవ్యాపితంగా కమ్యూనిస్టులు నేడు వియత్నాం విప్లవనేత కామ్రేడ్ హోచిమిన్ జయంతి జరుపుకుంటున్నారు. ఈ ముఖ్యమైన రోజున భారత కమ్యూనిస్టు యోధుల్లో ముఖ్యుడైన కామ్రేడ్ సుందరయ్య స్మారక ఉపన్యాసం చేయడం నాకు లభించిన గౌరవంగా భావిస్తున్నాను.

కామ్రేడ్ సుందరయ్య దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించిన వ్యక్తి. ముఖ్యంగా మా రాష్ట్రం కేరళలో ఉద్యమ నిర్మాణానికి ఆయన ఎంతగానో తోడ్పడ్డారు. కేరళ కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో కామ్రేడ్ కృష్ణ పిళ్లై, కామ్రేడ్ ఇఎంఎస్ నంబూద్రిపాద్ వంటి వారితో బొంబాయిలోనూ, ఇతర చోట్లా ఆయన చర్చలు జరిపారు. తర్వాత కేరళ సందర్శించారు. దాని ఫలితంగానే రాష్ట్రంలో 1937లో కమ్యూనిస్టు పార్టీ తొలి శాఖ ఏర్పడింది.

భారతదేశ స్వాతంత్రోద్యమంలో కామ్రేడ్ సుందరయ్య పాత్ర మనందరికి తెలుసు. ఆయన సహాయనిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. పేదల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో కృషిచేశారు. వారి విముక్తి కోసం ఆయన జరిపిన పోరాటం మనకు తెలుసు. ఆయన స్వగ్రామంలో దళితుల పట్ల అగ్రవర్గ భూస్వాములు పాటిస్తున్న అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారు. కాలేజీ విద్యార్థిగా వుండగానే మద్రాసులో పార్టీ సభ్యుడైనాడు. తదనంతరం 22 ఏళ్ళ ప్రాయంలోనే భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడైనాడు.

వ్యవసాయ కార్మికులను సమీకరించడం కోసం దేశంలో కృషి చేసిన మొదటి వ్యక్తి ఆయన. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారు. రాజ్యసభలోనూ, ఆంధ్ర శాసనసభలోనూ ప్రతిపక్ష నాయకునిగా ఎనలేని కృషి చేశారు. సిపిఐ(ఎం)కు జాతీయస్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ నాయకత్వం వహించారు.

ఈ విషయాలన్నీ అందరికీ తెలిసినవే కాబట్టి వాటి వివరాల్లోకి నేను వెళ్లడం లేదు. అయితే ఆయన చేసిన కృషిలో మనందరం గుర్తు పెట్టుకోకుండా వదిలేస్తున్న విషయం ఒకటుంది. అదేమంటే స్వాతంత్ర్యానికి పూర్వమే దేశంలో అనేకరకాల అంటువ్యాధులు ప్రబలినప్పుడు ఆయన ప్రజలకు నిజంగా ఉత్తమమైన సేవచేశారు. ప్రజలు కలరా, మశూచి వంటి అంటువ్యాధులకు గురైనపుడు తన సోదరుడు రామచంద్రారెడ్డితో కలిసి వారికి సహాయం చేయడం కోసం ఆయన అనేక వైద్య శిబిరాలు నిర్వహించారు.

ఈ రోజుఆయన వర్ధంతి సందర్భంలో, దేశాన్ని కరోనా మహమ్మారి పట్టి పీడిస్తున్న సమయంలో "కరోనా సంక్షోభం-ప్రభుత్వాల పాత్ర" అంశంపై సదస్సు నిర్వహించడం సరైనదని భావిస్తున్నాను. గత ఏడాదిన్నర కాలంలో ప్రపంచం కరోనా వైరస్‌ను కట్టడి చేయడానికి అనే అవస్థలు పడుతోంది. ఈ రోజు మనం నిజంగా జీవన్మరణ పోరాటంలో వున్నాం.

ఈ సమయంలో ప్రజల ప్రాణాలు, జీవన భృతి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉంది. నిజానికి ప్రజాస్వామ్యంలో ఇది ప్రభుత్వాల ప్రాథమిక విధి. కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కరోనా వచ్చిన మొదటి రోజు నుండి ఈ కర్తవ్య నిర్వహణలో నిమగ్నమైంది. అందులో భాగంగానే మేము ప్రజల ప్రాణాలు రక్షించేందుకు దేశంలోనే మొట్టమొదటి సారిగా లాక్‌డౌన్ విధించాం. దాంతోపాటు కరోనా సహాయం కోసం 20,000 కోట్ల రూపాయల ప్రత్యే ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాం. దీనివల్ల ప్రజల జీవనోపాధి రక్షించబడింది.

కరోనా రాక ముందు నుండే గత నాలుగు సంవత్సరాలుగా కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను 'ఆర్ధ్ర మిషన్' కార్యక్రమం ద్వారా బలోపేతం చేస్తూ వచ్చింది. దాని ద్వారా మేము జిల్లా, తాలూకా కేంద్రల్లో కూడా సూపర్ స్పెషాలిటీ వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశాం. ప్రాథమిక వైద్య కేంద్రాలను 'కుటుంబ ఆరోగ్య కేంద్రాలు'గా అభివృద్ధి చేశాము. కేరళలో ఆరోగ్య సదుపాయాల కల్పించడం కోసం ప్రాథమిక సేవల కల్పన పథకంలో భాగంగా 1,100 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది.

దీనితో ప్రజారోగ్య వ్యవస్థలో అదనంగా 5,200 కొత్త పదకలను పెంపొందించాం. ఆధునిక వైరాలజీ సంస్థనూ, ఒక వైద్య కన్సార్టియంనూ నెలకొల్పాం. బయోటెక్నాలజీ మెడికల్ సైన్సు లాబ్‌లను బలపరిచాం. కేరళ రాష్ట్ర డ్రగ్స్ అండ్ ఫార్మాస్యుటికల్స్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను అభివృద్ధి చేశాం. వీటి ద్వారా మందుల ఎగుమతులు కూడా ప్రారంభించాం.

ఈ విధంగా ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా మేము గతంలో 'నిపా', నేడు కరోనా వంటి వైరస్ మహమ్మారులను ఎదుర్కొగలిగాం. ఎప్పుడైతే కరోనా వ్యాధి రాష్ట్రాన్ని తాకిందో వెంటనే మహమ్మారిని ఎదుర్కోవటానికి వా వనరులన్నింటినీ సమీకరించాం. కేంద్రం సూచన మేరకు కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అందరితో సంప్రదించి లాక్‌డౌన్ విధించింది. ఈ సమయంలో ప్రజలకు తగినంత ముందుగానే తెలియజేయడం జరిగింది.

మాలాగా తగిన సన్నాహాలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం అకస్మాత్తుగా లాక్‌డౌన్ విధించడం వల్ల ప్రజలు చెప్పనలవిగాని ఈతి బాధలు అనుభవించారు. ప్రజల మధ్య సంబంధాలపై నిషేధాలు పెడితే సామాజిక, ఆర్థిక జీవనం దెబ్బతింటుందని మాకు తెలుసు. అందుకే మార్చి 18న లాక్‌డౌన్‌కు వెళ్ళక ముందే కేరళ ప్రభుత్వం ప్రకటించిన 20,000 కోట్ల రూపాయల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రజలు రానున్న సంక్షోభాన్ని ఎదుర్కొడానికి ఎంతగానో తోడ్పడింది.

అంతేకాదు రోజువారీ కూలీలు, పేదప్రజల కోసం మేం ప్రత్యేక చర్యలు తీసుకున్నాము. కరోనా వల్ల అన్ని సెక్షన్ల ప్రజలు దెబ్బ తింటారని మాకు తెలుసు. అందుకనే కేరళ ప్రభుత్వం ప్రజలందరికీ చౌకధరల దుకాణాల ద్వారా నిత్యవసర వస్తువులతో కూడిన కిట్‌లను అందజేసింది. కమ్యూనిటీ కిచెన్‌లు పెట్టి భోజనాలు అందించింది.

> **❝ కరోనాను ఎదుర్కొనేందుకు మేము అన్ని పంచాయితీల్లో ఎన్‌హెచ్‌యం, సిఎల్‌టిసిల ద్వారా తాత్కాలిక పోస్టులు సృష్టించాం. దాంతోపాటు వాలంటీర్ల సేవలు ఉపయోగించుకున్నాము. ఆ విధంగా మేము బాధ్యతలు, కార్యకలాపాలను వికేంద్రీకరించడం ద్వారా కోవిడ్‌పై పోరాటాన్ని బలోపేతం చేశాం. స్థానిక స్థాయిలో పంచాయితీలు, వార్డు కమిటీలు పనిచేశాయి. ప్రజలకు శానిటైజర్లు ఇవ్వడంతో బాటు కరోనాను ఎలా ఎదుర్కోవాలో ప్రాథమిక వైద్య కేంద్రాలలోని డాక్టర్లు వారికి వివరించారు. ❞**




**కరోనాను అరికట్టడంలో కేరళలోని వామపక్ష ప్రభుత్వం దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాపితంగా ప్రశంసలు అందుకుంది. చిత్రంలో కేరళ ఉదాహరణ చూపుతూ ఇండియా టుడే పత్రిక కథనం**

కుటుంబశ్రీ హోటళ్ల ద్వారా కూడా భోజనాలు ఏర్పాటు చేశాం. ముఖ్యంగా అతిథి కార్మికులు (అంటే వలస కార్మికులకు) ఉచిత భోజనాలు ఏర్పాటు చేశాం.

అందుకే ఈ కాలంలో కేరళలో ఒక్క వ్యక్తి కూడా ఆకలితో బాధపడలేదు. ఇది మాకు నిజంగా గర్వకారణమే. కరోనా మహమ్మారికి వ్యతిరేకంగా పోరాడటంలో తోడ్పడే విధంగా మేము సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. దీని వల్ల ప్రజలు లాక్‌డౌన్ నిబంధనలు చక్కగా పాటించడానికి తోడ్పడింది.

ఇక కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు మేము అన్ని పంచాయితీల్లో ఎన్‌హెచ్‌యం, సిఎల్‌టిసిల ద్వారా తాత్కాలిక పోస్టులు సృష్టించాం. దాంతోపాటు వాలంటీర్ల సేవలు ఉపయోగించుకున్నాము. ఆ విధంగా మేము బాధ్యతలు, కార్యకలాపాలను వికేంద్రీకరించడం ద్వారా కోవిడ్‌పై పోరాటాన్ని బలోపేతం చేశాం. స్థానిక స్థాయిలో పంచాయితీలు, వార్డు కమిటీలు పనిచేశాయి. ప్రజలకు శానిటైజర్లు ఇవ్వడంతో బాటు కరోనాను ఎలా ఎదుర్కోవాలో ప్రాథమిక వైద్య కేంద్రాలలోని డాక్టర్లు వారికి వివరించారు. లాక్‌డౌన్ విధించడానికి ముందే వ్యాపారులతో మాట్లాడాం. వివిధ వస్తువుల సరఫరాలకు అంతరాయం కలుగకుండా సరుకులు ముందుగానే సేకరించాలని కోరాం.

వీటన్నింటి వల్ల మేము మొదటి కోవిడ్ వెల్లువను సమర్థవంతంగా ఎదుర్కొగలిగాం. ఇప్పుడు మనం కరోనా రెండో వెల్లువను ఎదుర్కొంటున్నాం. ఈ రెండో దశను ఎదుర్కొడానికి ముందుగానే ఆక్సిజన్ సరఫరా, వెంటిలేటర్లు, ఐసియులు సిద్ధం చేశాం.

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**

**"మనం ఒకసారి కేంద్ర ప్రభుత్వ నిర్వాకాన్ని కనుక చూస్తే ప్రజా వ్యతిరేక ప్రభుత్వం ఎలా వుంటుందో అర్థమవుతుంది. కరోనా వాక్సిన్ విషయంలో వారు రెండు నాల్కలతో మాట్లాడుతున్నారు. కేంద్రంలో అధికారంలో వున్న రాజకీయ పార్టీ ఈ మహమ్మారి కాలంలో కూడా మత విద్వేషాలు రెచ్చగొడుతోంది. బాధ్యతను ఇతరుల మీదికి నెట్టడానికి ప్రయత్నిస్తోంది. ఈ మతతత్వ రాజకీయాలతో నయా ఉదారవాద విధానాలను వేగంగా అమలు చేయటానికి ప్రయత్నిస్తున్నారు."**

ఆర్‌టిపిసిఆర్ టెస్టింగ్ చార్జీలను నియంత్రించాం. కోవిడ్ చికిత్సకు ప్రయివేట్ ఆసుపత్రులు తీసుకోవలసిన ఛార్జీలు ఫిక్స్‌చేశాం. దీని కోసం మేము "నిత్యావసర సరుకుల చట్టాన్ని" అమల్లోకి తెచ్చాం.

దీని వల్ల కరోనా చికిత్సకు అవసరమైన మందులను పెద్దఎత్తున డబ్బు చెల్లించి కొనాల్సిన భారం నుండి ప్రజలు రక్షించబడ్డారు. ఇప్పుడు కూడా ప్రభుత్వ కేంద్రాల్లో మేము ఉచిత టెస్టులు, చికిత్స నిర్వహిస్తున్నాము.

అందరికీ ఉచిత వ్యాక్సిన్‌లు వేస్తామని కేరళ ముందుగానే ప్రకటించింది. సంక్షేమ పింఛన్ల మొత్తాన్ని పెంచాం. ప్రతి నెలా అందరికీ అత్యవసర సరుకుల కిట్‌లు పంపుతున్నాం. బిపిఎల్ కుటుంబాలకు మరింత అదనపు సదుపాయాలు కల్పిస్తున్నాం. రాష్ట్రంలో ఒక్కరు కూడా ఆకలితో ఉండకూడదని సాధ్యమైనంత వరకు ప్రజల ప్రాణాలు రక్షించాలన్నదే మా లక్ష్యం.

అయితే మనం ఒకసారి కేంద్ర ప్రభుత్వ నిర్వాకాన్ని కనుక చూస్తే ప్రజా వ్యతిరేక ప్రభుత్వం ఎలా వుంటుందో అర్థమవుతుంది. కరోనా వాక్సిన్ విషయంలో వారు రెండు నాల్కలతో మాట్లాడుతున్నారు. కేంద్రంలో అధికారంలో వున్న రాజకీయ పార్టీ ఈ మహమ్మారి కాలంలో కూడా మత విద్వేషాలు రెచ్చగొడుతోంది. బాధ్యతను ఇతరుల మీదికి నెట్టడానికి ప్రయత్నిస్తోంది. ఈ మతతత్వ రాజకీయాలతో నయా ఉదారవాద విధానాలను వేగంగా అమలు చేయటానికి ప్రయత్నిస్తున్నారు. దేశంలోని వ్యూహాత్మక రంగాలను, మొత్తం ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు పరం చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం ఈ కరోనా మహమ్మారి సమయంలోనే కేంద్ర కార్మిక చట్టాలను రద్దుచేసి, లేబర్‌కోడ్‌లుగా తిరగరాసింది. నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు, కొత్త వ్యవసాయ చట్టాలు తేవడం వీటన్నింటినీ మతోన్మాద విధానాలతో కలిపి అమలు చేస్తున్నారు. ప్రతి రోజూ పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్న విషయం మనం చూస్తున్నాం.

మరోవైపు ఆశ్రిత పెట్టుబడిదారులు పన్నులలో రాయితీలు పొందుతున్నారు. కరోనా కాలంలో ప్రజల ఆదాయాలు సరిపోక వాళ్ళు కాస్తో కూస్తో కూడబెట్టుకున్న దాన్ని కూడా ఖర్చు చేసేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానాలను గమనించినప్పుడు కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రత్యామ్నాయ విధానాల ప్రాధాన్యత అర్థం అవుతుంది.

కరోనా కట్టడితోబాటు కేరళలో మేము రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ఆన్‌లైన్ ద్వారా విద్య నభ్యసించే విధంగా చర్యలు తీసుకొన్నాం. కరోనా సందర్భంగా ఆర్థికంగా దెబ్బతిన్న వారి కోసం మేం "సుభిక్ష కేరళం" రైతులకు "వ్యవసాయ భద్రత" పథకాల ద్వారా పంటధర, ఉత్పత్తి పెంచడం కోసం చర్యలు తీసుకోవడం తదితరాలతో కరోనా విసిరిన సవాళ్ళను ఎదుర్కొంటున్నాం.

బసవపున్నయ్య ట్రస్టు వారు ప్రతిఏటా ''సుందరయ్య స్మారక'' ఉపన్యాసం నిర్వహించడం నాకు చాలా ఆనందంగా ఉంది. మొదటి దశ కరోనా వెల్లువలో ఐదు నెలల పాటు ట్రస్ట్ ఆధ్వర్యంలో కోవిడ్ కేర్ సెంటర్ నిర్వహించడమే కాకుండా ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ట్రస్ట్ ద్వారా 11 కోవిడ్ కేర్ సెంటర్లు నిర్వహించడం చాలా గొప్ప విషయం.

కరోనా సోకిన వారికి వసతి, భోజనం, వంటి సౌకర్యాలు అందించడం అనేది నిజంగా స్ఫూర్తి నిచ్చే అంశం. సుందరయ్య, బసవపున్నయ్య వంటి మన నేతలకు ఇంత కంటే అర్పించే గొప్ప నివాళి ఏముంటుంది? వారి జీవితాలు మన కామ్రేడ్స్‌లో నిబద్ధతను నింపాలి. ఆ నిబద్ధత ప్రజా పోరాటాలను బలపరచాలి. ఆ పోరాటాలు ప్రత్యామ్నాయలను ముందుకు తీసుకురావాలి.

మీ అందరికీ విప్లవాభివందనాలు తెలుపుతూ శెలవు.

**(అనువాదం: ఎన్. వెంకట్రావు)**

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**


'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

**ఈ మాసం ప్రత్యేకం**

# కార్మికవర్గ పోరాటాలకు విలువైన పాఠాలు అందించిన పారిస్‌కమ్యూన్



రచయిత సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

**బివి రాఘవులు**

**(పారిస్ కమ్యూన్ ఓడిపోయి 150 ఏళ్లు గడిచిన సందర్భంగా ఆ మహత్తర ఘటనపై ప్రపంచ వ్యాపితంగా 18 భాషల్లో వెలువడిన పుస్తకాల ఆవిష్కరణలు మే 28న జరిగాయి. తెలుగులో ప్రజాశక్తి బుక్‌హౌస్, నవతెలంగాణా ప్రచురణ సంస్థ సంయుక్తంగా ప్రచురించిన పుస్తకాన్ని సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు విడుదల చేస్తూ చేసిన ప్రసంగ పాఠాన్ని 'మార్క్సిస్టు' పాఠకుల కోసం అందిస్తున్నాం..... సంపాదకుడు)**

**150** ఏళ్ల క్రితం ఏర్పడిన తొలి కార్మికవర్గ రాజ్యం పారిస్‌కమ్యూన్ ఏర్పడిన 72 రోజుల్లోనే ఓడిపోయింది. వీరోచితంగా ఓడిపోయింది. వేలాదిమంది ప్రాణాలు బలి చేసి ఓడిపోయింది. ఓడిపోతామని తెలిసినా అస్త్రసన్యాసం చేసి లొంగిపోలేదు. ఒక మహత్తరమైన ఆశయం కోసం పోరాడి ఓడిపోయింది. ఓడిపోతామని తెలిసి ఓడిపోయింది. ప్రత్యర్థి అణచివేస్తాడని తెలిసికూడా వీరోచితంగా పోరాటంచేసి ఓడిపోయింది. ఆశయం, లక్ష్యం మంచిదైనపుడు గెలుపు ఓటములు ముఖ్యం కాదు. పోరాటం ముఖ్యమని రుజువుచేసిన చారిత్రాత్మక పోరాటం అది.

**స్వతంత్రవర్గంగా కార్మికవర్గ అభివృద్ధి**

వివిధ విప్లవ దినోత్సవాలను జయప్రదం అయినరోజున జరుపుకుంటాం. అక్టోబరు విప్లవం, చైనా, వియత్నా, క్యూబా విప్లవాలు జయప్రదమైన రోజులను జరుపుకుంటున్నాం. పారిస్ కమ్యూన్‌కు విజయం సాధించిన రోజు కూడా ఉంది. కాని మనం విజయం సాధించిన రోజును కాకుండా శత్రువు ప్రణాళికాబద్ధంగా పోరాటాన్ని అణచివేసిన రోజును, ఓటమి చెందిన రోజునే జరుపుకుంటున్నాం. ఓటమి చెందుతామని లొంగిపోతే మనం నేర్చుకోవటానికి ఏమీ ఉండేది కాదు. పారిస్‌కమ్యూన్ మే 28న అణచివేయబడింది. అందువలన ఈ రోజున ఆ పోరాటాన్ని గుర్తు చేసుకుంటున్నాం.


పారిస్‌కమ్యూన్ గురించి మార్క్స్,ఎంగెల్స్ చెప్పిన అనేక విషయాలు ఉన్నాయి. వాటన్నింటికి కాకుండా ఒక్క విషయాన్ని ప్రస్తావిస్తాను. విజయం సాధించినపుడు అర్థం కాని విషయాలు కొన్ని ఓటమిలో అర్థం అవుతాయి. యూరప్‌లో 1830లో విప్లవం వచ్చింది. 1848లోనూ వచ్చింది. తిరిగి 1871లో పారిస్ కమ్యూన్ వచ్చింది. కాని ఓడిపోయింది. 1905లో రష్యాలో వచ్చిన విప్లవం ఓడిపోయింది. వాటిని క్రూరంగా అణచివేశారు. ప్రతి విప్లవం పైనా దాడిచేసి, అణచివేయాలని ప్రయత్నం చేసినా విప్లవాలు రాకుండా ఆగిపోలేదు. 1917లో రష్యాలో విప్లవం జయప్రదమ యింది. 1949లో చైనాలో విప్లవం జయ ప్రదం అయింది. 1945లో ఉత్తర వియత్నాం, 1975లో దక్షిణ ప్రాంతంలో కూడా విప్లవం జయప్రదం అయింది. 1959లో క్యూబాలో విప్లవం జయప్రదం అయింది. 1927లో చైనాలో మొదటి విప్లవాన్ని అణచివేసి, లక్షలమందిని ఊచకోత కోశారు. 1967లో ఇండోనేషియాలో 20 లక్షలమందిని ఊచకోత కోసి, విప్లవ పోరాటాన్ని అణచివేశారు. 1946–47లో గ్రీస్‌లో విప్లవాన్ని అణచివేసి వేలమందిని ఊచకోత కోశారు. 1991లో సోవియట్, తూర్పు యూరప్‌లో సోషలిజం దెబ్బతినటం తెలుసు. వీటన్నింటినీ ఎందుకు చెబుతున్నానంటే ప్రతి విప్లవానికీ ఆటుపోట్లు ఉంటాయి. అపజయాలు, విజయాలు ఉంటాయి. కాబట్టి అవయజం పొందితే నాశ నం అయినట్లు కాదు. అందువలన మార్క్స్ 1830 విప్లవంలో కార్మికవర్గం పెట్టుబడిదా రులకు సేవకులుగా విప్లవంలో పాల్గొందని చెబుతాడు. 1848లో శక్తివంతమైన సమ ఉజ్జీగా వ్యవహరించటానికి పూనుకున్నారు. అలా వ్యవహరించటానికి పూనుకుంది కాబట్టే కార్మికవర్గం నుండి ప్రమాదం వస్తుందని భావించిన బూర్జువావర్గం ఫ్యూడల్ వర్గంతో రాజీపడి విప్లవాన్ని ముగించింది. 1871లో కార్మికవర్గం బూర్జువావర్గ మోసకారితనాన్ని అర్థం చేసుకొని, దాని మోసాన్ని ఎదుర్కోటానికి సిద్ధపడ్డారు. అందువలన వారు లొంగిపోయినపుడు వారిని పక్కన పెట్టి స్వతంత్రంగా వ్యవహరించటానికి పూనుకున్నారు. అయితే బూర్జువావర్గం శక్తి మోసాలలోనే కాదు. ఇతర అంశాలలోనూ ఉంది. పారిస్‌కమ్యూన్ నాయకులు దానిని అర్థం చేసుకోలేకపోయారు. దానిశక్తి సంపదలో ఉంది. ఆ సంపద పారిస్ బ్యాంకులో ఉంది. దానిని కార్మికవర్గం స్వాధీనం చేసుకోలేదు. దానిని బూర్జువావర్గం స్వాధీనం చేసుకొని, సైన్యాన్ని సమకూర్చుకోవటానికి, కొనాల్సినవారిని కొనటానికి, లంచాలతో ప్రలోభపెట్టి తమ శక్తిని కూడదీసుకోవటానికి ఉపయోగించుకున్నది.

అంతేకాదు. బూర్జువా రాజ్యాంగయంత్రాన్ని రద్దుచేయటానికి పూనుకోలేదు. కొత్తసైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నా పాత సైన్యాన్ని రద్దుచేయకుండా, వారిని నిర్బంధించకుండా వెర్సయిల్స్ వెళ్ళటానికి అనుమతించారు. రాజ్యాంగ యంత్రంలో కొన్ని ముఖ్యమైన భాగాలను వారు ముట్టుకోలేదు. బూర్జువా రాజ్యాంగయంత్రాన్ని స్వాధీనం చేసుకొని, దానిని యధాతథంగా కార్మికవర్గం, ప్రజల కోసం ఉపయోగించటం సాధ్యం కాదని లెనిన్ చెబుతాడు. ఆ రోజు ఆ స్థాయిలో కార్మికవర్గానికి అవగాహన లేదు. 1917లో ఆ అనుభవాల నుండి నేర్చుకొని, బూర్జువా పార్లమెంటును నమ్మకుండా సోవియట్లను ఏర్పాటుచేసి కార్మిక కర్షక ఆధిపత్యాన్ని నెలకొల్పటానికి పూనుకున్నారు. ఇవన్నీ మనకు స్పష్టం చేస్తున్నదేమిటంటే ఈ పోరాటాలు కార్మికవర్గానికి, బూర్జువావర్గానికి మధ్య

> **❝ సామాన్యప్రజల పోరాట పటిమను పారిస్ కమ్యూన్‌లో చూడవచ్చు. స్వీపర్లు, మహిళలు, పెయింటర్లు, తాపి వర్కర్ల లాంటి వారు ఎంత తెగువతో, ఎంత త్యాగంతో, వీరోచితంగా, పోరాటాలలో పాల్గొన్నారో స్పష్టమౌతుంది. వారిని గోడలకు ఆనించి కాల్చివేస్తున్నా 'పారిస్‌కమ్యూన్ జిందాబాద్' అంటూ పాణాలు తృణప్రాయంగా ఇవ్వటం చూస్తే విప్లవ పోరాట సమయాలలో సామాన్య ప్రజలు ఎంత త్వరగా నేర్చు కుంటారో, ఎంత త్వరగా నాయకత్వ స్థానాలకు వస్తారో స్పష్టమౌతుంది.**

నిరంతరంగా జరుగుతంటాయి. అనేక పోరా టాలు అపజయం పొందాయి. అపజయాల నుండి గుణపాఠాలను తీసుకొని ముందుకుపోవ టాని ప్రయత్నం చేశాయి.

1990లో బయటి నుండి సోషలిజాన్ని దెబ్బతీయటానికి ప్రయత్నించాయి. పారిస్ కమ్యూన్‌లో కూడా బూర్జువా, ప్రష్యన్ సేనలు విప్లవాన్ని దెబ్బతీశాయి. కాని 1917లో జయ ప్రదమైన సోషలిస్టు విప్లవాన్ని, 1990లలో సోవియట్ యూనియన్‌ను కూల్చటానికి కొన్ని అంతర్గత శక్తులను కూడదీశారు. ప్రపంచ సామ్రాజ్యవాదం కుట్ర చేసి, సోషలిజాన్ని కూల్చి వేసింది. దీనినుండి నేర్చుకోవాలి. కొన్ని సోషలిస్టు దేశాలు నేర్చుకొని ముందుకుపోవ టానికి ప్రయత్నం చేస్తున్నాయి. అందువల్ల బూర్జువా వర్గం–కార్మికవర్గం మధ్య జరుగు తున్న పోరాటంలో అనేక మజిలీలు, అనేక దశలు ఉంటాయి. ప్రతి సందర్భంలోనూ కార్మికవర్గం అనుభవాలను తీసుకొని మరిన్ని విజయాలు సాగించటానికి ముందుకుసాగింది. ఈ రోజు సోషలిజం బలహీనపడిన పరిస్థి తులలో, విప్లవ శక్తులు ఆత్మ రక్షణలో ఉన్న పరిస్థితులలో పారిస్‌కమ్యూన్ అనుభవాలను తీసుకొని, మనం ముందుకుపోవ టానికి ప్రయత్నం చేయాలి.




### సామాన్యప్రజల పోరాటపటిమ

సామాన్యప్రజల పోరాట పటిమను పారిస్ కమ్యూన్‌లో చూడవచ్చు. సి వి కావ్యం చదివితే ఇవి మరింత స్పష్టంగా అర్థం అవుతాయి. స్వీపర్లు, మహిళలు, పెయింటర్లు, తాపి వర్కర్ల లాంటి వారు ఎంత తెగువతో, ఎంత త్యాగంతో, వీరోచితంగా, సృజనాత్మకంగా పోరాటా లలో పాల్గొన్నారో స్పష్టమౌతుంది. వారిని గోడలకు ఆనించి కాల్చివేస్తున్నా "పారిస్‌కమ్యూన్ జిందాబాద్" అంటూ పాణాలు తృణప్రాయంగా ఇవ్వటం చూస్తే విప్లవ పోరాట సమయాలలో సామాన్య ప్రజలు ఎంత త్వరగా నేర్చు కుంటారో, ఎంత త్వరగా నాయకత్వ స్థానాలకు వస్తారో స్పష్టమౌతుంది. అందువలన ప్రజలపై సమ్మకం కోల్పోయిన వారికి పారిస్‌కమ్యూన్ ఉత్సాహం ఇస్తుంది. సాధారణ సమయాలలో ప్రజలు ఏమీ తెలియని వారు, ఉన్నదాన్లో సర్దుకుపోయేవారు. అధికారం, సాంప్రదాయాలకు లోబడి నడిచే వారని అనిపిస్తుంది. గెలిచిన, ఓడిన పోరా టాలను చూస్తే అటువంటి శక్తి సామాన్య ప్రజలలో ఉందని స్పష్టమౌతుంది.

అక్కడి వరకు అవసరం లేదు. గత ఆరుమాసాలుగా ఢిల్లీని ముట్టడించి రైతులు చేస్తున్న పోరాటం చూస్తే సామాన్యప్రజలు ఏ విధంగా పోరాడగలరో స్పష్టమౌతుంది. అలాగే పాలస్తీనా పోరాటం చూడండి. చాలా చిన్న ప్రాంతం. ప్రజల సంఖ్య తక్కువే. అయినా తమ హక్కుల కోసం ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు. 1948 నుండి ఇప్పటి వరకు పోరాటం చేస్తూనే ఉన్నారు. పారిస్‌కమ్యూన్‌ను దృష్టిలో పెట్టుకొని చూస్తే ఇవి కార్మికవర్గం బూర్జువావర్గాన్ని అంతం చేయటం కోసం జరిగే పోరాటాలు కాదు. కాని ఈ పోరాటాలు సామాన్య ప్రజలు నిర్వహించగలిగిన పాత్రను స్పష్టం చేస్తాయి. అందువలన ప్రజలపై నమ్మకం కలిగి ఉండాలి.

బూర్జువా రాజ్యాంగ యంత్రాన్ని యథాతథంగా కార్మికవర్గ ప్రయోజనాల కోసం వినియో గించుకోవటం సాధ్యం కాదు. మనపార్టీ బెంగాల్‌లో 34 సంవత్సరాలు అధికారంలో ఉంది. త్రిపురలో 25 సంవత్సరాలు అధికారం లో ఉంది. కేరళలో ఒకసారి ఓడిపోయినా, మరోసారి అధికారంలోకి వచ్చినా ఎక్కువ కాలం అధికారంలో ఉన్నాం. ఈసారి ఎల్‌డిఎఫ్ ఎన్నికలలో గెలిచి విజయన్ నాయకత్వంలో వరుసగా రెండవసారి అధికారం లోకి వచ్చింది. దీనిని ప్రపంచం లోని అనేకదేశాలు గుర్తించాయి. ఇవన్నీ ప్రజలు బూర్జువా రాజ్యాంగయంత్రంలో వామపక్ష ప్రతినిధులను అధికారంలో కూర్చో బెట్టటం మినహా పారిస్‌కమ్యూన్ లాగా విప్లవ కరంగా అధికారాన్ని చేపట్టటం కాదు. అంత మేరకైనా ఉన్నదానిని ఉపయోగించుకొని ప్రజలకు చేయగలిగినంత చేయాలి. తనకు ప్రమాదం వస్తే ఎంత దారుణంగా కార్మిక వర్గా న్ని అణచివేస్తుందో, ఎంతగా మోసం చేస్తుందో పారిస్‌కమ్యూన్‌లో చూశాం. ఇక్కడ కూడా అంతే. తన ప్రయోజనాలకు నష్టం కలగనంత కాలం బూర్జువావర్గం వీటిని గురించి పట్టించుకోదు. మనం కూడా

ఇటువంటి వాటిలో ఉన్నపుడు ప్రజలకు చేయగలిగినంత చేయాలి. ఆ అవకాశాలు పోయినపుడు విప్లవాలలో ఓడిపోయినట్లుగా భావించకూడదు. గెలిచినపు దు అధికారం మనచేతికి వచ్చినట్లు కూడా భావించకూడదు. అధికారానికి వచ్చినపుడు విప్లవాలను సాధించింది లేదు, ఓడిపోయి నపుడు విప్లవాన్ని కోల్పోయిందీ లేదు. గెలు పొందితే వాటిని ప్రజల కోసం పోరాటం చేసే సాధనాలుగా వినియోగించుకొంటాం. ఓడిపోతే వేరే సాధనాల ద్వారా ప్రజల కోసం పోరాటం చేస్తాం. పారిస్‌కమ్యూన్‌పై అధ్యయనం చేస్తున్నామంటే రాజ్యాంగయంత్రం ఏమిటి, దానిలో మనం అర్థం చేసుకోవలసిన విషయాలు ఏమిటి, వాటిని మనం ఎలా వినియోగించు కోవాలి, దానిని సరిగా అర్థం చేసుకోకపోతే దెబ్బతింటామన్న విషయాలు మనం ఎలా నేర్చుకోవాలి అన్న విషయాలు మీరు బ్రెక్టోర్‌బెక్ట్ రాసిన గేయం చదివితే తెలుస్తుంది.

"గుర్తించాం మమ్ముల్ని బందీలుగా చేశారని
తూటాలు నింపుకొని పిస్తోళ్ళు మా తలలపై గురిపెట్టి
మేం నిశ్చయించుకొన్నాం ముమ్ముందు మీ చిత్రహింసలకు భయపడకూడదని
బానిసత్వం చావుకన్నా హీనం" అన్న కవితను రాశాడు.

**నూతన మానవుని సృష్టికి ప్రయత్నం**

పారిస్‌కమ్యూన్‌లో నూతన మానవుని సృష్టించటం కోసం ప్రయత్నం జరిగింది. బూర్జువా సమాజంలో మానవుడు, కార్మిక రాజ్యంలోని మానవుడు భిన్నంగా ఉండాలి. బూర్జువా సమాజంలోని మానవునితో సోషలి జాన్ని నిర్మించటం సాధ్యం కాదు. 78 రోజుల పాలనలోనే వారి ప్రయత్నాలు, సాంస్కృతిక కార్యక్రమాన్ని గాని మనం చూస్తే కొద్దికాలంలోనే నూతన మానవుని సృష్టించటం కోసం ఎటువంటి ప్రయత్నాలు జరిగాయో స్పష్టమౌతుంది. ఉన్న సంస్కృతి, ఆచారాలు, విలువలు, ఆలోచనలతో కొనసాగితే సోషలి జానికి మనుగడ ఉండదు. నూతన విలువలతో కూడిన మానవుని ఆవిష్కరించినపుడే సోషలి జానికి మనుగడ ఉ ంటుంది. విప్లవం జయ ప్రదం అయిన తర్వాత కాకుండా విప్లవం జరుగుతున్న క్రమంలోనే అటువంటి మానవుని సృష్టించటానికి ప్రయత్నించాలి.

ఈ రోజు కరోనా రూపంలో తీవ్ర విపత్తును ఎదుర్కొంటున్నాం. సంఘర్షణలు జరుగుతున్నాయి. దీనిలో పాత సాంప్రదా

> ❝ కొద్దిమంది అత్యధిక ప్రజానీకాన్ని అణచివేసేది బూర్జువా ప్రజాస్వామ్యం. అత్యధిక ప్రజానీకం తమ పరిపాలనను తామే చేసుకొనేది కార్మికవర్గ ప్రజాస్వామ్యం. కానీ సోషలిస్టు నిర్మాణక్రమంలో సోష లిస్టు ప్రజాస్వామ్యాన్ని, ప్రజల పాత్రను పెంచటంలో లోపాలు జరిగాయి. దానినుండి పాఠాలు తీసు కొని ప్రజాస్వామ్యాన్ని అమలుచేస్తే సోషలిజాన్ని దెబ్బతీయ టానికి పెట్టుబడిదారు లకు అవకాశం ఉండదు. ❞

యాలు బద్ధలౌతున్నాయి. బాబా రాందేవ్ సైన్స్‌కు వ్యతిరేకంగా మాట్లాడటం, ఆనందయ్య మందులు, దానిపై జరుగుతున్న చర్చలు చూస్తున్నాం. ఇటువంటి సంఘర్షణ విప్లవ కాలంలో మరింత తీవ్రంగా జరుగుతుంది.

చివరి విషయం అత్యున్నతస్థాయి ప్రజాస్వామ్యం కార్మికవర్గ రాజ్యంలో ఉ ంటుంది. బూర్జువా సమాజంలోనూ ప్రజాస్వా మ్యం ఉంటుంది. బిజెపి ప్రభుత్వం, ఆర్ఎస్ ఎస్, సంఘ్ పరివార్‌లు ఈ ప్రజాస్వామ్య హక్కులను కూడా లేకుండా చేయటానికి ప్రయత్నం చేస్తున్నాయి. ఓటు వేయటం, ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవటం, సంఘాన్ని ఏర్పాటు చేసుకోవటం, సభలు పెట్టుకోవటం, మతాన్ని అనుసరించటం, ఎక్కడికైనా వెళ్ళటం,

తదితర హక్కులు ఉన్నాయి. ఇదే ప్రజాస్వామ్యమని బూర్జువా వర్గం ప్రచారం చేస్తున్నది. కాని కార్మికవర్గ రాజ్యంలో ప్రజలే అధికారులను ఎన్నుకున్నారు. ప్రజలే ఆయు ధాలు తీసుకొని, సైన్యంగా వ్యవహరించారు. నమ్మకం కోల్పోయిన అధికారులను వెనక్కు పిలిచే హక్కును ప్రజలకిచ్చారు. పెట్టుబడి దారులు ఫ్యాక్టరీలు వదులుకొని పోతే వాటిని స్వాధీనం చేసుకొని ప్రజాస్వామ్యయుతంగా కార్మికులు నడిపారు. పెయింటర్లు పరిపాలన చేస్తారా అని థేర్స్ ఎగతాళి చేస్తే వారినే పరిపాలన చేసేస్థాయికి తీసుకొచ్చారు. ఈ అనుభవాలను తీసుకొనే విప్లవం జయప్రదమైన తర్వాత లెనిన్ ప్రతి వంటలక్క రాజ్యాన్ని పరిపాలించగలిగే స్థాయికి రావాలని చెప్పాడు. 1917 తర్వాత రష్యాలో కార్మిక, రైతు, సైనిక సోవియట్లను ఏర్పాటు చేశారు.

కొద్దిమంది అత్యధిక ప్రజానీకాన్ని అణచివేసేది బూర్జువా ప్రజాస్వామ్యం. అత్యధిక ప్రజానీకం తమ పరిపాలనను తామే చేసుకొనేది కార్మికవర్గ ప్రజాస్వామ్యం. కాని సోషలిజం నిర్మాణక్రమంలో చాలా లోపాలు జరిగాయి. సోషలిస్టు నిర్మాణక్రమంలో సోష లిస్టు ప్రజాస్వామ్యాన్ని, ప్రజల పాత్రను పెంచటంలో లోపాలు జరిగాయి. పారిస్ కమ్యూన్ నుండి లెనిన్ తీసిన గుణపాఠాలను సోషలిజం సాధించిన దేశాలలో అమలు చేయటం మరచిపోయాం. అక్కడ దెబ్బతిన టానికి అదొక కారణం. దానినుండి పాఠాలు తీసుకొని ప్రజాస్వామ్యాన్ని అమలుచేస్తే సోషలిజాన్ని దెబ్బతీయటానికి పెట్టుబడిదారు లకు అవకాశం ఉండదు.

పెట్టుబడిదారి విధానంలోనే ప్రజాస్వా మ్యం ఖూని చేయబడుతున్నది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడులకు ప్రజాస్వామ్యం వాసనే గిట్టదు. ప్రపంచంలోనూ, దేశంలోనూ మిత వాద శక్తులు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యంపై దాడి పెరిగింది. బిజెపి మంత్రులు తప్పుడు సమాచారంతో ట్విట్టర్‌లో ప్రచారం చేస్తున్నారు. ట్విట్టర్ దానిని వ్యతిరే ంకిస్తే దానిపై కక్ష సాధిస్తున్నారు. గతంలో న్యూస్‌క్లిక్‌పై దాడిచేశారు. ఈ ప్రజాస్వామ్యాన్ని కూడా ఈ రోజు పెట్టుబడిదారీ విధానం సహించే పరిస్థితి లేదు. సోషలిజం దెబ్బతిన్నం త మాత్రాన పెట్టుబడిదారి విధానం సంక్షోభం నుండి బయటపడిందీ లేదు. ప్రజలను సుఖం గా బతకనిస్తున్నదీ లేదు. ఇటువంటి పరిస్థితిలో వీటి నుండి మనం నేర్చుకొని, సోషలిస్టు నిర్మాణంలో జరిగిన లోపాలను సరిదిద్దుకొని, అత్యున్నత ప్రజాస్వామ్యాన్ని అమలుజరపాలి. రాజ్యాంగయంత్రం క్రమంగా ప్రజలపరమై, అణచివేత రూపాలు అంతమైపోయే విధంగా కృషిచేయాలి. ఇది పారిస్‌కమ్యూన్ నుండి అర్థం చేసుకోవలసిన మరొక అంశం. వీటి ప్రాతిపదికన పోరాటాలను తీవ్రం చేస్తూ, సమకాలీన ఉద్యమాలను ముందుకు తీసుకు పోవాలి. సామాన్యప్రజల విప్లవ పోరాట పటిమను అర్థం చేసుకోవాలి.

❊

**కమ్యూనిస్టు ఉద్యమ ఆటుపోట్లు - శాస్త్రీయ అవగాహన -2**



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి

## 1848-64 :

# కమ్యూనిస్టు మానిఫెస్టో నుండి మొదటి ఇంటర్నేషనల్ వరకు

### (ఉద్యమాల పెరుగుదల - ఐక్య నిర్మాణ సంస్థ లేపోవటమనే ఆటంకం ఏర్పడటం)

**తమ్మినేని వీరభద్రం**

**1948**లో కమ్యూనిస్టు మానిఫెస్టో విడుదలతో ప్రపంచ కార్మికోద్యమానికి ఒక సిద్ధాంత ఆయుధం దొరికింది. ఉద్యమం మరింత వేగం పుంజుకోవటానికి ఇది తోడ్పడింది. ఈ క్రమంలో అనేక అన్యవర్గ సిద్ధాంతాలతో పోరాడుతూనే కార్మికోద్యమం బలపడింది.

కమ్యూనిస్టు మానిఫెస్టో ప్రకటించబడిన 1848 సంవత్సరంలోనే యూరప్ అంతటా బూర్జువా ప్రజాతంత్ర విప్లవాలు పెల్లుబికాయి. సారాంశంలో ఇవి ప్రజాస్వామిక విప్లవాలు. అంటే అంతకు ముందున్న రాజరిక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సాగిన రాజకీయ వెల్లువలుగా అవి ఉన్నాయి. రిపబ్లిక్ రాజ్యాల ఏర్పాటు, ఆస్తిపరులకేగాక పురుషులందరికీ ఓటుహక్కు, వాక్‌స్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛ ప్రధాన డిమాండ్లుగా ఉన్నాయి. మొదట ఈ తిరుగుబాటు ఫిబ్రవరిలో ఫ్రాన్స్‌లో ప్రారంభమైంది. తరువాత యూరప్ దేశాలన్నింటికీ పాకింది. కానీ వీటి మధ్య ఎక్కడా సమన్వయం, సంబంధాలు లేవు. అవన్నీ ఎక్కడికక్కడ విడివిడిగానే జరిగాయి. ఈ వెల్లువలన్నింటికీ బూర్జువాలు, మధ్యతరగతి, కార్మికులతో కూడిన తాత్కాలిక సంఘటనలు నాయకత్వం వహించాయి. కానీ ఈ సంఘటనలేవీ దీర్ఘకాలం ఐక్యంగా లేవు. ప్రారంభంలోనే అనేకం అణచివేయబడ్డాయి. పదుల వేల సంఖ్యలో ప్రజలు చంపబడ్డారు. అనేకులు ప్రవాసశిక్షలకు గురయ్యారు. అయినా ఈ విప్లవాలు కొన్ని విజయాలు సాధించాయి. ఆస్ట్రియా, హంగరీల్లో బానిసత్వాలు రద్దు చేయబడ్డాయి. డెన్మార్క్‌లో రాజరికం రూపం మారింది. నెదర్లాండ్స్‌లో ప్రాతినిధ్య ప్రభుత్వం ఏర్పడింది. వివిధ దేశాలలో ఫ్యూడలిజం కూలదోయబడటం, తిరిగి అధికారంలోకి రావటం, మళ్లీ బూర్జువాలు అధికారం హస్తగతం చేసుకోవటం ఇలా జరిగేది.

సోవియట్, తూర్పుయూరపు దేశాల్లో సోషలిజం ఓడిపోవటం, అనేక దేశాల్లో కమ్యూనిస్టు ఉద్యమం దెబ్బతినటం చూసి నేడు చాలామంది ఉద్యమ శ్రేయోభిలాషులు నిరుత్సాహపడుతుంటారు. కానీ ఈ అపజయాలకంటే ఎన్నో రెట్లు ఓటములను పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొన్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క రాజ్యాధికారం నిలదొక్కుకోవటానికి సుమారు 400 సం॥ల సుదీర్ఘకాలం పట్టింది. ఆ కాలమంతా యుద్ధాలు, అంతర్యుద్ధాలు చాలా జరిగాయి. మరి ఆ లెక్కన చూస్తే 'సోషలిజం' ఆలోచనల వయస్సే 200సం॥లకు మించి లేదు గదా! అందువల్ల ఆటుపోట్లనేవి ఉద్యమాభివృద్ధిలో అంతర్భాగంగానే మనం చూడాల్సి ఉంటుంది.

చరిత్రలో మొదటిసారిగా కార్మికవర్గం సమాజంలో ఒక స్వతంత్ర వర్గంగా, శక్తిగా నిలబడింది. 1848 లో పెల్లుబుకిన విప్లవాలన్నీ ఫ్యూడల్ వ్యతిరేకమైనవి. కార్మికవర్గం బూర్జువావర్గంతో కలిసి ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా పోరాడింది. ఆ విప్లవాలన్నీ నడిచింది బూర్జువాల నాయకత్వంలోనే అయినప్పటికీ, ఫ్యూడల్ ప్రభువులను ఓడించటానికి బూర్జువా వర్గానికి కార్మికవర్గం యొక్క తోడు అవసరమైంది. ఓడిన ఫ్యూడల్ ప్రభువులు కూడా కార్మికవర్గాన్ని కలుపుకుని తిరిగి బూర్జువా ప్రభుత్వాలను కూల్చాలనే ప్రయత్నాలు చేశారు. 'కార్మికులు ఎదుర్కొనే కష్టాలకు బూర్జువాలే కారణం కాబట్టి, బూర్జువా ప్రభుత్వాల్ని కూలిస్తేనే వారి కష్టాలు తీరుతాయనీ, మేము అధికారంలోకి రాగానే మీకు అనుకూలమైన నిర్ణయాలు చేస్తామని' ఫ్యూడల్ ప్రభువులు సిద్ధాంతాలు అల్లారు. దీనినే ఫ్యూడల్ సోషలిజం అన్నారు. ఇలాంటి వివిధ సోషలిస్టు నినాదాల బండారాన్ని కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్, ఎంగెల్స్‌లు బట్టబయలు చేశారు. అభివృద్ధి నిరోధక ఫ్యూడల్ వ్యవస్థను కూలదోసి బూర్జువావర్గం అధికారంలోకి రావటం సమాజాభివృద్ధిలో ఒక భాగమే. ఆ విప్లవాలలో కార్మికులు పాల్గొనటం సరైందనీ, అయితే కార్మికుల సంపూర్ణ విముక్తికి బూర్జువాలను కూలదోసి కార్మికవర్గం రాజ్యాధికారంలోకి రావటమొక్కటే పరిష్కారమని ఆ పోరాటాల సందర్భంగా మార్క్స్ చెప్పేవాడు.


ఈ కాలంలోనే అనేక ప్రజాస్వామిక డిమాండ్లతో ఉధృతంగా సాగిన చార్టిస్టు ఉద్యమం మరో ముఖ్య పోరాటం. ఈ ఉద్యమంలో 8గం॥ పనితో పాటు, సార్వజనీన ఓటుహక్కు అనేవి ముఖ్య డిమాండ్లుగా ఉన్నాయి. ఈ డిమాండ్లు నెరవేరితే కార్మికుల జీవితాలలో పెద్ద మార్పు సాధ్యమని మార్క్స్, ఎంగెల్స్‌లు నమ్మారు. అయితే ఆ డిమాండ్లు నెరవేరినా వాటినీ బూర్జువావర్గం ఆచరణలో ఎలా నిర్వీర్యం చేస్తాయనేది తర్వాతగానీ అర్థం కాలేదు.

1848 విప్లవాల ఓటమి తర్వాత చిన్న రైతాంగం, పెటీబూర్జువాలు బాగా దెబ్బ తిన్నారు. కానీ పట్టణాల్లో పరిశ్రమలు, ఉత్పత్తి గణనీయంగా పెరిగాయి. దీంతో కార్మికుల సంఖ్య కూడా బాగా పెరిగింది. ఇంగ్లాండ్ ప్రపంచ వర్క్‌షాప్‌గా మారింది. ఫ్రాన్స్ కూడా అభివృద్ధి అయింది. అయితే ఫ్రాన్స్‌లో చిన్న తరహా పరిశ్రమలు ఎక్కువగా అభివృద్ధి అయ్యాయి. ఫ్రాన్స్ గ్రామీణ ప్రాంతంలో జనాభా పెరుగుదలతో పట్టణాలకు వలస ప్రారంభ మైంది. కార్మికులు రోజుకు 12-15 గంటలు పనిజేసేవాళ్లు. ఈ కాలంలో కార్మిక సంఘాలను నిర్మాణం చేయటానికి అనేకమంది కార్మిక నాయకులతో బాటు మార్క్స్ తదితర విప్లవ కారులు ప్రయత్నించారు.

ఈ పరిస్థితులు, ప్రయత్నాలతో శ్రామి కోద్యమం బాగా అభివృద్ధి అయింది. వేతనాలు ఎక్కువగా పెంచుకున్నారు. నిరుద్యోగం తక్కువగా ఉండేది. వృత్తిపరమైన కార్మిక సంఘాలు అభివృద్ధి అయ్యాయి. అయితే అవి రాజకీయ పోరాటాలంటే భయపడేవి. లిబరల్ బూర్జువాలను బలపరుస్తుండేవారు. ఫ్రాన్స్‌లో విప్లవాల ఓటముల తరువాత పెటీబూర్జువాల ప్రభావం పెరిగి, దానికనుగుణంగా ఫ్రెంచి కార్మిక నాయకుడు ప్రౌడాన్(1803-65) భావజాలానికి బలం పెరిగింది. ప్రౌడాన్ వాదనేమిటంటే "కార్మికవర్గానికి మేలు జరగాలంటే కోఆపరేటివ్ సొసైటీలు ఏర్పడాలి. వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. సహకార కార్యక్రమాలు నిర్వహించాలి. విప్లవాలు, రాజ్యాధికారం అవసరం లేదు" (అంటే రుణమేళాలు, వడ్డీలేని రుణాలు, పావలా వడ్డీల పథకాల ఆలోచనలు అప్పటినుండే ఉన్నాయన్నమాట). ప్రౌడాన్ తన సిద్ధాంతాలను వివరిస్తూ "దారిద్ర్యం యొక్క తత్వశాస్త్రం" అనే గ్రంథాన్ని రచించాడు. ఆ సంస్కరణవాద సిద్ధాంతాలను ఖండిస్తూ మార్క్స్ "తత్వశాస్త్రానికి పట్టిన దరిద్రం" అనే గ్రంథాన్ని రాశాడు.

జర్మనీలో కూడా పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి శ్రామికోద్యమాన్ని ఉనికిలోకి తెచ్చింది. లాసాలె అనే నాయకుడు జర్మనీలో కార్మిక సంఘాన్ని నిర్మించాడు. అయితే ఆయన వర్గ పోరాటాన్ని వ్యతిరేకించాడు. యజమానులతో సంప్రదింపులు, ఎన్నికల ద్వారానే కార్మికుల అభివృద్ధి జరుగుతుందని నమ్మేవాడు. 1860 దశకంకల్లా ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ అలాగే ఇతర యూరప్ అంతటా కార్మికోద్యమాలు ఉధృతంగా అభివృద్ధి చెందాయి. 1861-65 అమెరికా అంతర్యుద్ధం యూరప్‌లోని కాటన్,

> **" ఇంటర్నేషనల్ మొదటి సభలో మార్క్స్ తన ప్రసంగం ద్వారా అప్పటికి కార్మికోద్యమ పరిణామాన్ని, ఇంటర్నేషనల్ ఏర్పాటు అవసరాన్ని చక్కగా విశ్లేషించాడు. ప్రతిదానిలో కాలంచెల్లిన అంశంతో పాటు, భవిష్యత్తులో అభివృద్ధి చెందే అంశాన్ని ఎలా గుర్తించాలో మనకు ఆయన విశ్లేషణలో సులువుగా తెలిసిపోతుంది. "**



**1864లో లండన్‌లోని సెంట్ మార్టిన్ హాలులో జరిగిన ఫస్ట్ ఇంటర్నేషనల్ ప్రతినిధుల సభలో కారల్ మార్క్స్ తదితరులు**

టెక్స్‌టైల్ కార్మికులను దెబ్బగొట్టింది. అప్పటికి అనేక దేశాలలో కార్మికోద్యమాలు విడివిడిగా బాగా అభివృద్ధి చెందాయి.

అయితే పాలకవర్గాలను, యజమానులను సమర్థంగా ఎదుర్కోవడానికి ఈ సంస్థలు, సంఘాలన్నింటి మధ్య సంఘీభావం, ఐక్యత సాధించే నిర్మాణ సంస్థ లేకపోవటం ఆనాటి కార్మికోద్యమానికి ముఖ్యమైన ఆటంకంగా తయారైంది. ఈ పరిస్థితులలో మొదటిసారిగా బ్రిటిష్, ఫ్రెంచి కార్మికులు తమ పోరాటాలలో ఒకరికొకరు సంఘీభావం తెలుపుకోవటం అంతర్జాతీయ నిర్మాణానికి మొదటి అడుగుగా భావించవచ్చు. 1863లో రష్యన్ పాలనకు వ్యతిరేకంగా పోలిష్ ప్రజలు సాగించిన పోరాటానికి అనేక యూరోపియన్ దేశాల కార్మిక సంఘాలు మద్దతు తెలపటం ఈ క్రమంలో మరో ముందడుగు. ఆ తర్వాత అనేక దేశాలలో ఇలాంటి ఐక్యతా భావం ముందుకొచ్చింది.

### ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ ఫెడరేషన్ ఏర్పాటు

ఈ ఐక్యతా భావాన్ని మరింత పెంపొందించే విధంగా, వివిధ దేశాల కార్మిక సంస్థలను ఏకం జేసే విధంగా సంస్థ ఏర్పాటుకు నిర్ణయం జరిగింది. ఆ సభకు మార్క్స్ ఆహ్వానించబడ్డారు. 1864 సెప్టెంబర్ 28న లండన్‌లోని సెంట్ మార్టిన్ హాల్‌లో "ఇంటర్నే షనల్ వర్కింగ్ మెన్స్ ఫెడరేషన్" ఏర్పడింది. ఈ సంస్థ ప్రణాళిక రచన కోసం ఏర్పడ్డ సబ్‌కమిటీలో మార్క్స్ సభ్యుడు.

ఇంటర్నేషనల్ మొదటి సభలో మార్క్స్ తన ప్రసంగం ద్వారా అప్పటికి కార్మికోద్యమ పరిణామాన్ని, ఇంటర్నేషనల్ ఏర్పాటు అవసరాన్ని చక్కగా విశ్లేషించాడు. ప్రతిదానిలో కాలంచెల్లిన అంశంతో పాటు, భవిష్యత్తులో అభివృద్ధి చెందే అంశాన్ని ఎలా గుర్తించాలో మనకు ఆయన విశ్లేషణలో సులువుగా తెలిసిపోతుంది. ఉదాహరణకు... 1848 కంటే ముందు వ్యాప్తిలో ఉన్న ఊహాజనిత సోషలిస్టుల గురించి చెబుతూ... "ఇంగ్లండ్‌లో రాబర్ట్ ఓవెన్ కృషితో ఆధునిక ఫ్యాక్టరీలలో సహకార వ్యవస్థ ద్వారా ఉత్పత్తి చేశారు. దీని ద్వారా యజమానులు లేకుండానే కార్మికులు సహకార పద్ధతిలో భారీ ఉత్పత్తులు సాగించగలరనే

> ❝ ఇంటర్నేషనల్ ప్రారంభం నుండీ అది ఐక్యంగా లేదు. యూరప్ శ్రామిక ఉద్యమాలలో ఆనాడు నెలకొని ఉన్న వివిధ సైద్ధాంతిక దోరణులన్నీ ఈ వేదికలో కొనసాగాయి. 1867, 68లలో జరిగిన ఇంటర్నేషనల్ యొక్క రెండు మహాసభలలోనూ ప్రౌడాన్, మార్క్సు మధ్య సైద్ధాంతిక పోరాటం తీవ్రంగా నడిచింది. ❞

విషయం రుజువైంది" – కార్ల్ మార్క్సు (ఇంటర్నేషనల్ స్థాపక సభలో ప్రసంగం) ఆయన ఇంకా ఇలా చెప్పారు... "అయితే ఈ సహకార ఉద్యమం ఒక పరిమిత ప్రాంతంలో లేక ఒక ఫ్యాక్టరీలో సాగిస్తే ఆస్తిపరుల ఆటలు కట్టడికావు. కార్మికుల విముక్తి జరగదు. అది జాతీయ స్థాయిలో జరగాలి. యజమానులు లేని సహకార ఉత్పత్తి జరగాలి. ఆ విషయమే 1848 కమ్యూనిస్టు ప్రణాళికలో ప్రకటించ బడింది". ఇదే ప్రసంగంలో అలాంటిదే మరో ఉదాహరణ కూడా చూడవచ్చు. " బ్రిటన్‌లో 10గం॥ పని దినం చట్టం పాస్ కావటం గొప్ప ఆచరణాత్మక విజయం. అది ఒక సూత్రానికి లభించిన విజయం. ఇది మొదటిసారిగా పెట్టుబడి బూర్జువా అర్థశాస్త్రం, శ్రామికుల రాజకీయ అర్థశాస్త్రానికి లొంగిపోవటం. ఎందుకంటే యజమానులు పని సమయంపైన పరిమితి పెట్టటమంటేనే పరిశ్రమలు నాశనం కావటమే అనే అభిప్రాయంలో ఉన్నారు" – కార్ల్ మార్క్సు, పైప్రసంగం.

ఇంటర్నేషనల్ స్థాపన అవసరాన్ని మార్క్సు ఇలా వివరించారు. "ఇప్పటివరకూ అనుభ వాలను బట్టి భూయజమానులు, పెట్టుబడి దారులు కార్మికుల సహకార ఉద్యమాలను, పోరాటాలను అధికారం ద్వారా అన్ని విధాలుగా అడ్డుకుంటున్నారు. దీనిని అధిగమించాలంటే కార్మికవర్గం రాజకీయాధి కారం సాధించటమొక్కటే మార్గం. దీనికోసం ఇగ్లండ్, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్ తదితర ప్రాంతా లలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ ఈ ప్రయత్నాల వల్ల ఒనగూడిన కార్మిక 'సంఖ్యలు' విజయాన్నందించటానికి సరిపోవు. 'సంఖ్య లెపుడైతే ఐక్యమవుతాయో, వాటికి విజ్ఞానం నాయకత్వం వహిస్తుందో' అపుడు మాత్రమే అవి శత్రువుకు సరితూగుతాయి. కానీ వివిధ దేశాల కార్మికుల మధ్య ఆ 'ఐక్య బంధం' ఎంత బలహీనంగా ఉందో వివిధ సందర్భాలలో మనకు అర్థమైంది. ఆ బంధం కోసం ఒక సమగ్రమైన ప్రయత్నం జరగకపోవటమే ఇందుకు కారణం. ఈ ఆలోచనే ఇపుడు ఈ విధంగా ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ ఫెడరేషన్ ఏర్పాటుకు దారితీసింది" కార్ల్ మార్క్సు – అదే ప్రసంగంలో

ఈ విధంగా ఐక్య నిర్మాణ సంస్థ లేకపోవటం అనే ఆటంకాన్ని మొదటి ఇంటర్నేషనల్ ఏర్పాటుతో కార్మికోద్యమం జయప్రదంగా అధిగమించగలిగింది. దీంతో మళ్లీ ఉద్యమాలు యూరప్ అంతటా ఊపందు కున్నాయి.

### 3) 1864–1876 దశ : (ఫస్ట్ ఇంటర్నేషనల్ స్థాపన నుండి రద్దయ్యేవరకూ) (64తరువాత ఉద్యమ పెరుగుదల–పారిస్‌లో కార్మికరాజ్యం : ఓటమి, నిర్బంధం – పార్టీలేకపోవటం ఆటంకం)

మొదటి ఇంటర్నేషనల్ స్థాపన తరువాత అనేక దేశాలలో కార్మికోద్యమాలు వేగంగా పెరిగాయి. అనేక సంఘాలు ఇంటర్నేషనల్‌కు అనుబంధించబడ్డాయి. 1869లో అనేక దేశాలలో కార్మికహక్కులు, వేతనాల కోసం వెల్లువలా సమ్మెలు జరిగాయి. ఫ్రెంచి కార్మికవర్గం మరింత సమరశీల పోరాటాలు సాగించింది. రాజకీయ డిమాండ్లు కూడా ముందుకు తెచ్చింది. ఈ క్రమంలో పారిస్ నగరాన్ని విముక్తిజేసి కార్మికవర్గ రాజ్యాన్ని నెలకొల్పే స్థాయికి కార్మికోద్యమం ఎదిగింది.

#### పారిస్ కమ్యూన్

1870లో ఫ్రెంచి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం పెద్దయెత్తున రాజకీయ కార్యాచరణ చేబట్టింది. లక్షల మందితో ప్రదర్శనలు జరిగాయి. నెపోలియన్ (నెపోలియన్ బోనపార్టీ మేనల్లుడు) రాచరిక ప్రభుత్వం రద్దు అయి రిపబ్లిక్ ఏర్పడాలనేది ప్రధాన డిమాండ్‌గా ఉండేది. ఆ సమయంలోనే ఫ్రాన్స్–ప్రష్యా(జర్మనీ) యుద్ధం జరిగింది. నెపోలియన్ ఓడిపోయి లొంగిపోయాడు. ప్రష్యన్ సైన్యాలు పారిస్‌ను ఆక్రమించటానికి ప్రయత్నించాయి. కార్మికవర్గం వత్తిడితో పార్లమెంట్ రాజరికాన్ని రద్దుచేసి రిపబ్లిక్ ప్రకటించింది. బూర్జువా నాయకులతో జాతీయ రక్షణ ప్రభుత్వం ఏర్పడింది. దేశ రక్షణకోసం కార్మికులు, ప్రజలు దాదాపు 3లక్షల మంది నేషనల్‌గార్డ్సులో చేరారు. కానీ ఏర్పడ్డ ప్రభుత్వం మార్క్సు మాటల్లో చెప్పాలంటే స్వల్పకాలంలోనే 'జాతీయ భక్షణ ప్రభుత్వం'గా మారిపోయింది. ప్రష్యన్ (బిస్మార్క్) సైన్యాలతో రాజీకి ప్రయత్నిం చింది. ఈ ప్రయత్నాలను నేషనల్ గార్డ్సు నిలవరించారు. నేషనల్ గార్డ్సులో అత్యధికంగా పారిస్ కార్మికవర్గమే ఉంది. ప్రభుత్వం వీరిని అణచివేయటానికి ప్రయత్నించిన నేపథ్యంలో సాయుధులైన కార్మికులు తిరగబడి పారిస్ నగరాన్ని హస్తగతం చేసుకున్నారు. నేషనల్ గార్డ్సు కార్మికుల్లో అనేక సైద్ధాంతిక గ్రూపుల వారున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు అత్యధికులు విముఖులు. కార్మికులతో ఏర్పడిన 'కమ్యూన్'కు పరిపాలనను అప్పగించారు. ఒక కేంద్రకమిటీని ఎన్నుకున్నారు. ఈ కమ్యూన్ పారిస్ నగరాన్ని 72 రోజులు పాలించింది. పారిస్ విజయంపై మార్క్సు ఇలా అన్నాడు... "ఇప్పటివరకూ సిద్ధాంత రూపంలో ఉన్న కార్మికవర్గ రాజ్యాధి కారం వాస్తవ రూపం ధరించింది. కార్మిక రాజ్యం ఆచరణ సాధ్యమేనని నిరూపించింది."

కొద్ది నెలల పాలనలోనే కమ్యూన్ అనేక ప్రజోపయోగ చర్యలు తీసుకుంది. 1. అధికారులందరూ ప్రజలచే ఎన్నుకోబడ్డారు. రీకాల్ చేసే హక్కు ఇచ్చారు. సాధారణ కార్మికుల జీతాల స్థాయిలోనే వారి జీతాలు నిర్ణయించారు 2. రీకాల్ చేసే నిబంధనతోనే జడ్జీలను కూడా ప్రజలెన్నుకున్నారు. పోలీ సులను ప్రజల సేవకులుగా ప్రకటించారు 3. రాజ్యానికి మతానికీ సంబంధం లేకుండా చేశారు 4. వయోజనులందరికీ ఉచిత విద్య తప్పనిసరి చేశారు 5. తాకట్టు బాకీలు, 9మాసాల ఇంటి కిరాయిలు రద్దు చేశారు 6. నిత్యావసర వస్తువుల ధరలన్నింటిని కమ్యూనే నిర్ణయించింది 7. కనీస వేతనాల అమలు, శ్రామిక కేంద్రాలు ఏర్పాటుచేసి పని ఇవ్వలేని వారికి భృతి చెల్లించారు 8. అత్యవసరంగా 3 లక్షల మందికి భోజన ఏర్పాట్లు చేశారు 9. యజమానులు కార్మికులపై విధించే పెనాల్టీలను రద్దు చేశారు 10. మూతపడ్డ ఫ్యాక్టరీలను తెరిపించటానికి నిర్ణయాలు తీసుకున్నారు. ఇంకా ఇలాంటి చర్యలెన్నో కార్మికులు, ప్రజలకు అనుకూలంగా తీసుకున్నారు. అయినా 72 రోజుల తర్వాత

పారిస్ కమ్యూన్ ఓడిపోయింది. అతి దుర్మార్గంగా అణచివేయబడింది. పారిస్ నగర విముక్తిని సాధించి, ప్రపంచ పీడిత ప్రజలందరికీ ఉత్సాహం రగిలించిన పారిస్ కార్మికవర్గం, తన మొదటి కార్మిక రాజ్యాన్ని ఎందుకు నిలబెట్టుకోలేక పోయింది? దీనికి ముఖ్యమైన కారణం రాజ్యాధికారానికి సంబంధించి మార్క్సిస్టు అవగాహనతో ఉన్న పార్టీ లేకపోవటం. అలాంటి అవగాహనకు విరుద్ధమైన శక్తులు ఆ విప్లవానికి నాయకత్వం వహించటం. కార్మికోద్యమానికి ఏర్పడిన (పార్టీ లేకపోవటం అనే)ఈ ఆటంకం తొలగించ బడకుండా ఇక ఉద్యమం ముందుకు సాగని పరిస్థితి పారిస్ కమ్యూన్ తరువాత ఏర్పడింది.


**మొదటి ఇంటర్నేషనల్‌లో భిన్న ధోరణులు**

ఇంటర్నేషనల్ ప్రారంభం నుండీ అది ఐక్యంగా లేదు. యూరప్ శ్రామిక ఉద్యమాలలో ఆనాడు నెలకొని ఉన్న వివిధ సైద్ధాంతిక ధోరణులన్నీ ఈ వేదికలో కొనసాగాయి. 1867, 68లలో జరిగిన ఇంటర్నేషనల్ యొక్క రెండు మహాసభలలోనూ ప్రౌడాన్, మార్క్సు మధ్య సైద్ధాంతిక పోరాటం తీవ్రంగా నడిచింది. 1869లో ఫ్రాన్స్‌లో పారిశ్రామిక సమ్మెలు వెల్లువగా సాగాయి. ఈ సమ్మెలకు ఇంటర్నేషనల్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కార్మికుల విముక్తి జరగాలంటే రాజ్యాధికారం కోసం పోరాడాలని ఇంటర్నేషనల్ తీర్మానం చేసింది. ప్రౌడాన్ ఇందుకు వ్యతిరేకం. ఈ క్రమంలో ఫ్రెంచి ప్రభుత్వం ఆ దేశంలో ఇంటర్నేషనల్‌ను రద్దు చేసింది. ఈ చర్య కార్మికులలో ప్రౌడాన్ పలుకుబడిని బలహీనపర్చింది. అయితే 1865లోనే ప్రౌడాన్ చనిపోయాడు.

ప్రౌడాన్ తర్వాత బకునిన్ (1817- 76) రూపంలో మరో అరాచక సిద్ధాంతవేత్త సవాల్‌ను ఇంటర్నేషనల్ ఎదుర్కోవాల్సి వచ్చింది. బకునిన్ సిద్ధాంతాల్లో ముఖ్యమైనవి 1. కార్మికుల రోజువారీ కోర్కెలపై పోరాటాలు అవసరం లేదు. సామూహిక తిరుగుబాటుకు సిద్ధం కావాలి. 2. వివిధ వర్గాలకు రాజకీయ, ఆర్థిక సమానత్వం ఉండాలి. వర్గపోరాటం అవసరం లేదు. 3. మార్క్సు కార్మికవర్గ ప్రాముఖ్యత గురించి అతిగా చెప్పాడు. విప్లవానికి బాగా ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగులు, మహిళలు, మైనారిటీ గ్రూపులు నాయకత్వం వహిస్తాయి అనేవి.

ఈ సిద్ధాంతాలకు ప్రాతినిధ్యం వహించే అరాచకవాదులు ఇతర దేశాలకంటే ఇటలీ, స్పెయిన్, స్విట్జర్లాండ్‌లలో అధికంగా ఉన్నారు.

**" పారిస్ కమ్యూన్ అనుభవాల నుండి మార్క్సు తీసిన పాఠాలను, ముఖ్యంగా కార్మికవర్గ పార్టీ ఏర్పాటు ఆవశ్యకతను ఇంటర్నేషనల్ ఆమోదించింది. పార్టీ అవసరాన్ని వ్యతిరేకించిన బకునిన్ ఇంటర్నేషనల్ నుండి బహిష్కరించ బడ్డాడు. అనేక విరుద్ధ సిద్ధాంతాల కలగూర గంపగా ఇంటర్నేషనల్‌ను నడపటం వల్ల ఉపయోగం ఉండదని మార్క్సు, ఎంగెల్స్‌లు భావించారు. ఇంటర్నేషనల్‌ను 1876లో రద్దు చేశారు. "**




ఫస్ట్ ఇంటర్నేషనల్ సభ్యత్వ కార్డు

వాళ్లంతా ఇంటర్నేషనల్ సంస్థలో చేరారు. పారిస్ కమ్యూన్ సందర్భంగా వీరితో మార్క్సు సైద్ధాంతిక ఘర్షణ మరింత స్పష్టంగా ముందుకు వచ్చింది. పారిస్ నగరాన్ని కార్మిక వర్గం స్వాధీనం చేసుకున్న తరువాత, తీసుకో వాల్సిన ముఖ్యమైన చర్యల గురించి మార్క్సు చేసిన సూచనలేవీ ఈ నాయకత్వం పట్టించు కోలేదు.

మరో ఫ్రెంచి నాయకుడు లూయీ అగస్టు బ్లాంక్వీ(1805-81). ఈయన వాదనేమంటే 'ప్రభుత్వమనేది ఉండటమే కార్మికుల బాధలకు కారణం (అంటే బూర్జువావర్గం, దాని దోపిడీ కాదన్నమాట). ప్రభుత్వాన్ని ధ్వంసం చేయాలి. కార్మిక సంస్థలు, సంఘాలు అవసరం లేదు. పార్టీ అవసరం లేదు. ప్రభుత్వాన్ని కూలదోయటానికి రహస్య కుట్రలు, సాయుధ తిరుగుబాట్లు జరపాలి.'' బ్లాంక్వీ బాగా పలుకుబడి కలిగిన కార్మిక నాయకుడు. 1830, 49లలో జరిగిన తిరుగుబాట్లలో కూడా పాల్గొన్న నాయకుడు. ఆయనకు ప్రభుత్వాలు రెండుసార్లు మరణశిక్షలు విధించాయి. 1870లో పారిస్ కమ్యూన్‌కు నాయకత్వం వహించింది కూడా ఈయనే. ఈ బావజాలమే పారిస్ కమ్యూన్ తప్పిదాలకు, దాని పతనానికి కారణమయింది.

**కమ్యూన్ ఓటమి – పాఠాలు**

పాత ప్రభుత్వ యంత్రాన్ని ధ్వంసంచేసి తమ యంత్రాన్ని నిర్మించుకోకపోవటం, బ్యాంకులను స్వాధీనం చేసుకోకపోవటం, పట్టణానికే పరిమితం కావటం, థెయిర్స్‌ను ఆయన యంత్రాంగాన్ని వదిలేయటం కమ్యూన్ చేయలేకపోయిన ప్రధాన చర్యలనీ, కార్మికులకు విప్లవ సిద్ధాంతం పునాదిగా గల రాజకీయ పార్టీ లేకపోవటమే ఇందుకు ప్రధాన కారణమనీ మార్క్సు విశ్లేషించాడు. పారిస్ కమ్యూన్ ఓటమి తర్వాత బూర్జువా పాలకులు విచక్షణా రహితంగా కార్మికులను, నాయకులను చంపారు. దాదాపు 33 వేల మందిని ఊచకోత కోశారు. పారిస్‌లోనేగాక అనేక దేశాలలో కూడా ఈ హత్యాకాండ సాగింది.

ఈ హత్యాకాండపై మార్క్సు ఇలా స్పందించాడు...'' యజమానుల సేవకులు, కార్మికులు తిరగబడినపుడు బూర్జువా వ్యవస్థ యొక్క నాగరికత, న్యాయం అనేవి తేటతెల్లంగా బయటపడతాయి. అపుడు నాగరికత, న్యాయం అనే తన ముసుగు తీసేసి అతి క్రూరమైన, నిర్దయతో కూడిన ప్రతీకారంగా మన ముందు నిలబడుతుంది. ఈ గొప్ప నాగరికత వాస్తవంగా ఒక సమస్యను ఎదుర్కొంది. అదేమిటంటే గుట్టలుగా పడి ఉన్న ఈ శవాల కుప్పలను తొలగించటం ఎలా అన్నదే ఆ సమస్య'' – కార్ల్ మార్క్సు (ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం గ్రంథం నుండి)

పారిస్ కమ్యూన్ అనుభవాల నుండి మార్క్సు తీసిన పాఠాలను, ముఖ్యంగా కార్మికవర్గ

(మిగతా 31వ పేజీలో)

పార్టీ నిర్మాణం

# కష్టమైనా నష్టమైనా జనంతోనే...

ఎస్.వీరయ్య



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

కరోనా కష్టకాలంలో తెలుగు ప్రజలకు కమ్యూనిస్టులు ఆపన్నహస్తం అందిస్తున్నారు. చేతనైనంత సాయం చేస్తున్నారు. లాక్‌డౌన్ ప్రకటించి ఎవరింట్లో వారుండాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. బయట తిరిగితే కరోనా వ్యాపిస్తున్నదని ఆంక్షలు విధించారు. ఇలాంటి సమయంలో కమ్యూనిస్టులు జనంలో ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. కరోనా వ్యాధిగ్రస్తులకు సహాయం చేస్తున్నారు. కమ్యూనిస్టులూ మనుషులే కదా! వారికీ ప్రమాదమే కదా! జాగ్రత్తపడటం మంచిది కదా అంటున్నారు కొందరు శ్రేయోభిలాషులు. నిజమే! కమ్యూనిస్టులూ మనుషులే... వీరు మానవత్వానికి ప్రతిరూపం. అందుకే కరోనా బాధితులకు ఐసోలేషన్ కేంద్రాలు నిర్వహిస్తు న్నారు. పార్టీ భవనాలనే క్వారంటైన్ సెంటర్ల నిర్వహణకు కేటాయిస్తున్నారు. కరోనా బారినపడి సహాయం కోసం ఎదురు చూస్తున్న వారికి భోజనాలు సరఫరా చేస్తున్నారు. హెల్ప్‌లైన్లు నిర్వహించటం ద్వారా తగు సూచనలివ్వటమే కాదు...సహాయకులు లేక ఇబ్బందులు పడుతున్న వారికి అవసరమైన సహాయం అందిస్తున్నారు.

ఈ కృషిని ప్రజలు అభినందిస్తున్నారు. మరోవైపు కొందరు శ్రేయోభిలాసులు ఆందోళన చెందుతున్నారు. “ఇంట్లోనుంచి బయటకు రాకండి... బతికితే భవిష్యత్తులో ప్రజలకు చాలా సేవ చేయవచ్చు కదా! ” అంటున్నారు. కానీ ఇక్కడే అసలు సమస్య. ప్రజలకు ఇప్పుడు కమ్యూనిస్టుల అవసరం ఉన్నది. సహాయం కోరుతున్నపుడు చేయకుండా... ఎప్పుడో భవిష్యత్తులో చేసేదేమున్నది. ప్రజలకు ఇబ్బందులు ఉండి కమ్యూనిస్టు కార్యకర్తలకు సమస్యలు లేనప్పుడు ప్రజలను ఆదుకోవచ్చు. .....కానీ ప్రకృతి వైపరీత్యాలు కమ్యూనిస్టేతరులకు మాత్రమే రావు. వరదలు, భూకంపాలు అందరి మీదా ప్రభావం చూపుతాయి. అయినా ఆర్థికంగా బలంగా ఉన్నవారు తమను తాము రక్షించుకోగలరు. కానీ కరోనా మహమ్మారి ప్రజల్లో ఏ విధమైన తేడానూ చూడదు. అన్ని వర్గాలనూ, అన్ని తరగతులనూ, వెన్నాడుతున్నది. అన్ని పార్టీల నాయకులనూ, కార్యకర్తలను, ప్రజా ప్రతినిధులనూ వదలటంలేదు కదా! మొత్తం సమాజాన్ని భయకంపితులను చేస్తున్న ఇలాంటి విపత్తు సమయంలోనే కమ్యూనిస్టుల ప్రత్యేకత కనిపిస్తుంది. కమ్యూనిస్టులు ప్రజలకోసం బతుకుతారు. ప్రజల కష్టాలు తమ కష్టాలుగా భావించి పనిచేస్తారు. ఈ క్రమంలో తాము ప్రమాదాలకు గురైనా భరిస్తారు. అందుకే... ఈ ఆపద సమయంలో తెగింపు ప్రదర్శిస్తున్నారు.

కోవిడ్ సమయంలోనే కాదు. తమ జీవిత కాలమంతా ప్రజలకే అంకితం. కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, ఇతర పార్టీల లాగా, పార్టీలో చేరితే ఏదో ప్రయోజనం ఉంటుందని చేరటం లేదు. సమసమాజం కోసం, సమాజ మార్పు కోసం పనిచేస్తున్న పార్టీ కోసం, ప్రజలకోసం తమ సొంత సుఖాలను కొన్ని వదులుకుంటున్నారు. అదే కమ్యూనిస్టుల ప్రత్యేకత. పార్టీలో చేరిన సభ్యులు పార్టీకి లెవీ చెల్లిస్తున్నారు. ఆర్థికంగా ఉండికాదు. తమ ఆదాయాన్ని బట్టి, పార్టీ నిబంధనావళిలో నిర్దేశించిన మేరకు తాము బాధ్యతగా చెల్లిస్తున్నారు. ఖాళీ సమయాలలో, కాలక్షేపం కోసం కాదు. తమ వృత్తి అనంతరం, కుటుంబ పనులు కొన్ని పక్కనపెట్టి, ప్రజల కోసం పని చేస్తునారు. సొంత పనులు, వదులుకుని ప్రజాసేవకు కేటాయిస్తున్నారు. ఇది కమ్యూనిస్టులందరూ చేసే నిరంతర ప్రక్రియ. అంతేకాదు, ప్రజాసమస్యల పరిష్కారం కోసం పని చేసే క్రమంలో నిందలూ అవమానాలు సైతం భరిస్తున్నారు. దెబ్బలు, కేసులు, జైళ్ళు భరించేది ప్రజలకోసమే కదా! కరోనా లాంటి మహమ్మారి విజృంభిస్తున్న సమయంలో బాధితులతో కాకుండా కమ్యూనిస్టులెక్కండుంటారు? అందరికీ సమస్యలున్నపుడే కదా కమ్యూనిస్టుల అవసరం కూడా ! అయితే.. లాక్‌డౌన్ సమయంలో సహాయక చర్యలు చేయగలమా? లాక్‌డౌన్ నిబంధనలు ఆటంకం కాదా? నిజమే..... చైనా, క్యూబా లాంటి సోషలిస్టు దేశాలలో ఇలాంటి ప్రశ్నలుదయించవు. అన్ని బాధ్యతలూ ప్రభుత్వమే చూసుకుంటుంది. ఇంట్లోనుంచి బయటకు రాకుండా ఉంటే చాలు. కానీ మన దేశంలో అట్లా కాదు. మన దేశ ప్రభుత్వం చేతులెత్తేసింది. బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాల మీద నెట్టేసింది. రాష్ట్రాలు ఎంతో కొంత చేసినా... చేయగల్గినంత చేస్తున్నాయని చెప్పలేము. కేరళలో వామపక్ష ప్రభుత్వం చేస్తున్న కృషితో పోల్చి చూస్తే తేడా అర్థమౌతుంది. పాలకులు తమ బాధ్యత సక్రమంగా నిర్వహించ నప్పుడు ప్రజలకు కమ్యూనిస్టులు కాక ఇంకెవరు సహాయ పడుగలరు. కరోనా వ్యాపించకుండా ఉపయోగపడే మేరకు ఆంక్షలు పాటిస్తారు. ప్రజలకు సహాయపడేందుకు ఆటంకమైతే ప్రశ్ని స్తారు. ఇదీ కమ్యూనిస్టు పద్ధతి. ఆటంకాలపేరుతో ఇంటికి పరిమితం కావటం కాదు. ఆటంకాలను అధిగమించటం కమ్యూనిస్టు పద్ధతి. ప్రతి సమస్య పరిష్కారానికీ పైనాయకత్వం వైపు చూడటం కాదు. ప్రజలకు సహాయం చేయటం కోసం శక్తిమేరకు ఆటంకాలు అధిగమించే మార్గాలు వెతకటమే కమ్యూనిస్టు లక్షణం.

కష్టాలకాలంలో క్షేత్రస్థాయిలో ప్రజలకు సహాయం మరింత ఎక్కువగా అవసరముంటుంది. అందుకే పార్టీ శాఖలు, ఆగ్జల్లరీ గ్రూపులు సాధారణ పరిస్థితుల్లో కన్నా పట్టుదలగా పనిచేయవల్సి ఉంటుంది. తమ భద్రత కోసం, కరోనా వ్యాపించకుండా జాగ్రత్తలన్నీ తీసుకుంటూనే శాఖలు, ఆగ్జల్లరీ గ్రూపులు మరింత పట్టుదలతో పనిచేయవల్సిన సమయమిది. ఇలాంటి క్లిష్ట సమయంలో సరైన నిర్ణయాల కోసం, సమిష్టి అవగాహన కోసం సమావేశమౌతాయి. ప్రజలకు సహాయం అందించేందుకు అందరి సూచనలు, అభిప్రాయాలు తీసుకునేందుకు, అందరినీ భాగస్వాములను చేసేందుకు సమావేశమవుతాయి. కరోనా సమయంలో సమావేశమైన శాఖలకు, ఆగ్జల్లరీ గ్రూపులకు ప్రజలకు సహాయపడటం తప్ప వేరే ఎజెండా ఏముంటుంది?

కరోనా బాధితులను ఒంటరి పాటు చేసి వైద్యం అందించటం సాధారణ విషయం కాదు. దూరం పెడుతున్నారన్న సెంటిమెంటు పని చేస్తుంది. వివక్ష పాటిస్తున్నారని బాధపడతారు. భయపడతారు. అవమానంగా భావిస్తారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని, తమకు కరోనా వచ్చిందన్న విషయాన్ని దాచిపెట్టేందుకు ప్రయత్నిస్తారు. ఇలాంటి సమయంలోనే వారికి ధైర్యం చెప్పేవారు కావాలి. అనునయించే వారు కావాలి. క్వారంటైన్ అయితే ముందులు,

భోజనాలు అందించేవారు కావాలి. సకాలంలో టెస్టులు చేయించి, డాక్టరుకు చూపించేవారు కావాలి. చాలామందికి చిన్న చిన్న నివాసాలుంటాయి. కరోనా బాధితులను విడిగా ఉంచేందుకు వీలుగా బాత్‌రూమ్ సౌకర్యంతో కూడిన గదులు అదనంగా ఉండవు. అందువల్ల ఒకరికి కరోనా వస్తే కుటుంబంలో అందరికీ అంటుకుంటున్నది. అందుకే ఒకరికి రాగానే నచ్చజెప్పి క్వారంటైన్ సెంటరుకు తీసుకుపోవాలి. ఇవన్నీ ఎంతో ఓర్పుతో, సహనంతో, పట్టుదలతో చేయవల్సిన పనులు. కమ్యూనిస్టు చైతన్యం ప్రదర్శించవల్సిన పనులు. తాము పార్టీలో సభ్యులుగా చేరినపుడే ప్రమాణం చేసి సంతకం చేస్తారు. ఎల్లవేళలా స్వప్రయోజనం కన్నా ప్రజల ప్రయోజనమే మిన్నగా భావించి పని చేస్తానని మనస్ఫూర్తిగా ప్రమాణం చేస్తారు. అలాంటి చైతన్యం కల్గిన వారే స్వచ్ఛందంగా పార్టీలో చేరుతారు. ఇతర పార్టీలకన్నా భిన్నంగా, కమ్యూనిస్టు పార్టీనే ఇలాంటి ప్రత్యేకతను కల్గిఉంటుంది.

> **ఆగ్జిలరీ సభ్యులంటే ఇంకా పార్టీ సభ్యులు కాదు కదా! వారుకుడా త్యాగం చేస్తారా? అని కొంతమందికి సందేహం. నిజమే! అలాంటి చైతన్యం, సేవాదృక్పథం, ప్రజల పట్ల అంకిత భావం ఉన్నవారే కదా పార్టీ సానుభూతిపరు లుగా మారేది. వారే కదా ఆగ్జిలరీ గ్రూపులలో ఉండేది. ఇదంతా ఒకభాగం. కమ్యూనిస్టులూ, కమ్యూనిస్టు సానుభూతిపరులే కాదు, సమాజంలో చాలామంది సమాజసేవ చేస్తు న్నారు.**

ఆగ్జిలరీ సభ్యులంటే ఇంకా పార్టీ సభ్యులు కాదు కదా! వారుకుడా త్యాగం చేస్తారా? అని కొంతమందికి సందేహం. నిజమే! అలాంటి చైతన్యం, సేవాదృక్పథం, ప్రజల పట్ల అంకిత భావం ఉన్నవారే కదా పార్టీ సానుభూతిపరులుగా మారేది. వారే కదా ఆగ్జిలరీ గ్రూపులలో ఉండేది. ఇదంతా ఒకభాగం. కమ్యూనిస్టులూ, కమ్యూనిస్టు సానుభూతిపరులే కాదు, సమాజంలో చాలామంది సమాజసేవ చేస్తున్నారు. దేశంలో పరోపకారుల సంఖ్యకు కొదవలేదు. సొంతలాభం కొంత మానుకుని పొరుగువారికి తోడ్పడుతున్న వారి సంఖ్య తక్కువేమీకాదు. ఈ మాత్రం సహకార ధోరణి లేకపోతే కరోనాకు అనేకరెట్లు ఎక్కువ మంది బలయ్యేవారు. పాలకులు బాధ్యతారహితంగా ఉన్నప్పటికీ ఈ దాతృత్వమే సమాజాన్ని కాపాడుతున్నది. ఇలాంటి సద్గుణాలున్నవారు. సహృదయులు, ప్రజలపట్ల ప్రేమాభిమానాలున్న వారు ఆదుకుంటున్నారు.

కమ్యూనిస్టులు మరిన్ని త్యాగాలకు సిద్ధపడతారు. సమాజమార్పు కోసం పోరాడుతారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణాలర్పించిన నాలుగువేల మంది యోధుల లో కార్యకర్తలు, సభ్యులు కూడా కానివారే ఎక్కువ మంది. గతంలో తెలంగాణలో అంబలి కేంద్రాలు నడిపటంలో సహకరించినవారు, కోస్తా ప్రాంతంలో సునామీ బాధితులను ఆదుకోవటంలో అనేక మంది పాత్ర మనం చూసాం. కేరళ వరదల సందర్భంగా కూడా వామపక్ష ప్రభుత్వం చేయగల్గిందంతా చేస్తూనే, ప్రజల సహకారం కూడా తీసుకున్నది. ఇలాంటి కష్టకాలంలో తమకు కరోనా వస్తుందేమోనని భయపడకుండా, తగు జాగ్రత్తలు తీసుకుంటూనే, సహాయ కార్యక్రమాలలో పాల్గొనటమే ఇప్పుడు కావాలి. ప్రజల పట్ల నిబద్ధత, త్యాగనిరతి ప్రదర్శించటం, కమ్యూనిస్టు చైతన్యం పెంపొందించుకోవటంలో ఇవన్నీ భాగమే.

మానవతా దృక్పథంతో సేవచేసేవారు అనేక మంది తెగించి సహాయ కార్యక్రమాలు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో కోవిడ్ మృత దేహాలను తరలించటం, ఖననం చేయటంలో స్వచ్ఛందంగా సహాయపడుతున్న యువతీ యువకులను చూస్తున్నాం. మత భేదాలు కూడా పక్కన బెట్టి ముందుకొచ్చిన ముస్లిం యువకుల సాహసం కూడా చూసాం. సొంత కుటుంబీకులు దూరం పెట్టినా, చేరదీసి ఆదుకున్న ఇరుగుపొరుగును చూస్తున్నాం. కమ్యూనిస్టులు మరింత త్యాగనిరతిని ప్రదర్శిస్తారు. మానవతావాదుల్లో అత్యున్నతులు కమ్యూనిస్టులు. కమ్యూనిస్టుల లక్ష్యం మరింత విస్తృతమైంది. రాజ్యాధికారం చేతుల్లో ఉన్న దేశాలలో ప్రజలను అన్నివిధాలా కాపాడగల్గుతున్నారు. అందుకే కరోనాను ఎదుర్కోవటంలో సోషలిజం అగ్రస్థానంలో ఉన్నది. మనలాంటి దేశంలో ఒక రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ, వనరులు, అధికారాలు పరిమితమే అయినా..ప్రజల సహకారంతో కోవిడ్‌ను ఎదుర్కోగల్గుతున్నది కేరళ వామపక్ష ప్రభుత్వం. కమ్యూనిస్టులు అధికారంలో లేని చోట, ఇలాంటి ప్రకృతి విపత్తును ఎదుర్కోవల్సి వచ్చినపుడు స్వచ్ఛందంగా ప్రజలకు సహాయపడతారు. కమ్యూనిస్టులంటే ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలను సమీకరించి ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించటమే కాదు, బాధిత ప్రజలకు చేతనైనంత సేవకూడా చేస్తారు. అదీ కమ్యూనిస్టుల ప్రత్యేకత. ❋

# శ్రామికుల శత్రువులెవరు?

**(గత సంచికలో శ్రామికులకు శత్రువులు ఎవరు? అనే శీర్షికతో ఎస్ వీరయ్య గారు రాసిన వ్యాసం తరువాయి భాగాన్ని 34వ పేజీలో ఇస్తున్నట్లు సూచించాం కాని ఇవ్వలేదు. ఆ భాగాన్ని కింద ఇస్తున్నాం. పొరపాటుకు చింతిస్తున్నాం... సంపాదకుడు)**

వేటాడింది. మతాంతర వివాహాలను అడ్డుకునేందుకు రాజ్యాంగ విరుద్ధమైన చట్టం చేసింది. హర్యానాలో ఆవులను చంపారన్న నెపంతో దళితులను హత్యచేశారు. దళితుల ప్రాణాల కన్నా గోవుల ప్రాణాలే మిన్న అని బహిరంగంగానే మాట్లాడారు. భయానకమైన పోలీసు చట్టాన్ని బీహార్ ప్రభుత్వం ఆమోదిం చింది. 2002 లోనే గుజరాత్‌లో బిజెపి ప్రభుత్వం మతమారణ హోమం సృష్టించింది. అస్సాంలో ఇప్పటికే ప్రాంతీయ పార్టీ అయిన ఎజిపిని బిజెపి మింగేసింది. బీహార్‌లో ఇపుడు నితీష్ నాయకత్వంలో వున్న పార్టీని మింగేసే క్రమం సాగుతోంది. బడా పారిశ్రామికవేత్తల కోసం ఏం చేయడానికైనా కేంద్రంలో బిజెపి సర్కార్ సిద్ధంగా ఉన్నది. ఇప్పటికే కేంద్రంలో పూర్తి మెజారిటి సాధించిన బిజెపి పట్టు బిగిస్తున్నది. తెలుగురాష్ట్రాల్లో కూడా బిజెపి బలపడితే ఇక శ్రామిక ప్రజలకు కనీస భద్రత కూడా కరువవుతుంది. కార్మికులు, రైతులు, కూలీలు, వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం, లైంగిక దాడులకు, కుల వివక్షకు వ్యతిరే కంగా రాజీలేని పోరాటం చేయాలి. అదే సమయంలో తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వం పట్లగానీ, ఏపిలో వైసిపి ప్రభుత్వం పట్ల గానీ అసంతృప్తికి లోనైన శ్రామిక జనం ఎర్రజెండావైపు చేరాలి. వారిని కమ్యూనిస్టుల వైపు ఆకర్షించాలి. ఇందుకు భిన్నంగా బిజెపి వైపు చూడడమంటే పులినోట్లో తలపెట్టడమే! బడా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం, కార్మికులకూ, రైతులకు వ్యతి రేకంగా, కేంద్రంలో బిజెపి సర్కార్ ఏమిచేయడానికైనా సిద్ధంగా ఉంది. అందుకే తెలుగు రాష్ట్రాల్లో బిజెపి బలపడకుండా చేసేందుకు ఇక్కడి శ్రామికులు, ప్రజాస్వామికవాదులు సర్వశక్తులూ ఒడ్డి కృషిచేయాలి.

చరిత్ర

# ఇనుము వాడకం-ఉత్పత్తిలో మిగులు ఏర్పడడం



రచయిత ప్రజాశక్తి సంపాదకులు

ఎంవిఎస్ శర్మ

మన భారత ఉప ఖండంలో ఇనుము వాడకం క్రీ.పూ. 1200 నాటికే ఉన్నా, వ్యవసాయంలో ఇనుప పనిముట్లను ఉపయోగించడం క్రీ.పూ. 800-700 కాలంలో విరివిగా జరిగింది. కర్ర పిడి బిగించిన ఇనుప గొడ్డలి ని ఉపయోగించి చెట్లు, అడవులు, నరికి ఎక్కువ భూభాగాన్ని వ్యవసాయానికి అనువుగా సాగులోకి తీసుకురాగలిగారు. నాగలికి ఇనుప కర్రు కలిపి వాడినందున భూమిని ఎక్కువ విస్తీర్ణంలో పంటభూమిగా మార్చగలిగారు. గంగా మైదానం ప్రాంతంలో అనేక కొత్త ఆవాస ప్రాంతాలు ఏర్పడ్డాయి. వాటిలో కొన్ని పెద్ద గ్రామాలుగా, తక్కినవి చిన్న గ్రామాలుగా రూపొందాయి.

వ్యవసాయం విస్తరించినందున దాని ద్వారా సమకూరే మిగులు సంపద కూడా పెరిగింది. సమాజంలో వర్గ విభజన మరింత పెరిగింది. క్రీ.పూ. 500 నాటి కోటలు కొన్ని గంగా మైదానం లో తవ్వకాలలో వెలుగు చూశాయి. అంటే అప్పటికే కోటలు కట్టుకుని తమవద్ద పోగుపడిన మిగులు సంపదను రక్షించుకునే పటిష్టమైన ఏర్పాట్లు చేసుకున్న వర్గం ఏర్పడిందని భావించాలి. కొన్ని గ్రామాల చుట్టూ బలంగా కంచెలు నిర్మించుకున్న దాఖలాలు కూడా తవ్వకాలలో బైటపడ్డాయి.

రకరకాల ఆకారాలలో ఇనుమును పోతపోసి వివిధ రకాల పనిముట్లు తయారు చేయగలిగే సాంకేతికనైపుణ్యం క్రీ.పూ.700 నాటికి ఉండేది గనుకనే ఉత్పత్తి సామర్థ్యం పెరిగి ఈ మార్పులు సంభవించాయి.

**నాణేల తయారీ, వినియోగం**

వినయపిటక (బౌద్ధ గ్రంథం) లో అనాథ పిండకుడు అనే వ్యాపారి బుద్ధుడికి ఒక ఆశ్రమాన్ని నిర్మించి కానుకగా ఇవ్వ తలపెట్టిన గాథ వివరంగా ఉంది. కుమారుడు అనే భూ యజమాని అధీనంలో ఉన్న భూమి అన్నివిధాలా అనుకూలంగా ఉన్నట్టు భావించి దానినికొను గోలు చేయడానికి సిద్ధపడతాడు అనాథపిండ కుడు. ఆ భూమి ఉన్నంతమేరా నాణేలు పరిచితే ఎంత ధనం అవుతుందో అంత ధనాన్ని కుమారుడికి చెల్లించి జేతవనాన్ని కొనుగోలు చేస్తాడు.


ఇంకో సందర్భంలో జీవకుడు అనే వైద్యుడికి సాకేత పురం లోని ఒక సంపన్నుడు 16000 నాణేలను వైద్యం కోసం చెల్లించిన ఉదంతం ప్రస్తావన ఉంది. ఇంకొక సందర్భం లో ఒక ధనవంతుడైన వ్యాపారి సంతానం లేకుండా మరణిస్తే అతడి సంపద ఒక లక్ష క్షపణాల మేరకు ఆ ప్రాంతం రాజు స్వంతం ఔతుంది.

ఈ ఉదంతాలన్నింటిలో పేర్కొన్న సొమ్ము ఎక్కువ అతిశయోక్తులతో కూడి అభూత కల్పనలతో కూడి వుంది. ఐతే ఆనాడు నాణేల వాడకం విస్తృతంగా ఉండేదన్న నిర్ధారణకు మనం రావచ్చు. (చూ. మ్యాప్ 1.2)

నాణేల వినియోగం పెరగడంతో వస్తు మార్పిడి పద్ధతి స్థానే నగదు వినియోగం ప్రధానంగా ఉండే కొత్త వ్యాపార పద్ధతి ఉనికి లోకి వచ్చింది.

ఒక బౌద్ధ ఉపాసకుడు ఒక వ్యాపారి నుండి నెయ్యి కొనుగోలు చేసి అందుకోసం ఒక క్షపణం చెల్లిస్తాడు. ఆ తర్వాత ఆ నెయ్యి అవసరం లేదని బౌద్ధ ఆరామంలో నిర్వాహకులు తిరస్కరిస్తారు. తిరిగి ఆ నెయ్యిని వ్యాపారికి ఇచ్చి తన క్షపణాన్ని వెనక్కి ఇచ్చెయ్యమని ఆ ఉపాసకుడు కోరుతాడు. "ఇలా కొన్న వాటిని నీలాగే అందరూ తిరిగి ఇచ్చేస్తే ఇక వ్యాపారం ఏవిధంగా జరుగుతుంది ? కనుక నీకు సొమ్ము వాపసు ఇచ్చే ప్రసక్తి లేదు. నెయ్యికి బదులు కావాలంటే నూనె తీసుకెళ్ళు" అని ఆ వ్యాపారి చెప్తాడు.

వినయపిటక లోని పై గాథ కొత్త వ్యాపార సూత్రాల తీరును వెల్లడి చేస్తోంది. ఇంత విస్తారంగా వ్యాపారానికి నగదు వాడకం తోడైతే అందుకోసం చాలా పెద్ద మొత్తం లో నాణేల ఉత్పత్తి జరగడం అవశ్యం అవుతుంది. ముద్రలతో ఉన్న నాణేలు దాదాపు భారత దేశంలోని అన్ని ప్రాంతాలలోని తవ్వకాలలోనూ లక్షల సంఖ్యలో లభించాయి. భారీగా నాణేల వాడకం, అందునిమిత్తం నాణేల ముద్రణ జరిగిందని ఈ ఆధారాలు ధృవీకరిస్తున్నాయి. క్రీ.పూ. 600 నాటి నాణేలు ప్రధానంగా వెండి తోను, ఆ తర్వాత రాగి తో మిశ్రమం చేసిన వెండి తోను ముద్రించేవారు. ఒక వెండి నాణేన్ని క్షపణం అనేవారు. ఒక్క వెండి నాణేలే కాకుండా రాగి నాణేలు కూడా వాడకంలో ఉండేవి. ఇవి గాక ఒక విధమైన సముద్రపు గవ్వలను కూడా తక్కువ విలువ కల నాణేలుగా ఉ



పయోగించారు. " నా దగ్గర చిల్లి గవ్వ కూడా లేదు" అనే మాట ఇటీవల వరకూ వాడేవారు. ఆ నాటి కాలంలో ముద్రించిన నాణేలను తర్వాత అయిదారు వందల సంవత్సరాలపాటు వినియోగించారు. (చూ. ఫిగర్ 1.5, )

### వర్తకం

బౌద్ధ గ్రంథాలలో వర్తకం, సంబంధిత కార్యకలాపాలను "వాణిజ్యం" అని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని "కాశి" అన్నారు.

వ్యవసాయానికి ఎక్కువ కష్టపడాలని, అయినా ఫలితం వస్తుందని ఖరాఖండిగా చెప్ప లేమని, అదే వాణిజ్యం అయితే కష్టం తక్కువ, సమస్యలు తక్కువ, లాభాలు ఎక్కువ అని బుద్ధుడు స్వయంగా చెప్పినట్టు "మజ్జిమ నికాయ" అనే బౌద్ధ గ్రంథంలో ఉంది.


తేనెటీగ పువ్వులనుండి తేనెను నొప్పించ కుండా సేకరించిన చందాన వ్యాపారి ధనార్జన చేయాలని, అలా చేయగలిగిన వ్యాపారివద్ద ధనం చెదలపుట్ట ఏవిధంగా క్రమంగా పెరుగు తూపోతుందో అదే విధంగా పెరుగుతుందని బుద్ధుడు "దీఘ నికాయ" అన్న గ్రంథంలో చెప్పాడు. తాను జీవనాన్ని సాగించడానికి, తన వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి మూడొంతుల సంపాదనను వినియోగించాలని, ఒక వంతు కష్టకాలం వచ్చినప్పుడు ఉపయోగించుకోడానికి దాచాలని బుద్ధుడు సూచించాడు.

పాపనికుడు (దుకాణదారుడు), క్రమ-విక్రయిక (రిటైల్ వ్యాపారం), వసనికుడు (పెట్టుబడి పెట్టేవాడు) వణిజుడు (చిన్న వర్తకుడు) అని నాలుగు రకాల వర్తక మార్గాల లోని వారి గురించి పాళీ గ్రంథాలలో ప్రస్తావిం చారు.

బౌద్ధ ఉపాసకులకు వ్యాపారం ఒక వృత్తిగా చేపట్టేందుకు అనుమతి లేదు. ఐతే ప్రజలలో అనేకులు రకరకాల వస్తువుల వ్యాపారంతో బాటు ఆయుధాలు, మనుషులు (మనుషులు కూడా అమ్ముడుపోయే సరుకు గా ఉండేవారని చెప్పడానికి ఇదొక తార్కాణం) జంతువుల, వాటి మాంసం, మత్తుపానీయాలు, విషం వంటి సరుకుల వ్యాపారాలను సైతం చేపట్టేవారు. బౌద్ధ ఆరామాలలో సేవలు చేసే మహిళలకు పూటకూళ్ళ గృహం నడపడం, జంతు వధ్యశాల నడపడం, వడ్డీ వ్యాపారం చేయడం వంటి వ్యాపారాలు నిషేధం. అంటే ఆనాటి మహిళలు ఎక్కువ సంఖ్యలో వ్యాపారంలో ముఖ్యభూమిక పోషించారని చెప్పవచ్చు.

ఇక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి పోయి వ్యాపారం చేయడం కూడా ఎక్కువగా జరిగేది. పశ్చిమాన తక్షశిల నుండి తూర్పున

**" జైన గ్రంథాలలో అయిదు రకాల ప్రయా ణీకుల గురించి ప్రస్తావించారు. 1. భండి : బండ్లపై సరుకులను తోసుకుంటూ తీసుకు పోయేవారు., 2. బాహిలగ : ఒంటెలు, కంచర గాడిదలు, ఎడ్లు లాగే బళ్ళపై ప్రయాణం చేసేవారు., 3. భారవాహ : వారి సామాన్లను వారి నెత్తిమీదే మోసుకుని పోయేవారు., 4. ఒడరియా : ఒక చోటినుండి ఇంకొక చోటికి తిరుగుతూ పొట్ట పోసుకునే సంచార జీవులు., 5. కపర్తికులు : సన్యాసులు. "**


ప్రాచీన నాణేలు

మగధ, కోసల వరకూ సుదూర ప్రాంతాల మధ్య వ్యాపారం విరివిగా సాగింది. ఈ మార్గాన్ని కలిపిన రహదారి ఉత్తరాపథంగా ప్రసిద్ధి చెందింది. వందల సంఖ్యలో ఎడ్ల బండ్లపై సరుకులు నింపుకుని వ్యాపారులు మార్గం లో తగిలే జనావాసాలలో తమ సరుకులను అమ్ముతూ పోయేవారు. రెండెడ్ల బళ్ళు అప్పటికే వాడకంలో ఉన్నాయి.

జైన గ్రంథాలలో అయిదు రకాల ప్రయాణీకుల గురించి ప్రస్తావించారు. 1. భండి : బండ్లపై సరుకులను తోసుకుంటూ తీసుకు పోయేవారు., 2. బాహిలగ : ఒంటెలు, కంచర గాడిదలు, ఎడ్లు లాగే బళ్ళపై ప్రయాణం చేసేవారు., 3. భారవాహ : వారి సామాన్లను వారి నెత్తిమీదే మోసుకుని పోయేవారు., 4 . ఒడరియా : ఒక చోటినుండి ఇంకొక చోటికి తిరుగుతూ పొట్ట పోసుకునే సంచార జీవులు., 5. కపర్తికులు : సన్యాసులు.

కొందరు పగటిపూటలో మాత్రమే ప్రయాణం చేస్తే, మరికొందరు రాత్రుళ్ళు ప్రయాణాలు చేసి పగలు వ్యాపారం చేసేవారు ఉండేవారు.

నదీమార్గం గుండా ప్రయాణం చేయడం కూడా ఎక్కువగా జరిగేది. గంగ, సోన్, గాఘర నదులు మూడూ కలిసే ప్రాంతంలో ఉన్నందున పాటలీపుత్రం (పాట్నా) ఒక ప్రధాన కేంద్రం గా ఎదిగింది.

### విదేశీ వాణిజ్యం, సంబంధాలు

క్రీ.పూ. 500 నాటి గ్రీసు రాజు దారియస్ కాలంలో ఈజిప్టు నుండి అరేబియన్ సముద్రం ద్వారా సింధు నది పరీవాహక ప్రాంతానికి మార్గం కనుగొన్నారు. ఆ మార్గం గుండా వివిధ దేశాల నడుమ రాకపోకలు, వ్యాపారం సాగింది.( ఈ మార్గం గుండానే అలెగ్జాండర్ క్రీ.పూ. 325లో భారత ఉపఖండం పైకి వచ్చాడు.) ప్రధాన రేవుల వద్ద తాము తెచ్చిన సరుకులను దించి, అక్కడకు చేర్చిన సరుకులను తిరిగి ఎక్కించుకుని పోయే మధ్య దళారీలు ఎక్కువగా అరేబియా,పర్షియన్ ప్రాంతాలవారు ఉండేవారు.

గ్రీకు దేశంతో సాగిన వ్యాపారంలో ఎక్కువగా పత్తి, నల్లచేవమాను కలప, కెంపులు, నీలమణులు, రంగు చలువరాళ్ళు, స్ఫటికాలు మన ఉపఖండం నుండి ఎగుమతి అయాయి.

హిమాలయాల వద్ద, కాశ్మీరం వద్ద బంగారం గనులు ఉన్నట్టు మెగస్థనీసు తన గ్రంథంలో ప్రస్తావించాడు. ఏనుగు దంతాలు మరొక ప్రత్యేకత గల విలువైన వ్యాపార సరుకుగా ఉండేది.

దుస్తులకు రంగులు అద్దడానికి ఉపయోగించే పదార్థాలు ( కొన్ని రకాల మొక్కల బెరళ్ళ నుంచి తయారు చేసేవి) మనదేశం నుండి ఎగుమతి అయిన మరో అపురూపమైన సరుకు గా పరిగణించబడేవి. కొన్ని రకాల నూనెలనుండి తయారు చేసిన అత్తరులు కూడా ఇక్కడి ప్రత్యేకత. మిరియాలు, నువ్వుల నూనె, ద్రాక్ష సారాయి కూడా ఎగుమతి అయేవి.

మన దేశంలో వైద్యం విశిష్టమైనదిగా గ్రీకులు భావించేవారని వారి గ్రంథాలు తెలియ జేస్తున్నాయి. ముఖ్యంగా పాముకాటుకు విరుగుడు మందు గురించి వాటిలో పేర్కొన్నారు.


❋

రాజకీయ పరిణామాలు

### అయిదు రాష్ట్రాల ఎన్నికలు:

# మతోన్మాదానికి లౌకికవాద ప్రతిఘటన

**వెంకటేశ్ రామకృష్ణన్**


రచయిత ప్రముఖ పాత్రికేయులు

**మా**ర్చి, ఏప్రిల్ నెలలలో జరిగిన ఎన్నికలలో పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, తమిళనాడులో డిఎంకె నాయకత్వంలోని సంఘటన, కేరళలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ఘన విజయాలు దేశంలోని అన్ని ప్రాంతాలలో హిందుత్వ రాజకీయ ఆధిపత్యాన్ని ప్రతిష్టించాలన్న బిజెపి భారీ ప్రణాళికను ధ్వంసం చేశాయి. ఈ విజయాలు భారతదేశ రాజకీయ వైవిధ్యాన్ని, సమాఖ్య స్వభావాన్ని నొక్కిచెప్పాయి.

పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలలో మార్చి, ఏప్రిల్ నెలలలో జరిగి ఎన్నికలకు చాలా ముందుగానే ప్రధాని నరేంద్రమోడి, హోంశాఖమంత్రి అమిత్‌షాలతో పాటు బిజెపి, సంఘ్ పరివార్ నాయకులు ఈ ఎన్నికలను తమ తరహా రాజకీయాలలో ఒక చిరస్మరణీయ సంఘటనగా చేయాలని భావించారు. ప్రధాని మోడి నాయకత్వంలో 2014, 2019 లలో రెండు సార్లు అత్యధిక మెజారిటీతో కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ, సంఘ్ పరివార్ రాజకీయ ఆధిపత్యం దేశంలోని అన్ని ప్రాంతాలలోకి విస్తరించలేదన్న వాస్తవాన్ని ప్రాతిపదికగా తీసుకొని ఈ వ్యూహాన్ని రూపొందించారు. ఈ దఫా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించటం ద్వారా ఈ పరిస్థితిని మార్చాలని, హిందురాష్ట్రకు అవసరమైన నిర్దిష్ట, శాశ్వత రాజకీయ, సామాజిక మార్పులను దేశంలోని అన్ని ప్రాంతాలలోకి చొప్పించవచ్చునని వారు భావించారు.

దేశంలో జనాభారీత్యా నాలుగవ స్థానంలో ఉన్న పశ్చిమబెంగాల్‌లో మమతాబెనర్జి నాయకత్వంలో వరుసగా రెండుసార్లు గెలిచి, పది సంవత్సరాల నుండి అధికారంలో ఉంటున్న తృణమూల్ కాంగ్రెస్‌ను ఓడించి, బిజెపి అధికారంలోకి రావటం ఈ వ్యూహంలో ప్రధానం. ఈ లక్ష్యం సాధించటం కోసం తీవ్రవాద, మతోన్మాద ప్రచారాన్ని బహిరంగంగా సాగించటాన్ని వారు మార్గంగా ఎంచుకున్నారు. అస్సాంలో తాము అధికారాన్ని నిలబెట్టుకుంటామని, తమిళనాడులో తమకు నమ్మకమైన, అణిగిమణిగి ఉండే మిత్రపక్షం ఎఐఎడిఎంకెతో కలిసి అధికారానికి వస్తామని వారు ప్రచారం చేసుకున్నారు. 2016లో ఒకే ఒక్కస్థానం సాధించిన కేరళలో తాము అత్యున్నతమైన పనితీరును కనబరుస్తామని సంఘ్ పరివార్ భావించింది. దక్షిణాదిన ఉన్న కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్నికలకు ముందు ఫిరాయింపులు, ఇతర కుతంత్రాలతో కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని కూలదోసిన బిజెపి ప్రాంతీయ పార్టీ అయిన ఆల్ ఇండియా నమదు రాజ్యం కాంగ్రెస్(ఎఐఎన్ఆర్‌సి)తో పొత్తు పెట్టుకుంది. అందువలన మే 2న ఎన్నికల ఫలితాలు వెలువడేటప్పుడు తమ లక్ష్యమైన హిందురాష్ట్ర వైపుకు సాగిపోవటంలో ప్రధానమైన విజయాలు సాధిస్తామని సంఘ్ పరివార్ భావించింది.

కాని ఎన్నికల ఫలితాలు బిజెపి, సంఘ్ పరివార్ పగటికలలను పటాపంచలు చేశాయి. ఫలితాల స్వభావాన్ని, వాటి మొత్తం సారాంశాన్ని పరిశీలించినపుడు దేశంలోని రాజకీయ వైవిధ్యాన్ని, రాజ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్యవాద మౌలిక సూత్రాలను ప్రజల తీర్పు బలపరిచిందని స్పష్టమైంది. పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళలలో బిజెపి తిన్న తీవ్రమైన ఎదురు దెబ్బలు దేశంలోని అన్ని భౌగోళిక ప్రాంతాలపైనా ఆధిపత్యం సాధించాలన్న దాని ఆకాంక్షలను వమ్ముచేశాయి. ఈ రాష్ట్రాలలో ఎప్పటి నుండో బలంగా ఉన్న పార్టీలు భారీ విజయాలు సాధించాయి. బిజెపి ఈ రాష్ట్రాలపై తన పట్టును పెంచుకోవటానికి దరిదాపులలో కూడా లేదు. ఈ రాష్ట్రాలలో విజయం సాధించిన పార్టీలు, సంఘటనలు హిందుత్వ విధానాలకు, దేశ రాజకీయ వైవిధ్యాన్ని, సమాఖ్య స్వభావాన్ని తుడిచివేయటానికి సంఘ్ పరివార్ చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా సైద్ధాంతికంగా ఐక్యంగా పోరాడాయి. పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, కేరళలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నాయకత్వంలోని వామపక్ష ప్రజాతంత్ర సంఘటనలు అధికారంలో ఉన్నందువలన ఎన్నికలలో సహజంగా ఎదురయే వ్యతిరేకతను అధిగమించి విజయం సాధించటం ప్రాధాన్యత కలిగినది. తమిళనాడులో ఎఐఎడిఎంకె నుండి డిఎంకె అధికారాన్ని స్వాధీనం చేసుకున్నది. కేరళలో ఒకసారి పాలించిన ప్రభుత్వం తర్వాతి ఎన్నికలలో తిరిగి అధికారంలోకి రావటం 44 సంవత్సరాలలో ఇదే తొలిసారి. ఆ విధంగా ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం రికార్డు విజయం సాధించింది.

ఈ మూడు రాష్ట్రాలలో ఇచ్చిన తీర్పులు ప్రత్యేకించి కాషాయకూటమికి అవమానకరంగా ఉన్నాయి. ఎన్నికలు జరిగిన రాష్ట్రాలలో పెద్దదైన, బిజెపి ఎక్కువ ఆశలు పెట్టుకున్న పశ్చిమబెంగాల్‌లో హిందుత్వశక్తుల ఆశలను తృణమూల్ కాంగ్రెస్ వమ్ముచేసింది. ఎన్నికలు జరిగిన 290 స్థానాలలో తృణమూల్ కాంగ్రెస్ 213 స్థానాలను సాధించి, బిజెపిని 77 స్థానాలకే పరిమితం చేసింది. వామపక్షాలు, కాంగ్రెస్ కలిసి పోటిచేసిన మూడవ కూటమి ఒక్కస్థానంలో కూడా విజయం సాధించలేదు. తృణమూల్ కాంగ్రెస్‌ను ఓడిస్తామని, 294 స్థానాలలో 175 స్థానాలను సాధిస్తామని ఎన్నికల ప్రచారంలో మోడి, అమిత్‌షాలతో పాటు బిజెపి నాయకత్వం ప్రచారం చేసింది.

> **“ కొన్నిచోట్ల మమతాబెనర్జి ప్రభుత్వం అమలుజరుపుతున్న సంక్షేమ పథకాలను, కేంద్ర ప్రభుత్వం అస్తవ్యస్తంగా వ్యవహరిస్తున్న తీరుతో ప్రజారోగ్యరంగంలో ఏర్పడిన సంక్షోభాన్ని ప్రజలు పోల్చిచూసుకున్నారని ఆ నాయకుడు చెప్పాడు. “పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలను మమతాబెనర్జి-మోడికి మధ్య పోటీగా మార్చటం మేం చేసిన పెద్ద పొరపాటు. దేశం ఒక సంక్షోభం తర్వాత మరో సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి రాష్ట్రం కారణం కాదని, కేంద్రమే కారణమని ప్రజలు భావిస్తున్నారని” కూడా ఆయన చెప్పాడు. ”**



**అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురు దెబ్బలు తిన్న బిజెపి: కీలకమైన రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రతిపక్షాల ముఖ్యమంత్రులు పినరయి విజయన్ (కేరళ) ఎంకె స్టాలిన్ (తమిళనాడు) మమతా బెనర్జీ (పశ్చిమ బెంగాల్)**

తనకు లొంగివుండే ఎఐఎడిఎంకెతో కలిసి తమిళనాడులో అధికారంలోకి వస్తామని బిజెపి ఆశించింది. కాని డిఎంకె నాయకత్వంలోని కాంగ్రెస్, వామపక్షాలు, విదుతలై చిరుతైకల్ కచ్చి, మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కజగం, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్, మనితనేయ మక్కల్ కచ్చిలు విజయం సాధించటంతో బిజెపి ఆశలు ఆవిరైపోయాయి. 234 స్థానాలున్న శాసనసభలో ఎఐఎడిఎంకె కూటమి సాధించిన 70 స్థానాలలో బిజెపికి 4 స్థానాలు దక్కటమే ఆ పార్టీకి ఓదార్పు. సీట్లలో కొద్దిపాటి పెరుగుదల ఉన్నప్పటికీ బిజెపి పొందిన ఓట్లలో చెప్పుకోదగిన పెరుగుదల లేదు.

బిజెపి కేరళలో గత ఐదు సంవత్సరాలలో బాగా అభివృద్ధి అయిందని, ఎన్నికలలో కనీసం 30 నుండి 35 స్థానాలు సాధిస్తుందని ప్రచారం చేశారు. కాని 2016లో సాధించిన ఒక స్థానాన్ని కూడా కోల్పోయారు. కాంగ్రెస్ నాయకత్వంలోని 10 పార్టీల కూటమి నుండి ఎదురైన బలమైన ప్రతిఘటనను మతోన్మాద ప్రచారాన్ని తీవ్రం చేయటం ద్వారా తట్టుకొని, బిజెపి అస్సాంలో అధికారాన్ని నిలబెట్టుకొంది. తనకుగా చెప్పుకోవటానికి ఎటువంటి పునాది లేని పుదుచ్చేరిలో ఎఐఎన్ఆర్‌సి భుజాలపై కూర్చొని విజయం సాధించింది. దీర్ఘకాలిక ప్రభావం చూపే కీలకమైన రాష్ట్రాలను పోగొట్టుకొన్న బిజెపికి ఈ విజయాలు కంటితుడుపు ఓదార్పు మాత్రమే.

**ఓటమికి కారణాలు**

బిజెపి విస్తరణ వాదానికి ఎదురుదెబ్బ తగలటం, ప్రాంతీయ పార్టీలు పునరుజ్జీవం పొందటంపై బిజెపి, సంఘ్ పరివార్‌కు చెందినవారితో సహా రాజకీయరంగంలో నిపుణులైనవారు, ఎన్నికలలో వచ్చిన ఫలితాలను పరిశీలించిన వారు విశ్లేషణలు చేశారు. జార్ఖండ్ సరిహద్దుల్లోని అసన్‌సోల్‌లో ఉన్న పశ్చిమబెంగాల్‌లోని ఒక ఆర్ఎస్ఎస్ నాయకుడు ఈ విలేకరితో మాట్లాడుతూ మమతాబెనర్జి ప్రభుత్వంపై వ్యతిరేకత పరిమితస్థాయిలో ఉండగా, కేంద్ర ప్రభుత్వం, దానికి నాయకత్వం వహిస్తున్న మోడి, అమిత్‌షాలపై ఎన్నికల సందర్భంగా స్పష్టంగా వ్యతిరేకత కనిపించిందని చెప్పాడు.“ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో దిగజారిపోతున్న ఆర్థిక, సామాజిక పరిస్థితుల కారణంగా మోడి ప్రభుత్వంపై వ్యతిరేకత క్రమంగా పెరుగుతున్నది. సంఘ్ పరివార్ కార్యకర్తలు ఒక నియోజకవర్గం తర్వాత మరో నియోజకవర్గంలో పర్యటిస్తున్నపుడు కోవిడ్ 19 వ్యాప్తిని నిరోధించటం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలపై, ముఖ్యంగా మొదటిసారి లాక్‌డౌన్ విధించిన విధానంపై ప్రజలు తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేశారు. 2020 మార్చిలో మొదటిసారి హఠాత్తుగా లాక్‌డౌన్ విధించినపుడు కష్టాలను ఎదుర్కొన్న ప్రజలలో ఎక్కువ మంది పశ్చిమబెంగాల్‌కు చెందినవారు ఉన్నారు”.

కొన్నిచోట్ల మమతాబెనర్జి ప్రభుత్వం అమలుజరుపుతున్న సంక్షేమ పథకాలను, కేంద్ర ప్రభుత్వం అస్తవ్యస్తంగా వ్యవహరిస్తున్న తీరుతో ప్రజారోగ్యరంగంలో ఏర్పడిన సంక్షోభాన్ని ప్రజలు పోల్చిచూసుకున్నారని ఆ నాయకుడు చెప్పాడు. “ పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలను మమతాబెనర్జి–మోడికి మధ్య పోటీగా మార్చటం మేం చేసిన పెద్ద పొరపాటు. దేశం ఒక సంక్షోభం తర్వాత మరో సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి రాష్ట్రం కారణం కాదని, కేంద్రమే కారణమని ప్రజలు భావిస్తున్నారని” కూడా ఆయన చెప్పాడు.

వ్యవసాయ సమస్యలతో పాటు ఇతర సమస్యలపై క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సామాజిక కార్యకర్త సుమని సింగ్ తూర్పున పశ్చిమబెంగాల్, బీహార్, జార్ఖండ్, దక్షిణాదిన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో పర్యటించాడు. ఇతర అంశాలతో పాటు సంయుక్త కిసాన్ మోర్చా నిర్వహించిన “బిజెపికి ఓటు వేయవద్దు” అన్న ప్రచారం పశ్చిమబెంగాల్‌లోనే కాక తమిళనాడులలో కూడా బిజెపి ఓటమిపై ప్రభావం చూపిందని పేర్కొన్నాడు. “ఆ ప్రచారం రైతాంగ ఉద్యమం ముందుకుతెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దుచేయటం అన్న అంశానికే పరిమితం కాకుండా తీవ్రంగా పెరుగుతున్న పెట్రోలు, డీజిల్ ధరలు, బ్యాంకుల నుండి బీమా సంస్థలు, బొగ్గు గనుల నుండి రైల్వేల వరకు ప్రభుత్వరంగ సంస్థలను భారీస్థాయిలో ప్రైవేటీకరించే కార్యక్రమానికి వ్యతిరేకంగా జరిగింది. దీనంతటినీ మమతాబెనర్జి తనదైన పద్ధతిలో, తన ఎన్నికల యంత్రాంగం ద్వారా వినియోగించుకుంది”. తమ పౌరసత్వానికి, ఇతర అంశాలకు పౌరసత్వ

> “ బలమైన రాజకీయ నిర్మాణం, శక్తివంతమైన నాయకత్వం ఉన్నచోట బిజెపి విజయం సాధించటం కష్టమేనని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. ఇపుడు జరిగిన ఎన్నికలలో పినరయి విజయన్, మమతాబెనర్జి, స్టాలిన్ ఈ అంశాన్ని రుజువుచేశారు. ఇంతకు ముందు జరిగిన మహారాష్ట్ర, ఢిల్లీ, బీహార్ ఎన్నికలలో శివసేన నాయకుడు, ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే, ఎన్‌సిపి నాయకుడు శరద్‌పవార్, ఎఎపి నాయకుడు, ముఖ్యమంత్రి అరవింద కేజ్రీవాల్ , ఆర్‌జెడికి చెందిన తేజస్వియాదవ్‌లు దీనిని రుజువు చేశారు. ”

చట్టం, ఇతర చట్టాల ద్వారా ఎదురౌతున్న ప్రమాదంపై బెంగాల్, తమిళనాడులోని ముస్లింలలో గణనీయమైన సంఖ్యలో తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని కూడా ఆయన పేర్కొన్నాడు.

“ద్రవ్య, ఇతర వనరులను తన ఆధిపత్యంలోకి తెచ్చుకోవటం, వాటిని విచక్షణ లేకుండా తన ఇష్టం వచ్చినట్లుగా వినియోగించటం” బిజెపికి ప్రతికూలంగా పరిణమించాయని సైన్యంలో కల్నల్‌గా పనిచేసి, ఉద్యోగ విరమణానంతరం పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో వ్యవసాయం చేసుకొంటూ, రాజకీయాలను సునిశితంగా పరిశీలించే సుబాశ్ సింగ్ దేశ్‌వాల్ పేర్కొన్నాడు. “బిజెపి తన వద్దవున్న అపారమైన డబ్బును అన్ని రాష్ట్రాలలోనూ కుమ్మరించింది. వారి దగ్గర చాలా డబ్బు ఉంది. దానితో వారు పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌ను నాశనం చేయటం కోసం ఆ పార్టికి చెందిన 40 మంది సీనియర్ నాయకులను కొన్నారు. బిజెపి ఎన్నికల వ్యూహకర్త అమితాషా, ఆ పార్టి కేంద్ర కార్యాలయం, దాదాపు మొత్తం కేంద్ర మంత్రివర్గం కోల్‌కతాకు మకాం మార్చింది. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలో మోడి అనేక ఎన్నికల సభలలో ప్రసంగించాడు. పశ్చిమబెంగాల్‌లోనే 20 సభలలో ప్రసంగించాడు. అమిత్‌షా పశ్చిమబెంగాల్‌లో 45 సభలలో ప్రసంగించాడు. స్మృతి ఇరాని నుండి పియూష్ గోయల్, యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వరకు ఒకరాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి తిరిగారు. ఈ రాష్ట్రాలలో అనేక ఐదు నక్షత్రాల హొటళ్ళు వీరితో నిండిపోయాయి. ప్రజలు వీటన్నింటినీ గమనించారు. వీరి డబ్బు, జబ్బపవర్‌కు ముగింపు పలకాలని భావించారు. ఇవి కూడా ఈ ఎన్నికలలో బిజెపి పరాజయానికి కారణమైనాయని నేను భావిస్తున్నాను” అని ఆయన చెప్పాడు. స్వతంత్ర విశ్లేషకులు, వివిధ పార్టీలకు చెందినవారితో పాటు బిజెపి, సంఘ్ పరివార్‌కు చెందిన కొందరు కూడా దేశ్‌వాల్ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నారు.

ఎన్నికలలో బిజెపి అతిగా వ్యవహరించటం, ముఖ్యంగా పశ్చిమబెంగాల్‌లో వ్యవహరించిన తీరు, ఆ పార్టి భారత ఎలక్షన్ కమిషన్ లాంటి రాజ్యాంగబద్ధ సంస్థను కూడా ప్రతిపక్ష పార్టీలకు వ్యతిరేకంగా ఉపయోగిస్తూ, అన్యాయంగా, అనవూన పోటీకి పాల్పడుతున్నదనే అభిప్రాయం ఓటర్లలో పెద్దభాగానికి కలిగించింది. “ బిజెపికి సహకరించటం కోసం ఎప్పటికీ పూర్తికానట్లుగా పశ్చిమబెంగాల్‌లో ఎనిమిది దశల ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ విధంగా అతిగా వ్యవహరించటం, అన్యాయం చేయటానికి పూనుకుంటున్నారని ప్రజలు భావించటం బిజెపి నమ్ముకున్న, దానికి ప్రయోజనం కలిగిస్తున్న మతపరమైన విభజన విధానాలు విఫలం కావటానికి దారితీసింది. ఈ విధమైన కుతంత్రాలు మరింత వెనుకబాటు విధానాలను అనుసరించటానికి దారితీస్తాయని, నిర్దిష్టమైన అభివృద్ధి ప్రణాళికలకు ఇవి దారితీయవని ప్రజలు అర్ధం చేసుకున్నారు” అని దేశ్‌వాల్ చెప్పాడు.

### ఆర్థికాభివృద్ధికి పశ్చిమబెంగాల్, కేరళ ప్రభుత్వాలు చేసిన కృషి

దేశ్‌వాల్, ఇతరులు చెప్పినట్లుగా ఆర్థికవ్యవస్థ, ప్రజల జీవనావసరాలకు సంబంధించిన అంశాలు ఎన్నికలలో ఓటువేయటాన్ని ప్రభావితం చేసే అంశాలుగా మరొకసారి ముందుకొచ్చాయి. విభిన్నమైన సైద్ధాంతిక భావజాలానికి చెందిన ఇద్దరు ముఖ్యమంత్రులు పినరయి విజయన్, మమతాబెనర్జిలు తమ పద్ధతులలో అమలు జరిపిన సంక్షేమ పథకాలు ప్రభుత్వాలపై ప్రజలలో ఏర్పడిన వ్యతిరేకతను అధిగమించటానికి తోడ్పడ్డాయి. కన్యాశ్రీ, రూపశ్రీ లాంటి పథకాలను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయగా కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అమలుచేసిన ఆహారకిట్లు, పెన్షన్ పథకాలు మంచి ప్రభావం కలిగించాయి. 2020 నవంబరులో జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఆర్థికాంశాల ప్రాధాన్యతను వెల్లడించాయి. ఆ ఎన్నికలలో విద్య, వైద్యం, సాగుభూములకు నీటిపారుదల సదుపాయం తదితర ప్రధానమైన అంశాలపై తేజస్వి యాదవ్ శక్తివంతంగా ప్రచారం చేశాడు. ఆ యువ నాయకుడు ఎన్నికల ప్రచారంలో అత్యంత ప్రభావం చూపటంతో పాటు బిజెపి, జనతాదళ్ (యునైటెడ్) కూటమిపై దాదాపుగా గెలిచినంత పనిచేశాడు.

మే 2వ తేదీన వెలువడిన ఎన్నికల ఫలితాలు బిజెపి శ్రేణులలో అపరచాణుక్యునిగా వర్ణించబడుతున్న అమిత్‌షాకు వ్యక్తిగతంగా అతి పెద్దదెబ్బ. 2014 ఎన్నికలలో మోడి భారీ ఆధిక్యంతో అధికారంలోకి వచ్చిన తర్వాత తాను పశ్చిమబెంగాల్, తమిళనాడులను సంఘ్ పరివార్‌కు అప్పగిస్తానని, దానితో దేశాన్ని అన్ని విధాలుగానూ హిందుత్వమార్గంలోకి మార్చటం పూర్తవుతుందని అమిత్‌షా సంఘ్ నాయకత్వానికి వాగ్దానం చేశాడు. పశ్చిమబెంగాల్, తమిళనాడు ప్రజలతో ప్రత్యక్షంగా వారి భాషలోనే సంభాషించటం కోసం అమిత్‌షా బెంగాలి, తమిళం నేర్చుకుంటున్నాడనే కట్టుకథలు బిజెపి, సంఘ్ పరివార్ శ్రేణుల్లో విస్తృతంగా ప్రచారంలో కొచ్చాయి. వాస్తవంగా అమిత్‌షా ఈ రెండు భాషలను నేర్చుకోవటం గాని, ఈ రెండు రాష్ట్రాల విభిన్న సంస్కృతులను అర్ధం చేసుకోవటం గాని జరగలేదు. గుజరాత్ నుండి వచ్చిన ఒక నాయకుడు ఈ రాష్ట్రాలలో రాజకీయ ఆధిపత్యం సాధించటం సాధ్యమయే పరిస్థితి కూడాలేదు.

జాతీయస్థాయిలో చూసినపుడు బలమైన రాజకీయ నిర్మాణం, శక్తివంతమైన నాయకత్వం ఉన్నచోట బిజెపి విజయం సాధించటం కష్టమేనని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. ఇపుడు జరిగిన ఎన్నికలలో పినరయి విజయన్, మమతాబెనర్జి, స్టాలిన్ ఈ అంశాన్ని రుజువుచేశారు. ఇంతకుముందు జరిగిన మహారాష్ట్ర, ఢిల్లీ, బీహార్ ఎన్నికలలో శివసేన నాయకుడు, ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే, ఎన్‌సిపి నాయకుడు శరద్‌పవార్, ఎఎపి నాయకుడు,

ముఖ్యమంత్రి అరవింద కేజ్రీవాల్ , ఆర్‌జెడికి చెందిన తేజస్వియాదవ్‌లు దీనిని రుజువు చేశారు. కోవిడ్ 19 మహమ్మారి విషయంలో కేంద్రం వైఫల్యం, రైతుల ఆందోళనను పరిష్కరించటంలో అసమర్ధత, ఇతర విషయాలలో వ్యవహరిస్తున్న తీరు ప్రాంతీయ స్థాయి నాయకులు బలపడటానికి దోహదం చేస్తాయి.

2021 ఎన్నికలలో ప్రాంతీయపార్టీల నాయకులు తమ స్థానాలను పటిష్ఠం చేసుకోగా, జాతీయస్థాయిలో బిజెపికి ప్రధాన ప్రతిపక్షం, దేశంలోని పురాతన పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ క్షీణించిపోవటం కొనసాగింది. బిజెపి, ఎల్‌డిఎఫ్‌కు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న అస్సాం, కేరళలలో అది ఆశించిన ఫలితాలను సాధించలేకపోయింది. పార్టీకి పునాదిగా ఉన్న కుటుంబంలోని యువ నాయకులు, ఇంతకు ముందు అధ్యక్షునిగా ఉన్న రాహుల్ గాంధి, ఆయన సోదరి, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకవాద్రా ఈ రెండు రాష్ట్రాలలో విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ అంతగా ప్రభావం చూపలేకపోయారు. పశ్చిమబెంగాల్‌లో సిపిఐ(ఎం) నాయకత్వంలోని వామపక్ష సంఘటనతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకొని ఒక్కస్థానంలో కూడా విజయం సాధించలేదు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అసెంబ్లీలో వామపక్షాలకు, కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం లేకుండాపోవటం ఇదే తొలిసారి.

ఐదు సంవత్సరాల క్రితం 2016లో ఐదు రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికల ఫలితాలపై ఫ్రంట్‌లైన్ 2016, జూన్ 10వ తేదీ సంచికలో ఈ విధంగా విశ్లేషణ చేసింది. " 2014 తర్వాత దేశంలో జరుగుతున్న ఎన్నికలలో మూడు స్పష్టమైన అంశాలు ముందుకువస్తున్నాయి. మొదటిది. భారతీయ జనతాపార్టీ, దాని నాయకత్వంలోని ఎన్‌డిఎ దేశ రాజకీయరంగంలో కేంద్రస్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. రెండవది. బిజెపి, ఎన్‌డిఎ ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ స్థిరంగా పెరుగుతున్న ప్రాంతీయపార్టీలు. మూడవది. దేశంలో అతిపురాతన పార్టీ అయిన కాంగ్రెస్ బిజెపి, ప్రాంతీయ పార్టీలను ఎదుర్కోలేక క్రమంగా బలహీనపడిపోవటం. "

ఐదు సంవత్సరాల తర్వాత, 2016-2021 మధ్య కాలాన్ని పరిశీలిస్తే పై అంచనా వాస్తవమైనదేనని స్పష్టమౌతున్నది. కాంగ్రెస్ పార్టీ క్షీణించిపోతున్నదని చెప్పినది అప్పటికన్నా ఇపుడు మరింత వాస్తవమైనదిగా ఉన్నది. మమతాబెనర్జి, స్టాలిన్, విజయన్‌లు బలమైన విజయాలు సాధించటం జాతీయస్థాయిలో బిజెపిని ఎదుర్కోవటానికి ప్రాంతీయపార్టీలు సంఘటనగా ఏర్పడతాయన్న ఊహాగానాలకు తెరలేపింది. ఈ విధమైన సూచనలు చేస్తున్నవారు యుపి మాజి ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ నాయకుడు అఖిలేశ్‌యాదవ్, ఆర్‌జెడి నాయకుడు తేజస్వియాదవ్, శరద్ పవార్, ఉద్ధవ్ థాకరే తదితరులను కూడా ఈ కూటమిలోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ నాయకులకు వ్యక్తిగత అభిజాత్య భావనలు ఉన్నక్రమంలో ఈ ఆలోచన ఏ మేరకు కార్యరూపం దాల్చుతుందనేది వేచిచూడాల్సిందే.

**" మమతాబెనర్జి, స్టాలిన్, విజయన్‌లు బలమైనవిజయాలు సాధించటం జాతీయస్థాయిలో బిజెపిని ఎదుర్కోవటానికి ప్రాంతీయపార్టీలు సంఘటనగా ఏర్పడతాయన్న ఊహాగానాలకు తెరలేపింది. ఈ విధమైన సూచనలు చేస్తున్నవారు యుపి మాజి ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ నాయకుడు అఖిలేశ్‌యాదవ్, ఆర్‌జెడి నాయకుడు తేజస్వియాదవ్, శరద్ పవార్, ఉద్ధవ్ థాకరే తదితరులను కూడా ఈ కూటమిలోకి తీసుకురావాలని కోరుతున్నారు. "**



మోడీ, షా ద్వయం కుతంత్రాలకు కేరళ, తమిళనాడు, బెంగాల్ ప్రజలు గట్టి జవాబు చెప్పారు

మే 2వ తేదీ ఎన్నికల ఫలితాలతో వచ్చిన అవకాశాలు, ప్రత్యామ్నాయాలు, సవాళ్ళ, లోపాలపై చర్చలు కొనసాగుతుంతడటంతో పాటు ఈ ఫలితాల తక్షణ ఫలితం ఎన్నికల ద్వారా హిందురాష్ట్రను ఏర్పాటు చేయాలన్న బిజెపి, సంఘ్ పరివార్ అనుబంధ సంస్థల పథకానికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. మూడు రాష్ట్రాలలో బిజెపి తిన్న ఎదురుదెబ్బలపై జరుగుతున్న చర్చలు బిజెపికి, ప్రత్యేకంగా అమిత్‌షాకు తీవ్రమైన కలవరం కలిగిస్తున్నాయి. ప్రాంతీయపార్టీల నాయకులు ఐక్యంగా ముందుకు రావటానికి ఉన్న అవకాశాలు, అవరోధాలను కూడా ఈ చర్చలు ముందుకుతెస్తాయి.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

**వ్యవసాయ రంగం**

# భారత ప్రభుత్వాలు- వ్యవసాయ చట్టాలు



రచయిత మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

**ఎ. కోటిరెడ్డి**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్లచట్టాలను రద్దుచేయాలని, విద్యుత్ సవరణ బిల్లు 2020ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ సరిహద్దులలో రైతాంగం చేస్తున్న పోరాటం ఆరుమాసాలు దాటి ఏడవమాసంలోకి అడుగుపెట్టింది. మరోవైపున బిజెపి ప్రభుత్వం, వారి పార్టీ వ్యవసాయరంగాన్ని వేగంగా అభివృద్ధి చేయటం కోసం మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చామని, వాటి అమలుతో రైతాంగ ఆదాయాలు రెట్టింపు అవుతాయని ప్రచారం చేస్తున్నాయి. ఈ చట్టాల అమలు వలన దేశం కూడా త్వరగా అభివృద్ధి చెందుతుందని చెబుతున్నాయి. ప్రభుత్వం చెబుతున్నది పూర్తిగా అసత్యమని, ఈ చట్టాల అమలుతో వ్యవసాయరంగం కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్ళిపోతుందని, దేశప్రజలకు ఆహారభద్రత లేకుండాపోతుందని రైతుసంఘాలు, వ్యవసాయరంగంలోని మేధావులు వాదనలు చేస్తున్నారు. ప్రస్తుతం పేద, మధ్య తరగతి రైతులు ఎక్కువ మంది వ్యవసాయంలో వస్తున్న ఆదాయాలతో బతకలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎక్కువమంది రైతులు అప్పులపాలు కావటం, ఆత్మహత్యలు చేసుకోవటం, వ్యవసాయాన్ని వదిలి ఇతర పనులు చూసుకోవటం జరుగుతున్నది. వ్యవసాయ కార్మికులు, కౌలురైతుల సంఖ్య, వారి దారిద్ర్యం పెరుగుతున్నవి. వ్యవసాయ రుణాలను రద్దుచేయాలని, పంటలకు మద్దతు ధరలు నిర్ణయించి, ప్రభుత్వమే సేకరించాలని, తమకెదురౌతున్న ఇతర సమస్యలను పరిష్కరించాలని రైతాంగం డిమాండ్ చేస్తున్నది. స్వాతంత్ర్యం వచ్చిన 73 సంవత్సరాల తర్వాత కూడా రైతాంగం ఇటువంటి దుస్థితిలో ఉండటానికి ఇప్పటి వరకు పాలించిన ప్రభుత్వాలు వ్యవసాయరంగంలో అనుసరించిన భూస్వామ్య అనుకూల విధానాలే కారణం.

**జాతీయోద్యమ లక్ష్యాలు నెరవేర్చని కాంగ్రెస్**

దేశంలోని రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జాతీయోద్యమంతో పాటే రైతాంగ పోరాటాలు కూడా ప్రారంభమయాయి. జమిందారి, జాగీర్దారీ విధానం రద్దు కావాలని, వెట్టిచాకిరిని నిర్మూలించాలని, దున్నేవానికే భూమి ఇవ్వాలని, కౌలురైతులకు రక్షణ కల్పించాలని తదితర డిమాండ్లతో సాగిన రైతాంగ ఉద్యమాలలో లక్షల సంఖ్యలో రైతాంగం పాల్గొన్నారు. సమరశీలంగా సాగిన ఈ పోరాటాలు దేశంలోని అనేక ప్రాంతాలలో విజయం సాధించాయి. కేరళలోని పున్నప్రా వాయలార్, మహారాష్ట్రలోని వర్లి, బెంగాల్‌లో తెభాగా పోరాటం, అస్సాంలోని సుర్మావ్యాలి, త్రిపురలో మహారాజుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు విజయం సాధించాయి. ఆంధ్రలో చల్లపల్లి, వెంకటగిరి తదితర జమిందార్లు, జాగీర్దార్లకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యానికి ముందే పోరాటాలు ప్రారంభమైనాయి. వీటన్నింటికీ మకుటాయమానంగా నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం జరిగింది. 1946లో నైజాం నవాబు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ పోరాటం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, 1948లో కాంగ్రెస్ ప్రభుత్వం నైజాం సంస్థానాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా మూడు సంవత్సరాలు, 1951 వరకు కొనసాగింది. నైజాం, కాంగ్రెస్ ప్రభుత్వాల దమనకాండలో 4,000ల మందికి పైగా కమ్యూనిస్టులు, రైతాంగ యోధులు ప్రాణాలు కోల్పోయారు. పోరాట ఫలితంగా వెట్టిచాకిరి రద్దయింది. 10 లక్షల ఎకరాల భూస్వాముల భూములను పేదరైతులు, వ్యవసాయ కార్మికులు పంచుకున్నారు. ఈ పోరాటాలు జరిగిన ప్రాంతాలతో పాటు దేశవ్యాపితంగా కూడా భూముల కోసం ప్రజల పోరాటాలు తీవ్రమైనాయి.

ఈ పరిస్థితులలో 1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికలలో రైతాంగ పోరాటాలు జరిగిన ప్రాంతాలన్నింటిలోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఓడిపోయి, పోరాటాలకు నాయకత్వం వహించిన కమ్యూనిస్టులు, అభ్యుదయవాదులు గెలిచారు. ఒకవైపున భూముల కోసం దేశవ్యాపితంగా జరుగుతున్న పోరాటాలు, మరోవైపున పోరాటాలు జరుగుతున్న ప్రాంతాలలో ఎన్నికలలో ఓడిపోవటంతో ప్రజల ఆకాంక్షలలో కొన్నింటినైనా నెరవేర్చాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏర్పడింది. కాని బూర్జువా, భూస్వామ్యవర్గాలకు నాయకత్వం వహిస్తున్న ఆ ప్రభుత్వం రైతాంగం డిమాండ్ చేస్తున్న విధంగా భూసంస్కరణలను అమలుజరపటానికి, రైతాంగ సమస్యలను పరిష్కరించటానికి సిద్ధం కాలేదు. కాని తన వర్గ ప్రయోజనాలను నెరవేర్చుకోవటం కోసం కొన్ని పరిమితమైన సంస్కరణలు తీసుకురావటం ద్వారా ప్రజలను మభ్యపెట్టటానికి పూనుకుంది. తామే భూసంస్కరణలను అమలుచేసి, ప్రజలకు భూములిస్తామని, కౌలురైతుల హక్కులను కాపాడతామని, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు, ఇళ్ళస్థలాలు, సంక్షేమ కార్యక్రమాలు తదితరాలను అమలుచేస్తామని వాగ్దానాలు చేసింది. తప్పనిసరి పరిస్థితులలో కేంద్రం, ఆ పార్టీ పాలనలోని రాష్ట్ర ప్రభుత్వాలు అందు కోసం కొన్ని చట్టాలను తీసుకొచ్చాయి. కాని ఆ చట్టాలలో అత్యధికంగా భూ పరిమితిని విధించి, భూస్వాములు తమ ఆధీనంలో ఎక్కువ భూమిని ఉంచుకోవటానికి అవకాశం కల్పించింది. చివరకు చట్టాలలో పేర్కొన్నమేరకు కూడా భూస్వాముల భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంచలేదు. అందువలన కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్రాలలో అధికారం లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకొచ్చిన

భూసంస్కరణల చట్టాలు పేదరైతాంగం, వ్యవసాయ కార్మికులకు భూములివ్వటానికి దోహదం చేయలేదు.

రైతాంగానికి భూములివ్వటానికి మారుగా ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు ఫ్యూడల్ భూస్వాములు పెట్టుబడిదారీ భూస్వాములుగా మారటానికి, ధనికరైతాంగం ఏర్పడటానికి దారితీశాయి. గ్రామీణప్రాంతాలలోని వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలను, ఆదాయ వనరులను ఈ వర్గాలు తమ ఆధిపత్యంలోకి తెచ్చుకోవటంతో ఈ రంగాలలోని ఆదాయంలో అత్యధిక శాతం ఈ వర్గాల చేతుల్లోకి పోతున్నది. ఎక్కువ సంఖ్యలో ఉన్న వ్యవసాయ కార్మికులు, పేద, మధ్యతరగతి రైతులకు వారు జీవించటానికి కూడా సరిపోని ఆదాయం మాత్రమే వస్తున్నది. భూములు, ఇతర ఆదాయ వనరులపై ఆధిపత్యం సంపాదించిన ఈ వర్గాలు గ్రామాలలోని ఆర్థిక ఆధిపత్యాన్ని సాధించటమేకాక, రాజకీయ, సామాజిక రంగాలను కూడా తమ ఆధిపత్యంలోకి తెచ్చుకున్నాయి.

**కొనసాగుతున్న భూకేంద్రీకరణ**

ప్రభుత్వాలు తీసుకొచ్చిన భూసంస్కరణల చట్టాలలో నీటిపారుదల ఉన్నభూమి 10 నుండి 27 ఎకరాలు, వర్షాధార భూమి 27 నుండి 54 ఎకరాలు పరిమితిగా నిర్ణయిస్తే పంపకానికి 6.7 కోట్ల ఎకరాల మిగులు భూమి లభిస్తుందని ప్రభుత్వం నియమించిన కమిటి 1967లో చెప్పింది. కాని ఆచరణలో అందులో 10 వ వంతు భూమి కూడా పంపకం జరగలేదు. బెంగాల్, కేరళ, త్రిపురలలో వామపక్ష ప్రభుత్వాలు అధికారంలో ఉన్న కాలంలో భూసంస్కరణల చట్టాలను నిజాయితీగా అమలుచేశాయి. ఫలితంగా ఆ రాష్ట్రాలలో ఎక్కువమంది పేదల చేతికి భూమి వచ్చింది. భూస్వాముల పట్టుతగ్గింది. కాని దేశంలోని మిగతా ప్రాంతాలలో భూస్వాముల ప్రాబల్యం కొనసాగుతూనే ఉన్నది. 2011-12 వ్యవసాయ సెన్సస్ ప్రకారం దేశంలోని 4.9 శాతం మంది భూస్వాములు, పెట్టుబడిదారీ రైతుల చేతుల్లో 32 శాతం భూమి ఉన్నది. 95.1 శాతం మందిచేతిలో 68.2 శాతం భూమి మాత్రమే ఉన్నది. సగటున చిన్నరైతుచేతిలో ఉన్న భూమి కన్నా భూస్వామి చేతిలో 45 రెట్లు ఎక్కువ భూమి ఉన్నది. మరోవైపున 10.14 కోట్లమంది వ్యవసాయ కార్మికులు, గ్రామీణ కుటుంబాలలో 56.4 శాతం చేతిలో వ్యవసాయ భూమి లేదనిపేర్కొంది. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు భూమిని

> **“ వ్యవసాయ భూమిని కలిగి ఉండటంలో ఉన్న ఈ అసమానతలు ఆదాయాలలోనూ ప్రతిబింబిస్తున్నాయి. 1950-51లో వ్యవసాయరంగంపై ఆధారపడినవారు 70 శాతం ఉండగా జిడిపిలో వ్య.రంగం వాటా 45 శాతంగా ఉన్నది. ఏడు దశాబ్దాల తర్వాత జిడిపిలో వ్య.రంగం వాటా 15 శాతానికి పడిపోగా, ఆ రంగంపై ఆధారపడినవారు 42 శాతంకు మాత్రమే తగ్గారు. ”**



బిజెపి ప్రభుత్వం తెచ్చిన నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతుల ర్యాలీ

కలిగివుండటంలో ఎటువంటి అసమానతలు ఉన్నాయో ఈ అంకెలు స్పష్టం చేస్తున్నాయి.

**వ్యవసాయం, ఇతర రంగాల మధ్య ఆదాయంలో అసమానతలు**

వ్యవసాయ భూమిని కలిగి ఉండటంలో ఉన్న ఈ అసమానతలు ఆదాయాలలోనూ ప్రతిబింబిస్తున్నాయి. 1950-51లో వ్యవసాయ రంగంపై ఆధారపడినవారు 70 శాతం ఉండగా జిడిపిలో వ్య.రంగం వాటా 45 శాతంగా ఉన్నది. ఏడు దశాబ్దాల తర్వాత జిడిపిలో వ్య.రంగం వాటా 15 శాతానికి పడిపోగా, ఆ రంగంపై ఆధారపడినవారు 42 శాతంకు మాత్రమే తగ్గారు. వ్యవసాయ రంగంలోకి వస్తున్న ఆదాయం మూడింట ఒకవంతుకు తగ్గిపోగా, ఆధారపడిన వారి సంఖ్య 25 శాతం మాత్రమే తగ్గింది. అందువలన ఇతర రంగాలలో ఉన్నవారితో పోలిస్తే వ్యవసాయరంగంపై ఆధారపడినవారి ఆదాయాలు తక్కువగా ఉంటున్నాయి. ఈ అసమానత నుండి బయటపడకుండా భారతదేశం అభివృద్ధి చెందటం సాధ్యం కాదు.

ఈ ఆదాయ అసమానతలను సరిదిద్దటానికి వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరలను పెంచాలి. దానితో పాటు వ్యవసాయరంగంపై ఆధారపడిన ప్రజల శాతాన్ని తగ్గించాలి. వ్యవసాయ ఆదాయాలను పెంచటం కోసం వ్యవసాయ ఖర్చులను తగ్గించటం, వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలను నిర్ణయించి, మార్కెట్‌లో తక్కువ ధరలు ఉన్నపుడు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. వ్యవసాయ పంటల ఉత్పాదకతను పెంచటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. అపుడు రైతుల ఆదాయాలు, తద్వారా వ్యవసాయరంగంపై ఆధారపడిన వారి ఆదాయాలు పెరుగుతాయి. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తానని 2014 ఎన్నికలకు ముందు వాగ్దానం చేసిన బిజెపి తాను అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడు సంవత్సరాల కాలంలో దానిని నెరవేర్చ టానికి ఎటువంటి ప్రయత్నం చేయలేదు. పైగా తాను చేసిన వాగ్దానానికి భిన్నంగా స్వామినాధన్ కమిషన్ సిఫార్సు చేసిన విధంగా సి2+50 శాతం ప్రాతిపదికగా వ్యవసాయోత్పత్తులకు ధరలు నిర్ణయించటం సాధ్యం కాదని సుప్రీం కోర్టులో

> **" ఈ విధంగా వాణిజ్య పంటలకు ప్రోత్సాహం, వ్యవసాయరంగంలోకి కార్పొరేట్, బహుళజాతి సంస్థలు స్వేచ్ఛగా ప్రవేశించటానికి అవకాశం కల్పించటంతో వ్యవసాయోపకరణాల సరఫరా, ఉత్పత్తులకు ధరలను నిర్ణయించటం, మార్కెట్‌పై ఆధిపత్యం వారి చేతుల్లోకిపోతుంది. వారు తమ లాభాలను పెంచుకోవటం కోసం రైతాంగ ఆదాయాలను మరింతగా తగ్గించటానికి పూనుకుంటారు. "**

అఫిడవిట్ దాఖలు చేసింది. వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరల నిర్ణయం, ప్రభుత్వ సేకరణ విధానాన్ని నీరుగార్చటం ద్వారా పరిస్థితిని మరింత దిగజార్చింది. ఇపుడు తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్లలోకి బడా కార్పొరేట్లు, బహుళజాతి సంస్థల ఆధిపత్యానికి మార్గం సుగమం చేస్తాయి.

**ఆహారభద్రతకూ ప్రమాదం**

ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలు ఆహారభద్రతకు కూడా ప్రమాదం కలిగిస్తాయి. ఇపుడు మనదేశంలోని ప్రజలకు అవసరమైన ఆహారధాన్యాలను మనం ఉత్పత్తి చేసుకుంటున్నాం. కాని తమకు అవసరమైనన్ని ఆహారధాన్యాలను కొని, వినియోగించుకోగలిగే ఆదాయాలు ప్రజలందరికీ వస్తే అపుడు మనం ఉత్పత్తి చేస్తున్న ఆహారధాన్యాలు మనదేశంలోని ప్రజల వినియోగానికి సరిపోవు. ఇటువంటి పరిస్థితులలో ఆహారధాన్యాల ఉత్పత్తిని తగ్గించే విధానాలను అనుసరించటం అంటే ఆహారభద్రతకు తీవ్ర ప్రమాదం కలిగించటమే అవుతుంది.

అయినప్పటికీ ఆహారధాన్యాల ఉత్పత్తిని తగ్గించి, వాణిజ్యపంటలను ప్రోత్సహించే విధానాలనే ప్రభుత్వం అమలుచేస్తున్నది. దీనిలో ప్రధానమైనది ఎగుమతులకు ఉపయోగపడే పండ్లు, పత్తి తదితరాల ఉత్పత్తులను ప్రోత్సహించటం. వీటి ఉత్పత్తులకు అదనపు ప్రోత్సాహకాలను ఇస్తూ, ఆహారధాన్యాలకు మద్దతు ధరలు, సేకరణ విధానాల నుండి ప్రభుత్వం క్రమంగా తప్పుకుంటున్నది. దేశంలోనూ, విదేశాలలోని బడా కార్పొరేట్లు చాలాకాలం నుండి ఇదే డిమాండ్ చేస్తున్నాయి. వీటినే ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలలో పొందుపరిచింది. వాణిజ్యపంటలకు మద్దతును పెంచటం ద్వారా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని ఇప్పటికే అమలు చేస్తున్నాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2021-22 సంవత్సరంలో గోధుమలకు 2.6 మాత్రమే మద్దతు ధరలు పెంచి, ఆవాలకు 5.08 శాతం, పప్పులకు, 4.9 శాతం, బార్లీకి 4.92 శాతం మద్దతు ధరలు పెంచింది. మరోవైపున హర్యానాలోని బిజెపి ప్రభుత్వం పండ్లు, కూరగాయలను పండించేవారికి మార్కెట్‌లో ఎదురయే సమస్యలను పరిష్కరించటం, వారికి ప్రయోజనం కలిగించటం కోసం భవంతర్ భర్‌పాయ్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పంటలు ఆశించిన మేరకు పండకపోయినా, మార్కెట్‌లో తక్కువ ధరలు వచ్చినా, ఆ నష్టాన్ని భర్తీచేయటానికి, వారికి తగిన ఆదాయం వచ్చే చర్యలను ప్రభుత్వం తీసుకొంటుంది. ఇతర రాష్ట్రాలలో ఉన్న ప్రభుత్వాలు కూడా వాణిజ్య పంటలను ప్రోత్సహించటం కోసం వివిధరకాల పథకాలను అమలుచేస్తున్నాయి.

ఈ విధంగా వాణిజ్య పంటలకు ప్రోత్సాహం, వ్యవసాయరంగంలోకి కార్పొరేట్, బహుళజాతి సంస్థలు స్వేచ్ఛగా ప్రవేశించటానికి అవకాశం కల్పించటంతో వ్యవసాయోపకరణాల సరఫరా, ఉత్పత్తులకు ధరలను నిర్ణయించటం, మార్కెట్‌పై ఆధిపత్యం వారి చేతుల్లోకిపోతుంది. వారు తమ లాభాలను పెంచుకోవటం కోసం రైతాంగ ఆదాయాలను మరింతగా తగ్గించటానికి పూనుకుంటారు. వ్యవసాయోపకరణాల ధరలు పెరగటం, ఉత్పత్తుల ధరలు తగ్గటంతో రైతాంగానికి వ్యవసాయం గిట్టుబాటు కాకుండాపోతుంది. ఇది మొత్తం గ్రామీణ ప్రజలందరిపైనా ప్రభావం చూయిస్తుంది. రైతాంగంతో పాటు వ్యవసాయ కార్మికులు, వ్యవసాయంపై ఆధారపడినవారి ఆదాయాలు తగ్గటంతో గ్రామీణప్రాంతాల అభివృద్ధి మరింతగా దిగజారుతుంది.

వీటితో పాటు ఉపాధిహామి పథకాన్ని కూడా దెబ్బతీయటానికి ప్రయత్నిస్తున్నది. వ్యవసాయ రంగంలో పనులు తగ్గిపోవటంతో పనులు లేని తరుణంలో వ్యవసాయ కార్మికులు, సామాన్య రైతాంగానికి పనులు కల్పించటంలో ఉపాధిహామి పథకం ప్రధానపాత్ర నిర్వహిస్తున్నది. ఈ పథకానికి నిధులు కోత పెట్టటం, పనిదినాలు తగ్గించటంతో పాటు మెటీరియల్ కాంపోనెంట్ భాగాన్ని పెంచుతున్నారు. ఫలితంగా కోవిడ్ కారణంగా వ్యవసాయ కార్మికులు, గ్రామీణ శ్రామికులు అత్యధికంగా పనులు కోల్పోతున్న తరుణంలో, పట్టణాలకు వలసలు వెళ్ళిన కార్మికులు లాక్‌డౌన్‌లు, ఆంక్షల కారణంగా గ్రామాలకు తిరిగివస్తూ పనులు ఎక్కువగా కావాలని కోరుతున్నపుడు ఉన్న కనీస ఉపాధిని కూడా హరించి వేయటానికి ఈ చర్యలు దోహదం చేస్తాయి. ఇది గ్రామీణ ప్రాంతంలోని పేదల పరిస్థితులు మరింత దిగజారటానికి, వ్యవసాయంలో దొరికే కొద్దిపాటి పనులకై పెద్దసంఖ్యలో కార్మికులు పోటీ పడటానికి, పేదప్రజలు తిండి లేకుండా, కనీసావసరాలు తీరకుండా జీవించటానికి ఈ విధానాలు దారితీస్తాయి. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న పేదప్రజల వ్యతిరేక వైఖరికి అద్దంపట్టే చర్య ఇది.

ఈ విధానాలు వ్యవసాయరంగంలోని పరిస్థితి మరింత దిగజారటానికి దోహదం చేస్తాయి. ఈ రంగంపై ఆధారపడిన వారి సంఖ్యను మరింతగా పెంచుతాయి. వ్యవసాయ రంగంపై ఆధారపడినవారి సంఖ్యను తగ్గించాలంటే వ్యవసాయేతర రంగాలలో ఉపాధి పెరగాలి. దేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలి. వివిధరంగాలు, వృత్తులలో ఉపాధి పెరగాలి. కాని దేశంలో పారిశ్రామికాభివృద్ధి నత్తనడకన సాగుతున్నది. ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల వలన చిన్న, మధ్య తరహా పరిశ్రమలలో ఎక్కువభాగం దివాళా తీసి, వాటిలో పనిచేస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోవటం, చేతివృత్తులు, చిన్న వ్యాపారాలు దివాళా తీయటం, పెద్ద పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు పెరగక పోవటంతో వీటిలో ఉపాధి కోల్పోయినవారిలో ఎక్కువ మంది వ్యవసాయరంగంలోకి రావటంతో ఈ రంగంపై వత్తిడి మరింతగా పెరుగుతున్నది. వ్యవసాయరంగంలోని వారు కొందరు నిర్మాణం, ఇతర రంగాలలోకి వెళుతున్నప్పటికీ ఇప్పటికీ ఈ రంగంపై వత్తిడి ఎక్కువగానే ఉంటున్నది.

ప్రస్తుతం కోవిడ్ రెండవ విడత విస్తృతంగా వ్యాపిస్తున్న పరిస్థితులలో ఈ సమస్య మరింత తీవ్రమౌతున్నది. కేసులు, మరణాలు పెరగటంతో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణం, ఇతర ఉత్పత్తి కార్యకలాపాలపై ఆంక్షలు విధిస్తున్నాయి. దీనితో గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్‌తో ఇబ్బందులు పడ్డ ప్రజలు ముందుగానే గ్రామాలకు చేరుకోవటానికి బయలుదేరటంతో పనుల కోసం వ్యవసాయ

రంగంపైనే ప్రధానంగా ఆధారపడతారు. పనుల కోసం డిమాండ్ మరింత పెరగటంతో వ్యవసాయ కార్మికుల వేతనాలు తగ్గిపోతాయి. తమ పొలాలలోని పనులు పూర్తయిన తర్వాత దగ్గరలోని పట్టణాలకు వెళ్ళి పనులు చేసుకొనే రైతులకు ఆ అవకాశం లేకుండాపోయింది. వ్యవసాయరంగంలో ఉన్న 70 శాతం మందికి పైగా ప్రజల ఆదాయాలను ఈ పరిణామాలు దెబ్బతీస్తాయి.

ఈ పరిణామాలు వ్యవసాయరంగానిన్నే కాకుండా పారిశ్రామిక రంగాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. ప్రభుత్వం వేగంగా అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాల వలన ప్రజల ఆదాయాలు తగ్గిన ఫలితంగా వారి కొనుగోలు శక్తి కూడా తగ్గిపోతున్నది. అందు వలన పారిశ్రామిక సరుకులకు డిమాండ్ లేకపోవటంతో అనేక పరిశ్రమలు ఉత్పత్తిని తగ్గించటం, కార్మికులను తొలగించటం చేస్తున్నాయి. ఇపుడు ఏర్పడిన పరిణామాలతో వారి ఆదాయాలు మరింత తగ్గటంతో ఈ సమస్య మరింత తీవ్రమౌతుంది. ప్రజల ఆదాయాలు, డిమాండ్‌ను పెంచటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవటానికి విముఖంగా ఉన్న పరిస్థితులలో సంక్షోభం మరింత తీవ్రమౌతుంది.

**వ్యవసాయరంగంలోని మౌలిక సమస్యలను పరిష్కరించాలి**

వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలైన భూమి, సాగునీటి కల్పన, మద్దతుధరలు, వేతనాలు, కౌలు, అధికోత్పత్తిని ఇచ్చే విత్తనాలు, వ్యవసాయాభిద్ధికి అవసరమైన పరిశోధనలు తదితరాలలో ప్రభుత్వజోక్యాన్ని పెంచటం ద్వారానే వ్యవసాయరంగంలోని మౌలిక సమస్యలను పరిష్కరించటం సాధ్యమౌ తుంది. వీటిని అమలుచేయటంలో ప్రభుత్వం ప్రధానపాత్ర నిర్వహించాలి. వ్యవసాయరంగంలో ప్రైవేటు పెట్టుబడులను పెంచటం లక్ష్యమని, అందుకోసం వ్యవసాయ చట్టాలు దోహదం చేస్తాయని ప్రభుత్వం చెబుతున్నది. కాని ప్రభుత్వ పెట్టుబడులు పెరగకుండా ప్రైవేటు పెట్టుబడులు పెరగటం సాధ్యం కాదని గత అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి.

అందువలన ప్రస్తుతం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలు ప్రభుత్వం చెబుతున్న దానికి పూర్తి విరుద్ధమైన ఫలితాలను ఇస్తాయి. రైతాంగాన్ని, ప్రజలను మభ్యపెట్టటం కోసం ప్రభుత్వం, కార్పొరేట్‌లు చట్టాలను గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రజల ఆదాయాలను పెంచటం, వ్యవసాయరంగంలో రైతులు, వ్యవసాయ కార్మికులకు అనుకూలమైన సంస్కరణలు

> **❝ వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలైన భూమి, సాగునీటి కల్పన, మద్దతుధరలు, వేతనాలు, కౌలు, అధికోత్పత్తిని ఇచ్చే విత్తనాలు, వ్యవసాయాభిద్ధికి అవసరమైన పరిశోధనలు తదితరాలలో ప్రభుత్వజోక్యాన్ని పెంచటం ద్వారానే వ్యవసాయరంగంలోని మౌలిక సమస్యలను పరిష్కరించటం సాధ్యమౌతుంది. వీటిని అమలుచేయటంలో ప్రభుత్వం ప్రధానపాత్ర నిర్వహించాలి. ❞**

తీసుకురావటం ద్వారా ఆ రంగంపై ఆధారపడిన వారి ఆదాయాలను పెంచే చర్యలు తీసుకోవటం, నిరుద్యోగులకు ఉపాధి కల్పించటం లేదా నిరుద్యోగభృతి ఇవ్వటం, మహమ్మారి ముట్టడించిన కష్టకాలంలో వివిధ వర్గాల ప్రజల ఆదాయాలు తగ్గకుండా చూడటంతో పాటు పెంచటానికి చర్యలు తీసుకోవటం, ప్రజల కొనుగోలు శక్తిని పెంచటం ద్వారా పారిశ్రామికాభివృద్ధిని సాధించటంపైనే మనదేశం అభివృద్ధి సాధించటం ఆధారపడివుంది. మూడు వ్యవసాయ చట్టాలను రద్దుచేయటం, వ్యవసాయరంగంలో పైన పేర్కొన్న మార్పులను తీసుకురావటం ద్వారా మాత్రమే వ్యవసాయరంగం, దేశాభివృద్ధి సాధ్యమౌతుంది. అందుకోసం రైతాంగం చేస్తున్న పోరాటం విజయం సాధించేవరకు వారికి దేశప్రజల మద్దతు కొనసాగాలి. ❊

# కమ్యూనిస్టు మానిఫెస్టో నుండి మొదటి ఇంటర్నేషనల్ వరకు

(19వ పేజీ తరువాయి)

పార్టీ ఏర్పాటు ఆవశ్యకతను ఇంటర్నేషనల్ ఆమోదించింది. పార్టీ అవసరాన్ని వ్యతిరేకించిన బకునిన్ ఇంటర్నేషనల్ నుండి బహిష్కరించ బడ్డాడు. అనేక విరుద్ధ సిద్ధాంతాల కలగూర గంపగా ఇంటర్నేషనల్‌ను నడపటం వల్ల ఉపయోగం ఉండదని మార్క్స్, ఎంగెల్స్‌లు భావించారు. ఈ తప్పుడు సిద్ధాంతాలను అధిగమించే ప్రయత్నంలో భాగంగా ఇంటర్నేషనల్ కేంద్రాన్ని లండన్ నుండి అమెరికాకు మార్చారు. కానీ ఈ ప్రయత్నాలేవీ ఫలించని ప్రతికూల పరిస్థితులలో మొదటి ఇంటర్నేషనల్‌ను 1876లో రద్దు చేశారు.

పారిస్ కమ్యూన్ పతనంతో కార్మికవర్గ పోరాటాలు, సోషలిస్టు సిద్ధాంతాలూ మొత్తంగా పతనమైనట్లేనని పెట్టుబడిదారీ వర్గం సంతోషించింది. ఎందుకంటే ఆ తర్వాత 20 సంవత్సరాల పాటు సంక్షోభాలూ, యుద్ధాలూ లేకుండా పెట్టుబడిదారీ విధానం పురోగ మిచింది. కొత్త ప్రాంతాలకూ వ్యాపించింది. కార్మికులతో పెద్ద ఘర్షణలు రాకుండా కొన్ని సదుపాయాలు, సంస్కరణలు అమలుచేశారు. మార్క్స్ విప్లవ సిద్ధాంతాలు తప్పని, పార్లమెంటరీ పద్ధతుల ద్వారానే కార్మికుల జీవితాలు మెరుగుపర్చవచ్చనే భావాలూ బలంగా ముందుకు వచ్చాయి. ఇక మార్క్సిజం పని అయిపోయిందనే చాలా మంది భావించారు.


ఈ విధంగా కార్మికవర్గానికి ఒక నిర్మాణ సంస్థ లేకపోవటం అనే ఆటంకాన్ని 'మొదటి ఇంటర్నేషనల్ సంస్థ' స్థాపనతో తొలగిపోయి, ఆ తర్వాత కార్మికోద్యమం బలంగా సంఘటితమై పారిస్‌లో తన రాజ్యాన్నే నెలకొల్పినప్పటికీ, కార్మికవర్గానికి ఒక రాజకీయ పార్టీ లేకపోవటం అనే మరో పెద్ద ఆటంకం ముందుకొచ్చింది. ఈ ఆటంకం వల్లే పారిస్ కమ్యూన్ పరాజయం పాలైంది. ఈ అపజయంతో కార్మికవర్గం, సాధారణ ప్రజలు నిరుత్సాహానికి లోనై ఉండవచ్చు. కానీ మార్క్స్ మాత్రం ఎంతో ముందుచూపుతో ఇంటర్నేషనల్ రద్దు తరువాత 'తదుపరి ఇంటర్నేషనల్ కార్మికవర్గ పార్టీలతో ఉంటుంది' అని ఆనాడే ప్రకటించాడు. పారిస్ కమ్యూన్ పతనమైన 47 సం॥రాల తర్వాత రష్యాలో సోషలిస్టు విప్లవం లెనిన్ నాయకత్వంలో జయప్రద మైంది. అపుడు లెనిన్ ఇలా అన్నాడు. "మేమిపుడు నిల్చున్నది పారిస్ కమ్యూన్ భుజాలపైనే" అని.

ఈ దశలో వచ్చిన ఆటంకాలను ఏ విధంగా అధిగమించి, కమ్యూనిస్టు ఉద్యమం తరువాతి దశలో ఎలా పురోగమించిందో వచ్చే సంచికలో చర్చిద్దాం. ❊

అంతర్జాతీయం

# పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ పూర్వాపరాలు

**బివి రాఘవులు**


రచయిత సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

**(ఇటీవల గాజాలోని పాలస్తీనా నివాసాలపై ఇజ్రాయిల్ సందర్భంగా ఇజ్రాయిల్-పాలస్తీనా సమస్యపై నిర్వహించబడిన వెబినార్‌లో సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు చేసిన ప్రసంగ పాఠాన్ని 'మార్క్సిస్టు' పాఠకుల కోసం అందిస్తున్నాం..... సంపాదకుడు)**

పాలస్తీనా దేశం చిన్నదైనా అంతర్జాతీయంగా ప్రాధాన్యత కలిగివుంది. మొదట ఇజ్రాయిల్‌ను గుర్తించటానికి అరబ్‌లీగ్ అంగీకరించలేదు. తర్వాత అరబ్‌లీగ్‌లో వచ్చిన చీలిక సమస్య పరిష్కారాన్ని క్లిష్టం చేసింది. కొన్ని దేశాలు ఇజ్రాయిల్‌ను గుర్తించటానికే అంగీకరించకపోగా, మరికొన్ని దేశాలు ఆ దేశంతో దౌత్య సంబంధాలను పెట్టుకొని, రాయబార కార్యాలయాలను కూడా ఏర్పాటు చేశాయి. ఇది కూడా పాలస్తీనా సమస్యను పరిష్కరించటాన్ని క్లిష్టం చేసింది.

మొదటి ప్రపంచయుద్ధంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఆధిపత్యం వహించారు. రెండవ ప్రపంచయుద్ధంలో బ్రిటన్ బలహీనపడి అమెరికా ఆధిపత్యస్థానానికి వచ్చింది. అంతకుముందు వలసపాలన సాగించిన ఇటలి, ఫ్రాన్స్, డచ్చి తదితర దేశాలు యుద్ధాలతో ఆర్థికంగా చితికిపోయి, వలసలను వదులుకోవాల్సివచ్చింది. సామ్రాజ్యవాద దేశాలు ఆర్థికంగా బలహీనపడిన కారణంగా, కొన్ని దేశాలలో కొనసాగుతున్న జాతీయోద్యమాల వలన ఆయుధాలతో బలవంతంగా పాలించటం సాధ్యం కాదని భావించి, స్వాతంత్ర్యం ఇచ్చినట్లే ఇచ్చి, ఆర్థికంగా తమ ప్రయోజనాలను నెరవేర్చుకోవచ్చుననే భావంతో వలసలను వదులుకున్నారు. సామ్రాజ్యవాదులు వలసలను వదిలిపోవల్సి వచ్చినపుడు ఆయా దేశాలను విభజించి వెళ్ళారు. మనదేశం నుండి వెళ్లక తప్పని పరిస్థితులలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మనదేశాన్ని రెండుగా విభజించి వెళ్ళారు. ఆ విధంగానే పాలస్తీనా నుండి వెళ్ళకతప్పని పరిస్థితులలో ఆ దేశాన్ని ఇజ్రాయిల్, పాలస్తీనాగా విభజించారు. యూరప్‌లో యూదులపై తీవ్రంగా హత్యాకాండ జరుగుతున్నపుడు పాలస్తీనాలోకి పెద్దసంఖ్యలో వలసవచ్చారు. వచ్చారనేకన్నా బ్రిటనే వారిని రప్పించింది. బ్రిటన్ రప్పించినపుడు వారు బ్రిటన్‌లోకి కాకుండా పాలస్తీనాలోకి ఎందుకు వలస వచ్చారు? యూరప్‌లో జర్మనీలో మాత్రమే కాకుండా అనేకదేశాలలో యూదు వ్యతిరేకత ఉంది. వలస వెళ్ళినవారు కొందరు అమెరికా కూడా వెళ్ళారు. వడ్డీ వ్యాపారం ప్రధానంగా ఉన్న యూదులపై వ్యతిరేకత (యాంటి సెమిటిజం) అన్ని తరగతుల ప్రజానీకంలోనూ, బ్రిటన్ ప్రజలలోనూ ఉంది. అందువలన బ్రిటన్ వారిని తమదేశంలోకి కాకుండా పాలస్తీనాలోకి పంపింది. బ్రిటిష్ వారు పాలస్తీనాను వదిలిపోవాలనుకున్నపుడు పాలస్తీనాను ఇజ్రాయిల్, పాలస్తీనాలుగా విడదీసి, రావణ కాష్టం రగిలించిపోయారు. రెండుముక్కలు చేసి, రెండుదేశాలుగా చేయాలన్నది అమలులోకి రాలేదు. ఇజ్రాయిల్ వలస పాలనలో పాలస్తీనా ప్రజలు ఉన్నారు.

వలస విధానానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ప్రపంచంలోని అనేకదేశాల ప్రజలు స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేశారు. కొందరు ప్రపంచయుద్ధం అయిన వెంటనే స్వాతంత్ర్యం సాధించుకున్నారు. పోరాటాలు జరుగుతున్న క్రమంలో, కొందరు తర్వాత స్వాతంత్ర్యం సాధించుకున్నారు. మొత్తంమీద అన్ని దేశాల ప్రజలు స్వాతంత్ర్యం సంపాదించుకున్నారు. మనదేశంలో కూడా గోవా లాంటి చోట ఆ తర్వాత కాలంలో స్వాతంత్ర్యం సాధించుకున్నారు. కాని పాలస్తీనా ప్రజలు మాత్రం ఈనాటికీ ఇజ్రాయిల్ అణచివేత నుండి విముక్తి కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. ఇప్పటికీ వలసపాలనకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఒకేదేశం పాలస్తీనా. చిన్నదేశం, తక్కువ జనాభా ఉన్నా, స్వాతంత్ర్యం కోసం, స్వేచ్ఛకోసం జరుగుతున్న పోరాటంగా ప్రాధాన్యత కలిగినది. పెద్ద రాజకీయ సమస్యగా ఉంది. ప్రపంచ రాజకీయ శక్తులు అటూ, ఇటూ మోహరించి ఉన్నాయి. పాలస్తీనా మధ్యధరా సముద్రం అంచున చిన్నముక్కగా ఉంటుంది. లెబనాన్, ఈజిప్టు, సిరియా, జోర్డాన్‌లు సరిహద్దు దేశాలుగా ఉన్నాయి. ఇజ్రాయిల్ జనాభా 93 లక్షలు. దానిలో 75 శాతం యూదులు. అరబ్బులు 21 శాతం ఉన్నారు. ఇంతచిన్న దేశం ఇంతపెద్దపాత్ర ఎలా నిర్వహిస్తుందనే సందేహం వస్తుంది. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత సామ్రాజ్యవాద దేశాలు ఇజ్రాయిల్‌ను బలపర్చటానికి పూనుకున్నాయి. అందుకు రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి కమ్యూనిజాన్ని అరికట్టటానికి సాధనంగా ఉపయోగించుకోవటం. రెండవది ఆయిల్ నిక్షేపాలు అధికంగా ఉన్న అరబ్ దేశాలను సమస్యలలో ముంచే యటం. అలాచేస్తే వారు సామ్రాజ్యవాదుల జోలికిరారని, వీటిని సాధించటానికి ఇజ్రాయిల్ శిఖండిలాగా ఉపయోగపడుతుందని భావించా రు. ఆ విధంగా సామ్రాజ్యవాదుల తోడ్పాటుతో ఇజ్రాయిల్ త్వరలోనే అభివృద్ధిని సాధించింది. కష్టాలు పడివున్నవారు, వలస వచ్చినవారు, కష్టాలను అధిగమించాలని భావించేవారు కాబట్టి త్వరలోనే అభివృద్ధిని సాధించారు. వారి తలసరి ఆదాయం 44 వేల డాలర్లు. సంపన్నదేశాల కన్నాకూడా మించిపోయిన ఆదాయం అది. పాలస్తీనా ప్రజల తలసరి ఆదాయం మూడువేల డాలర్లు మాత్రమే. సామ్రాజ్యవాదులు ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అందించారు. అణ్వాయుధ పరిజ్ఞానాన్ని కూడా అందించారు. అమెరికా, రష్యా, చైనా, భారతదేశం తర్వాత ఇజ్రాయిల్ వద్దనే అణ్వస్త్రాలు ఉన్నాయి. అరబ్బుదేశాలను అణచివుంచటానికి తాము ప్రత్యక్షంగా జోక్యం చేసుకోకుండా, ఇజ్రాయిల్‌ను ఒక సాధనంగా వినియోగించుకోవటానికి ఇవన్నీ చేశారు. హమాస్ రాకెట్‌లను ప్రయోగిస్తుంటే వాటిని ఆకాశంలోనే ఎదుర్కొని నిర్వీర్యం చేసే వ్యవస్థ ఇజ్రాయిల్ వద్ద ఉందని పత్రికలలో వస్తున్నాయి. సామ్రాజ్యవాదుల వ్యూహంలో కీలకభూమిక

నిర్వహిస్తున్నది కాబట్టే దానిని ఆ విధంగా తయారుచేశారు.

> " పాలస్తీనా జనాభా 50 లక్షల మంది మాత్రమే. ఇజ్రాయిల్ పెడుతున్న బాధలు పడలేక ఇళ్ళు, పొలాలు వదిలేసి కాందిశీకులుగా వెళ్ళినవారు 10 నుండి 50 లక్షల వరకు ఉంటారని అంచనా వేస్తున్నారు. ప్రశాంత పరిస్థితులు ఏర్పడితే వారిలో ఎక్కువమంది తిరిగిరావచ్చు. వారు తిరిగివస్తే వారి పునరావాసం అంశాన్ని ఎలా పరిష్కరించాలనే సమస్య ఉంది. అంతచిన్న దేశం నిర్వహిస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకం. "

పాలస్తీనా జనాభా 50 లక్షల మంది మాత్రమే. ఇజ్రాయిల్ పెడుతున్న బాధలు పడలేక ఇళ్ళు, పొలాలు వదిలేసి కాందిశీకులుగా వెళ్ళినవారు 10 నుండి 50 లక్షల వరకు ఉంటారని అంచనా వేస్తున్నారు. ప్రశాంత పరిస్థితులు ఏర్పడితే వారిలో ఎక్కువమంది తిరిగిరావచ్చు. వారు తిరిగివస్తే వారి పునరావాసం అంశాన్ని ఎలా పరిష్కరించాలనే సమస్య ఉంది. అంతచిన్న దేశం నిర్వహిస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకంగా ఉంది. వారు వలసవాదానికి వ్యతిరేకంగా, ఆత్మగౌరవం కోసం పోరాడుతున్నారు. ఇజ్రాయిల్, పాలస్తీనాల మధ్య ఆదాయం, జనాభా, ఆయుధాలలో అసమానతలు ఉన్నాయి. అందువలన ఇది అసమానుల మధ్య పోరాటంగా ఉంది. అసమానత ఉన్నా న్యాయం పాలస్తీనా వైపు ఉంది. గతంలో సోవియట్ యూనియన్, సోషలిస్టు దేశాలు, అలీనోద్యమం ఉన్నపుడు పాలస్తీనా ప్రజల పోరాటానికి మద్దతు తెలిపారు. సోవియట్ కూలిపోవటం, సోషలిజం దెబ్బతినటం, అలీనోద్యమం బలహీనపడటం, సరళీకరణ విధానాలతో పరిస్థితి మారింది. భారతదేశం కూడా పాలస్తీనా ప్రజల పోరాటాన్ని బలపరచేది. కాని బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత విధానాలను పూర్తిగా మార్చుకున్నారు. ఇజ్రాయిల్‌కు పూర్తి మద్దతు ఇస్తున్నారు. ఇపుడు ఇజ్రాయిల్ చేసిన దాడిని ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో భారతదేశం ఖండించలేదు. మొదట చేసిన ప్రకటనలో ఘర్షణను ఆపాలని, పాలస్తీనా ప్రజల న్యాయమైన సమస్యలు కొన్ని ఉన్నప్పటికీ చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పారు. భద్రతామండలిలో న్యాయమైన సమస్యలు ఉన్నప్పటికీ అన్నది కూడా తీసివేసి అమెరికా చెబుతున్నట్లే హింసను ఆపివేసి, చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పారు. ఇపుడు ఇజ్రాయిల్ తాను గతంలో అంగీకరించిన వాటిని కూడా తోసిపుచ్చి దాడులను తీవ్రంచేసి పాలస్తీనా భూభాగం మొత్తాన్ని ఆక్రమించుకొని ఒకేదేశంగా చేయాలని చూస్తున్నది.

### ప్రస్తుత ఘర్షణ ఎందుకు ప్రారంభమైంది?

ప్రస్తుత ఘర్షణ ప్రారంభం కావటానికి కారణం ఏమిటి? కొనసాగుతున్న ఈ సమస్యలను ఒక నిర్దిష్టమైన ఘటన ముందుకుతెచ్చింది. యూదులు, క్రైస్తవులు, ముస్లింలకు జెరుసలెం పవిత్రమైనది. 1948 లో జెరుసలెం ఉభయులకు చెందకుండా ఉంచాలని చెప్పారు. తర్వాత ఈస్ట్ జెరుసలెం పాలస్తీనాకు, వెస్ట్ జెరుసలెం ఇజ్రాయిల్‌కు ఉండాలని నిర్ణయించారు. కాని ఇజ్రాయిల్ అంగీకరించలేదు. 1967లో ఈస్ట్ జెరుసలెంను కూడా ఆక్రమించింది. ప్రపంచంలోని అన్ని దేశాల నుండి, మనదేశం నుండి కూడా అక్కడకు వెళ్ళివస్తుంటారు. ముస్లింలకు కూడా మక్కా-మదీనా తర్వాత జెరుసలెం పవిత్ర ప్రదేశం. అందువలన ఉభయదేశాలుగా విభజించేటపుడు జెరుసలెంను అంతర్జాతీయ నగరంగా ప్రకటించారు. జరుసలెంను తమ భూభాగంగా చేసుకోవాలని ఇజ్రాయిల్ నిరంతరం ప్రయత్నం చేస్తున్నది.

మే 6వ తేదీన ఇజ్రాయిల్ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆధారం చేసుకొని షేక్ జర్రాప్రాంతంలోని ఆరు కుటుంబాలను అక్కడి నుండి తొలగించటానికి ప్రయత్నించారు. దానిని ప్రజలు ప్రతిఘటించారు. ప్రజలు గుమిగూడటంతో టియర్‌గ్యాస్, లాఠీఛార్జి, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించటంతో వారు ఆల్ అక్సా మసీదులోకి చేరారు. పోలీసులు మసీదులోపలికి చొరబడి చేసిన దాడిలో 1000 మంది వరకు గాయపడ్డారు. ఒకరు మరణించారు. ఇది మొత్తం పాలస్తీనా ప్రజలను కోపోద్రిక్తులను చేసింది. ప్రపంచంలో కూడా నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ హింసను ఆపకపోతే ప్రతిఘటిస్తామని అపుడు హమాస్ ప్రకటన చేసి, రాకెట్లు ప్రయోగించింది. దీనిని సాకుగా తీసుకున్న ఇజ్రాయిల్ తాను పెట్టుకున్న టార్గెట్లపై విమానాలతో తీవ్రంగా దాడులు చేసింది. ఇజ్రాయిల్ దాడిలో 1000 మంది వరకు మరణించారు. వారు ఎక్కడెక్కడి నుండి పాలస్తీనా వారిని ఖాళీ చేయించాలనుకున్నారో అక్కడల్లా దాడులు చేశారు. పిల్లలు, మహిళలపై కూడా తీవ్రంగా చేసిన దాడులలో అనేక మంది మరణించారు. పాలస్తీనా వారిని వేధించి, ఇబ్బందులకు గురిచేసి, ఇజ్రాయిల్ దాడులు చేస్తుంటే హమాస్ దాడి చేసిందని, ఇజ్రాయిల్ ప్రతిఘటించిందని సామ్రాజ్యవాద మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నది. మనలో కూడా చాలామంది ఈ ప్రచారంతో ప్రభావితమౌతున్నారు. ఈ దాడులకు వ్యతిరేకంగా సంఘీభావం సమీకరించటానికి ప్రపంచవ్యాప్తితంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మనపార్టీ ఇజ్రాయిల్ దాడిని ఖండించింది. మద్దతు సమీకరణ కృషిలో భాగస్వామిగా ఉన్నది. పాలస్తీనాకు మద్దతు సమీకరించటమంటే సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటాన్ని ముందుకు తీసుకు పోవటమే అవుతుంది.

ఈ పోరాటాన్ని యూదులు, ముస్లింలకు మధ్య పోరాటంగా చిత్రీకరించటానికి ప్రయత్నం చేస్తున్నారు. యూదులు, పాలస్తీనా వారు వేరువేరు మతాలకు చెందినవారన్నది వాస్తవమే. కాని సంఘర్షణకు మతం ప్రాతిపదిక కాదు. ఈ అన్ని అంశాలను పరిశీలిస్తే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, స్వాతంత్ర్యం కోసం పాలస్తీనా ప్రజలు పోరాటం చేస్తున్నారు. సామ్రాజ్యవాదులు అరబ్బుదేశాలలోని అయిల్ నిల్వలను కాజేయటానికి అడ్డుకట్టవేయటానికి ఈ పోరాటం దోహదం చేస్తుంది. ఇజ్రాయిల్ దాడులను బలపర్చటం సామ్రాజ్యవాదానికి ఎంత అవసరమో, పాలస్తీనా ప్రజల పోరాటానికి మద్దతు సమీకరించటం మనకు అంత అవసరం.

### సమస్యకు పరిష్కారమేమిటి

1948లో బ్రిటిష్ వారు పాలస్తీనాను రెండు దేశాలుగా విభజిస్తామని చెప్పాడు. 58 శాతం భూభాగం ఇజ్రాయిల్‌కు, 42 శాతం పాలస్తీనాకు ఇస్తామని ప్రకటించారు. ఇజ్రాయిల్ అంగీకరించింది. పాలస్తీనా అంగీకరించలేదు. అప్పటికి మొత్తం దేశం పాలస్తీనా వారి చేతుల్లోనే ఉంది కాబట్టి ఎక్కడి నుండో వచ్చేవారికి 58 శాతం భూమిని ఇస్తామంటే వారు అంగీకరించలేదు. తర్వాత అరబ్ దేశాలు ఐక్యంగా ఉండి పాలస్తీనాకు మద్దతుగా ఉన్నాయి. ఆ తర్వాత జరిగిన యుద్ధంలో ఇజ్రాయిల్ వెనక్కుతగ్గింది. గాజా ఈజిప్టు చేతుల్లోకి, వెస్ట్‌బ్యాంక్ జోర్డాన్ ఆధిపత్యంలోకి వచ్చాయి. కాని 1967లో జరిగిన ఆరు రోజుల యుద్ధంలో అమెరికా మద్దతుతో ముందుగానే సన్నద్ధమై, ఆయుధాలు సమకూర్చుకొని, ఈజిప్టును ఓడించి గాజాను, జోర్డాన్‌ను ఓడించి వెస్ట్ బ్యాంక్‌ను ఇజ్రాయిల్ స్వాధీనం చేసుకొన్నది.

> **“ 1947లో 42 శాతం అని చెప్పిన పాలస్తీనా భూభాగం ఇపుడు 15 శాతంకు తగ్గిపోయింది. 1967 తర్వాత ఇజ్రాయిల్ ప్రపంచంలోని యూదులందరినీ దేశంలోకి రప్పిస్తున్నది. దేశంలోని యూదులను పాలస్తీనా భూభాగాలను ఆక్రమించుకోమని ప్రోత్సహిస్తు న్నది. జెరుసలెం నుండి పాలస్తీనీయులను తరిమివేసి, యూదు నివాసాలను ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నది. ”**

ఈస్ట్ జెరుసలెంను కూడా ఆక్రమించింది. చివరకు ఐక్యరాజసమితి కూడా వీటిని ఆక్రమిత ప్రాంతాలుగా గుర్తించాల్సి వచ్చింది. పాలస్తీనాలో ఒకవైపున ఫతా, మరోవైపున హమాస్ ఉద్యమాలుగానే మిగిలాయి తప్ప వాటికి ఎటువంటి ప్రతిపత్తి లేదు. ఆక్రమణ ప్రాంతాలు ఐన తర్వాత ఇజ్రాయిల్‌లో పాలస్తీనా ప్రజలను ఉపజాతి లేదా రెండవ తరగతి పౌరులుగా మార్చాలంటే దానిని ఆక్రమించాలని ప్లాన్ చేసుకొంది. అలా చేయకపోతే పాలస్తీనా వేరేదేశంగా ఉండాలని ఐక్యరాజ్యసమితిలో కూడా చర్చవస్తున్నది. కాబట్టి అటువంటి చర్చ రాకుండా చేయాలంటే పాలస్తీనా ప్రాంతాలను ఆక్రమించిన చోట్ల, పాలస్తీనా ప్రజలు ఉన్నచోట్ల యూదులను ప్రవేశపెట్టాలనే పథకంతో ఇజ్రాయిల్ దాడులు చేస్తున్నది. ఆ విధంగా యూదులను ప్రవేశపెట్టి, 165 పాలస్తీనా ప్రాంతాలను దీవులుగా మార్చింది. మన దళితవాడలు కంచెలు లేక పోయినా ఊరికి దూరంగా ఎలా వుంటాయో అలా వెస్ట్ బ్యాంక్ ప్రాంతంలో ఈ సెటిల్‌మెంట్ల ను తీవ్రం చేసింది. పాలస్తీనా వారు ఉన్న ప్రాంతాల చుట్టూ కంచెలు వేయటం ప్రారంభిం చింది. రేపు పాలస్తీనాకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాల్సివస్తే ఆ కంచెలు ఉన్న ప్రాంతాలకే ఇస్తారు. మిగతా దేశం అంతా ఇజ్రాయిల్ చేతుల్లో ఉంటుంది. గాజాస్ట్రిప్ చిన్నది. హమాస్ బలంగా ఉన్నది. వెస్ట్ బ్యాంక్ పెద్దది. అక్కడ ఇజ్రాయిల్ ఆక్రమణలను కొనసాగిస్తున్నది.

1947లో 42 శాతంగా ఉన్న పాలస్తీనా భూభాగం ఇపుడు 15 శాతంకు తగ్గిపోయింది. 1967 తర్వాత ఇజ్రాయిల్ ప్రపంచంలోని యూదులందరినీ దేశంలోకి రప్పిస్తున్నది. దేశంలోని యూదులను పాలస్తీనా భూభాగాలను ఆక్రమించుకోమని ప్రోత్సహిస్తు న్నది. జెరుసలెం నుండి పాలస్తీనీయులను తరిమివేసి, యూదు నివాసాలను ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నది. కాని కాందిశీకులు ఇతర దేశాలనుండి తిరిగి వస్తే వారు గతంలో సాగుచేసుకున్న భూములను వారికి ఇచ్చి సెటిల్ చేయటానికి కార్యక్రమం ఉండాలి. కంచెలను తీసివేయాలి. ఈస్ట్ జెరుసలెంను పూర్తిగా పాలస్తీనాకు ఇవ్వాలి. అమెరికా దానిని ఇజ్రాయిల్ రాజధాని గా గుర్తించి, రాయబారిని పెట్టింది. అమెరికా చేసిన తర్వాత మిగతా దేశాలు కూడా అదే చేస్తాయి. ట్రంప్ చేసిన దాని నుండి బైడెన్ వెనక్కురావ టానికి సిద్ధంగా లేడు. చైనాపై ప్రధానంగా దృష్టి పెట్టారు గనుక కాల్పుల విరమణ జరగా లని చెప్పారు మినహా అమెరికా విధానంలో మార్పు లేదు.

### క్యాంప్‌డేవిడ్, ఓస్లో ఒప్పందాలు

1967 యుద్ధం తర్వాత 1978లో అమెరికాలోని క్యాంప్‌డేవిడ్‌లో అమెరికా మధ్యవర్తిగా ఈజిప్టు, ఇజ్రాయిల్ మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చలు, ఒప్పందంలో పాలస్తీనా ప్రజలకు ప్రమేయం లేదు. ఇజ్రాయిల్ దేశాన్ని గుర్తించటం, పాలస్తీనా ప్రాంతాన్ని విడగొట్టటం ఒప్పందంలో ఉన్నాయి. పాలస్తీనా ప్రజలు దీనిని వ్యతిరేకించారు. 1993లో బిల్ క్లింటన్ అమెరికా అధ్యక్షునిగా ఉన్నపుడు ఓస్లోలో ఒప్పందం జరిగింది. పాలస్తీనాకు నేషనల్ అథారిటి ఏర్పాటును గుర్తించటం, దానిని పాలస్తీనీయులు పాలించటం వరకు అంగీకారం. దేశంగా అంగీకారం లేదు. కాందిశీకులు, జెరుసలెం, యూదుల అక్రమ సెటిల్‌మెంట్లు, కంచెలు, పాలస్తీనాను ఇజ్రాయిల్ గుర్తించటం తదితర సమస్యలు తరువాత చర్చించాలని ఓస్లో ఒప్పందంలో చేర్చారు. పాలస్తీనాకు సైన్యం ఉండటాన్ని ఇజ్రాయిల్ అంగీకరించటం లేదు. సైన్యం ఉండాలా లేదా అనేది తేల్చలేదు. ఈ ఒప్పందాన్ని అరాఫత్ అంగీకరించాడు. హమాస్ అంగీకరించలేదు. ఈ ఒప్పందాలను ఉద్దేశ పూర్వకంగా ఇజ్రాయిల్ విచ్ఛిన్నం చేసింది. ఈజిప్టు ఇజ్రాయిల్‌కు మద్దతిస్తున్నది. పాలస్తీనాకు సిరియా మద్దతిస్తుంటే ఆ దేశంపై దాడిచేసి గోలన్‌హైట్స్‌ను



ఇజ్రాయిల్ దాడితో ధ్వంసమవుతున్న పాలస్తీనా నివాస ప్రాంతం

ఆక్రమించింది. లెబనాన్ మద్దతిస్తుంటే బీరూట్‌లో తిరుగుబాటుదారులను తయారు చేస్తున్నారనే పేరుతో ఆదేశంపై దాడిచేసి, వారి భూభాగాలను ఆక్రమించింది. ఈ నేపథ్యంలో మొన్నటి దాడిజరిగింది.

ఈ పరిణామాల క్రమంలో షేక్‌జర్రా ప్రాంతంలో జరిగిన ఘటనను పరిశీలించాలి. అమెరికా చైనాను కేంద్రంగా చేసుకొని రెండవ ప్రఛ్చన్నయుద్ధాన్ని కొనసాగిస్తున్నది. సౌది అరేబియా, ఈజిప్టు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లాంటి దేశాలు పాలస్తీనా ప్రజల పోరాటాన్ని బలపరచకపోయినా టర్కి, సిరియా, ఇరాన్, ఇరాక్ లాంటి అనేక దేశాలు, అరబ్‌లీగ్ మద్దతిస్తున్నాయి. రష్యా, చైనా మద్దతిస్తున్నాయి. పాలస్తీనాకు మద్దతు కూడగట్టటం అంటే సామ్రాజ్యవాదాన్ని వెనక్కుకొట్టటమే అవుతుంది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి మద్దతు కూడగట్టటం బలాబలాలలో మార్పుతీసుకు రావటానికి దోహదం చేస్తుంది. కాబట్టి ఈ దృక్ప థంతో పాలస్తీనాకు మద్దతు సమీకరించటానికి పూనుకోవాలి. ❊

# భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు

**(2వ పేజీ తరువాయి)**

గనక, సంస్థానాధీశులకు వ్యక్తిగత సంపదను జాతీయం చేయాలి.

"భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు విభజించ బడాలని కమ్యూనిస్టు పార్టీ లేవనెత్తుతున్న డిమాండ్ ఎంతో హేతుబద్ధమైనది. దీని వలన ఆయా రాష్ట్రాలలోని అత్యధిక ప్రజల మాతృ భాషలో పరిపాలన కొనసాగటంతో వారికి సౌలభ్యం కలుగుతుంది.

"రాష్ట్రాలను విభజిస్తే దేశ ఐక్యతకు, రక్షణకు భంగం వాటిల్లుతుందనేది భాషా ప్రయుక్త రాష్ట్రాలకు వ్యతిరేకంగా చేసే మరో వాదన. ఇదికూడా పూర్తిగా అర్థరహిత మైన తప్పుడు వాదన. భాషాప్రయుక్త రాష్ట్రాలకు స్వంత సైన్యం, రక్షణ వ్యవస్థలు ఉండవు. రక్షణరంగం కేంద్రం ఆధీనంలోనే ఉంటుంది. ఇప్పుడున్న పరిపాలనా వ్యవస్థ కొనసాగించి నట్టయితే అది ప్రజల మధ్య వివాదాలు పెరగటానికి దోహద పడుతుందని, మన దేశాభివృద్ధికి, ఐక్యతకూ ఏమాత్రం దోహద పడదని గత అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. పైగా కాంగ్రెస్ నాయకులుగాని, అఖిలభారత పార్టీల కమిటీల ప్రతినిధులు గాని 1947 వరకు స్వతంత్రపోరాట కాలమంతటిలోనూ ఈ సమస్యలను గురించి చర్చించేటపుడు ఏనాడూ, ఐక్యత, రక్షణ అంశాలను లేవనెత్తలేదు.

"ఇక రాష్ట్రాలు ఆర్థికంగా నిలదొక్కుకోలేవనే అంశాన్ని ఈ డిమాండ్‌ను వ్యతిరేకించటానికి మరో అంశంగా ముందుకు తెస్తున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకోవడం అన్నది కేంద్రం, రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల విభజనపై ఆధారపడి ఉంటుంది. ఈ రోజు భారతదేశం లోని ఏ రాష్ట్రం కూడా ఆర్థికమిగులులో లేకపోవటమే కాక, కనీసం స్వయం పోషకంగా కూడా లేదు. అన్ని రాష్ట్రాలు లోటు బడ్జెట్లలోనే ఉన్నాయి.


"పైగా భారతదేశంలోని వివిధ ప్రాంతా లలో అభివృద్ధి సమానంగా లేదనే అంశంపై ఎవరమూ ఉపేక్షించలేం. ఈ అసమానమైన అభివృద్ధి వలన వెనుకబడిన ప్రాంతాలలోని ప్రజలు తమ వెనకబాటుతనం కారణంగా దేశ పరిపాలన వ్యవస్థలో భాగస్వాములు కాకుండా ఉండాలనటం సరికాదు. ఇలా వాదించడం అంటే కేవలం అభివృద్ధి చెందిన ప్రాంత ప్రజలకే దేశ రాజకీయ, ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలలో భాగస్వాములయే హక్కు ఉంటుందని వాదించటమే అవుతుంది.

"ఈ పరిస్థితులలో వెనకబడిన రాష్ట్రాలకు సహాయం అందించి వారా వెనుకబాటు తనం నుండి త్వరగా బయటపడేటట్టు చూడాల్సిన బాధ్యత కేంద్రానిదే అని భారత కమ్యూనిస్టు పార్టీ నొక్కి చెప్పదలుచుకుంది. వారు తమ వెనుకబాటు తనం నుండి బయటపడి, అభివృద్ధి చెందిన ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చెందే అవకాశం కల్పించాలి. ఆ విధంగా చేసినట్లయితేనే దేశంలో వివిధ భాషలు మాట్లాడే ప్రజలలో ఒకరి పట్ల మరొకరికి భ్రాతృభావం కలుగుతుంది; దేశ ఐక్యత బలపడు తుంది. కానీ వెనుకబాటు తనం పేరుతో కొన్ని ప్రాంతా ల ప్రజలకు ప్రజాతంత్రయుతంగా అభివృద్ధి చెందడానికి అవకాశాలను తిరస్కరించటం సరికాదు. ఇది విచ్ఛిన్నకర శక్తులు బలపడడానికి తోడ్పడుతుంది.

"భాషాప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో పాటు, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఎల్లలు నిర్ణయించడానికి ఏ పద్ధతులు అవలంభించాలనే అంశంపై మేము ఈ కింది సూచనలు చేస్తున్నాము.

"గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకోవాలి. అందులో మెజారిటీ ప్రజలు ఏ భాష మాట్లాడుతున్నారు, ఆ గ్రామం ఏ భాష మాట్లాడే రాష్ట్రానికి కలిసి ఉందనే అంశాలను ప్రాతిపదికగా తీసుకొని, ఆ గ్రామాన్ని ఆ రాష్ట్రంలో కలపాలి.

"ఈ పనిని ఎంత సునిశితంగా చేసినప్ప టికీ ఇంకా కొంతమంది మైనారిటీ భాషలు మాట్లాడేవారు మెజారిటీ భాష మాట్లాడే రాష్ట్రాలలో




**భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికగా ఆంధ్ర ప్రదేశ్‌లో పరిపాలన ఎలా ఉండాలో వివరిస్తూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య రాసిన పుస్తకం 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం'**

మిగిలిపోతారు. అందువలన మైనారిటీ భాష మాట్లాడే వారికి సాధ్యమైనంత వరకు ప్రాథమిక స్థాయి నుండి మాధ్యమిక స్థాయి వరకు వారి మాతృభాషలో విద్య నేర్చుకునే అవకాశం కల్పించాలి. కాలేజి విద్యను కూడా మాతృభాషలోనే నేర్పాలా, అయినట్లైతే ఎంత వరకు, ఆచరణాత్మకంగా ఎలా చేయాలనేది ఆయా రాష్ట్రాలకే వదిలి వేయాలి. అప్పుడే విద్వేషాలు, అనైక్యతకు కేంద్రాలు కాకుండా వివిధ భాషలు మాట్లాడే వారి మధ్య పరస్పర అనుబంధానికి కేంద్రాలుగా ఆ ప్రాంతాలు మారతాయి.

"ఇలా రాష్ట్రాల సరిహద్దులు నిర్ణయించే క్రమంలో కొన్ని గిరిజన ప్రాంతాలు కూడా ఉండవచ్చు. ఇటువంటి గిరిజన ప్రాంతాలను పొరుగున ఉన్న భాషా రాష్ట్రాలతో వారి భాష, సంస్కృతిక సంబంధాల ప్రాతిపదికగా పక్కనున్న రాష్ట్రంతో కలపాలి. ఏ రాష్ట్రంతో కలిపితే వారు ఆర్థికంగా త్వరగా అభివృద్ధి చెందుతారో ఆ రాష్ట్రంతో కలపాలి. ఆ గిరిజన ప్రాంతాన్ని పరిపాలనకు అనువైన జిల్లాగానో, తహసీలు గానో, ప్రాంతీయ విభాగంగానో, గ్రామంగానో గుర్తించి, వారి స్థానిక లేదా ప్రాంతీయ స్వపరిపాలనకు అనువుగా ఉండేటట్టు చూడాలి.

"అందువలన రాష్ట్రాల పునర్విభజనకు ఏర్పాటు చేయబడ్డ కమిషన్ ప్రజలకు ఏ రకమైన ఆందోళనను కలిగించకూడదని, 1954 సెప్టెంబర్ కల్లా రాష్ట్రాల ఏర్పాటుకు సంబంధిం చిన మధ్యంతర నివేదికను సమర్పిం చాలని, ముఖ్యంగా భాషల ప్రాతిపదికనే రాష్ట్రాల ఏర్పాటు జరగాలని సిఫారసు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ కోరుతున్నది."

**(అనువాదం: కె ఉషారాణి)**

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-06-2021 (36 pages) Postal Regd. No D/VJ/172/2021-23

# ప్రజల ఆరోగ్యం కోసం అతి తక్కువ ఖర్చు చేస్తున్న దేశాల్లో భారత్ అగ్రభాగాన ఉంది




ప్రపంచంలో ఆర్యోగ రంగం మీద అతి తక్కువగా ఖర్చు చేస్తున్న దేశాల్లో భారత దేశం ఒకటి. నరేంద్ర మోడీ ప్రభుత్వం 'ప్రతి భారతీయుని ఆరోగ్యానికీ హామీ' ఇస్తోంది, ఎలాగో తెలుసా? రోజుకు ఒక్కో వ్యక్తికి 3 రూపాయలు ఖర్చు చేయడం ద్వారా. భారత దేశం జిడిపిలో కేవలం 1.02 శాతం మాత్రమే ఆరోగ్యం మీద ఖర్చు సేస్తోంది. (జాతీయ ఆరోగ్య నివేదిక 2018 ప్రకారం)

భారత ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం మీద 2015-16లో 16 డాలర్లు (సుమారు రూ. 1200) ఖర్చు చేసింది. అదే సమయంలో స్విట్జర్లాండు ప్రభుత్వం వారి దేశ పౌరులు ఒక్కొక్కరికి 6,944 డాలర్లు (సుమారు 5 లక్షల 20 వేల రూపాయలు) ఖర్చు చేసింది. అమెరికా 4,802 డాలర్లు (రూ 3 లక్షల 60 వేలు) బ్రిటన్ 3,500 (రూ. 2 లక్షల 60 వేలు) ఖర్చు చేశాయి.

ప్రభుత్వ పరంగా భారత దేశం కన్నా పొరుగున ఉన్న చిన్న దేశాలు ఎక్కువ ఖర్చు చేస్తున్నాయి. భూటాన్ జిడిపిలో 2.5 శాతం, శ్రీలంక (1.6 శాతం) నేపాల్ (1.1) శాతం ఖర్చు చేస్తున్నాయి.

జాతీయ ఆరోగ్య లెక్కల ప్రకారం ప్రభుత్వం ఒక్కో భారతీయుని మీద రోజుకు రూ. 3 చొప్పున ఏడాదికి రూ. 1,108 ఖర్చు చేస్తుంటే భారతీయులు మాత్రం తమ స్వంత జేబుల్లోనుండి సగటున ఒక్కొక్కరూ రూ 2,394 ఖర్చు చేస్తున్నారు. అంటే వైద్యం ఖర్చుల్లో సగటు భారతీయుడు 63 శాతాన్ని స్వంతంగా భరిస్తున్నాడన్నమాట. ప్రపచంలోనే ఇది చాలా ఎక్కువ. ఈ విషయంలో ప్రపంచంలో సగటు వ్యక్తి జేబులోంచి ఖర్చు చేసేది 18.2 శాతం మాత్రమే.

భారత దేశంలో ప్రతి ఏటా 7 శాతం మంది ప్రజలు ఆరోగ్యానికి ఖర్చుచేయడం వల్ల ఉన్నదంతా పోగొట్టుకుని పేదరికంలోకి జారిపోతున్నారు. ఒక దశాబ్ద కాలంగా ఇలా జరుగుతున్నందున 23 శాతం మంది జబ్బు చేస్తే అసలు వైద్యం ఖర్చు భరించలేని స్థితికి వెళ్లిపోయారు.

(డౌన్ టు ఎర్త్ పత్రిక నుండి ఈ వివరాలు సేకరించబడ్డాయి)

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా** **పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు....................................................
వీధి..............................................................
గ్రామం.........................................................
మండలం లేదా పట్టణం........................................
జిల్లా............................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.16, No.1. Published on June 1, 2021